www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
మంగళవారం | 1-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 185
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం, తిథి: చతుర్దశి రా. 9.40 తదుపరి అమావాస్య, నక్షత్రం: పుబ్బ ఉ. 9.16 తదుపరి ఉత్తర, వర్జ్యం: సా.5.24-7.12, దుర్ముహూర్తం: ఉ.8.31-9.18, రా.9.59-10.46: అమృతఘడియలు: తె.5.14-6.03, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.08, సూర్యాస్తమయం: 6.00
వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మిథున్ చక్రవర్తికి దాదాసాహెబ్ ఫాల్కే



హిందీ, బెంగాలీ, భోజ్‌పురి, ఒరియాలో 370 చిత్రాల్లో నటన
గోపాల గోపాల చిత్రంతో టాలీవుడ్‌లోకి ప్రవేశం
ఈ ఏడాదే పద్మభూషణ్‌కు ఎంపిక
స్వల్ప వ్యవధిలోనే మరో అవార్డు
ఈ నెల 8న పురస్కారం ప్రదానం

10

తొలి చిత్రంతోనే జాతీయ అవార్డ్ అందుకున్న.. 'ఐయామే డిస్కో డాన్సర్' అంటూ ఉర్రూతలూగించిన.. 80వ దశకంలో హిందీ సినిమాపై ఎంతో ప్రభావం చూపిన.. హీరో అనే పదానికి అర్థం మార్చేసిన మిథున్ చక్రవర్తికి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును ప్రకటించింది.



డీఎస్సీ ఫలితాలు విడుదల చేస్తున్న సీఎం రేవంత్, మంత్రి దామోదర, కేకే

ఉపాధ్యాయ వృత్తి ఉద్యోగం కాదు..

భావోద్వేగం

డీఎస్సీ ఫలితాల ప్రకటన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి
అభ్యర్థుల కుటుంబాల్లో దసరాకు ముందే పండగని వ్యాఖ్య
9వ తేదీన ఎల్బీస్టేడియంలో నియామక పత్రాలు అందజేత
నేటి నుంచి ధ్రువపత్రాల తనిఖీ.. 1:1 నిష్పత్తిలో ఎంపిక
తర్వాత జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వెబ్ ఆప్షన్లు.. పోస్టింగ్

హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి ఉద్యోగం కాదని భావోద్వేగం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నిరుద్యోగం అనే అంశం తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉందని, నియామకాలే లక్ష్యంగా తెలంగాణ ఉద్యమం సాగిందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో ఉద్యోగాల భర్తీ నిరంతర ప్రక్రియ అని చెప్పారు. సోమవారం డీఎస్సీ-2024 ఫలితాలను సచివాలయంలో రేవంత్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం

మిగతా 11వ పేజీలో...

కుటుంబం ఫొటో తీసుకోవడం..
ఒక ఆప్షన్ మాత్రమే

పైలట్ ప్రాజెక్టులో పొరపాట్లుంటే
స్థితిగతులపై నివేదిక ఇవ్వండి
అధికారులకు సీఎం ఆదేశాలు
ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై సమీక్ష
3 నుంచి 7 వరకు బృందాల టూర్
రాష్ట్రంలో 238 చోట్ల ప్రక్రియ

11

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

ఇవేం కూల్చివేతలు?

వ్యక్తి చనిపోయే ముందు కూడా చివరి కోరిక ఏంటని అడుగుతారు. ఓ భవనాన్ని కూల్చేముందు దాని యజమానికి చివరి అవకాశం ఇవ్వరా?
- హైకోర్టు

హైడ్రాపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం.. ప్రభుత్వ భూములను కాపాడే పద్ధతి ఇది కాదు

రికార్డులు పరిశీలించకుండా కూల్చివేతకు యంత్రాలివ్వడమేంటి?
హైకోర్టునూ కూలుస్తామని యంత్రాలు అడిగితే ఇచ్చేస్తారా?
ఆదివారం కూల్చివేతలు ఎలా చేపడతారు?
రాజకీయ బాస్‌లు చెప్పినట్లు చేస్తే ఇబ్బందుల్లో పడతారు.. ఇలాగైతే జైళ్లకు పంపుతాం
ఆదేశాలు పాటించకుంటే హైడ్రా జీవోపై స్టే
ట్రాఫిక్ రద్దీపై ఏం చర్యలు తీసుకున్నారు?
కావూరి హిల్స్, అమీన్‌పూర్‌కు మధ్య వివక్షేల?
పెద్దలను వదిలేసి.. పేదలను కొడుతున్నారు
కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేస్తాం
సహజ న్యాయసూత్రాలు అంటే తెలియదా?
హైడ్రా కమిషనర్ రంగనాథ్, అమీన్‌పూర్ తహసీల్దార్ రాధపై ధర్మాసనం ఫైర్



హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాల పేరుతో హైడ్రా కూల్చివేతలు చేపడుతున్న తీరు పట్ల హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులకు విరుద్ధంగా ఆదివారం కూల్చివేతలు చేపట్టడమేంటని ప్రశ్నించింది. కూల్చివేతల సమయంలో సహజ న్యాయ సూత్రాలను కూడా పాటించడంలేదని తప్పుబట్టింది. రికార్డులు పరిశీలించకుండానే.. తహసీల్దార్ అడిగారంటూ కూల్చివేతలకు సిబ్బందిని, యంత్రాలను ఎలా కేటాయిస్తారంటూ హైడ్రా కమిషనర్‌పై మండిపడింది. హైకోర్టు భవనాన్ని కూల్చివేస్తామంటూ చార్మినార్ తహసీల్దార్ యంత్రాలు అడిగితే ఇస్తారా? అని ప్రశ్నించింది. కోర్టు తీర్పులను ఉల్లంఘించి

మిగతా 13వ పేజీలో...

హైడ్రా కోసం 374-బీ

మునిసిపల్ చట్టంలో ఈ సెక్షన్ చేరుస్తూ ఆర్డినెన్స్
10 రోజుల క్రితమే రాజ్‌భవన్‌కు ఫైల్
ఆమోదం కోసం ఎదురుచూపులు
హైడ్రాకు అదనపు అధికారాలు ఇస్తూ పలు జీవోలు

13

మూసీ మార్కింగ్
మాది కాదు

చెరువులు, నాలాల పరిరక్షణే లక్ష్యం
పేదలు, మధ్య తరగతి జోలికి వెళ్లం
సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం
హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడి



సిద్దుపై ఉచ్చు

ముడా స్కాంపై రంగంలోకి దర్యాప్తు సంస్థలు
మనీ లాండరింగ్ కేసు నమోదు చేసిన ఈడీ
లోకాయుక్త ఎఫ్ఐఆర్ అధ్యయనంలో సీబీఐ
రోజంతా ఇంటికే కర్ణాటక సీఎం పరిమితం
నా 14 ప్లాట్లను సరెండర్ చేసేస్తున్నా..
వెల్లడించిన సిద్దరామయ్య భార్య పార్వతి

బెంగళూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మైసూర్ నగరాభివృద్ధి సంస్థ(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు కుంభకోణంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ఉచ్చు బిగుస్తోంది. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రంగంలోకి దిగాయి. మరోవైపు సిద్దరామయ్య భార్య పార్వతి తనకు కేటాయించిన 14 ప్లాట్లను సరెండర్ చేస్తున్నట్లు నెలరోజుల క్రితం ముడా కమిషనర్‌కు రాసిన లేఖ.. సోమవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇప్పటికే ఈ వ్యవహారంపై లోకాయుక్త పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఏ1గా.. ఏ2, ఏ3లుగా ఆయన భార్య బీఎం పార్వతి, బావమరిది మల్లికార్జున స్వామి, ఏ4గా భూ యజమాని దేవరాజు ఉన్నారు. ఈడీ, సీబీఐ కూడా

మిగతా 2వ పేజీలో...



మరిన్ని వీసాలు!

అదనంగా 2.5 లక్షల అమెరికా వీసా అపాయింట్‌మెంట్లు
పర్యాటకులు, నిపుణులైన కార్మికులు, విద్యార్థులకు కేటాయింపు

2

రుణమాఫీ పూర్తయ్యేదాకా వదలం

రైతులకిచ్చిన హామీలు నెరవేర్చేదాకా వెంటాడతాం
అన్నదాతల ఓట్లతో అధికారంలోకి వచ్చి వారికే దగా
కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై బీజేపీ నాయకుల ధ్వజం
హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద రైతుదీక్ష ప్రారంభం
రేవంత్‌రెడ్డి.. మరో గజినీ అయ్యావా: మహేశ్వర్‌రెడ్డి
ముఖ్యమంత్రికి అధికారం తలకెక్కింది: ఎంపీ ఈటల
రైతులను కాంగ్రెస్ ముంచుతోంది: విశ్వేశ్వర్‌రెడ్డి


రైతుదీక్ష వేదికపై నిద్రిస్తున్న ఈటల, మహేశ్వర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్/కవాడిగూడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో రైతాంగానికి ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసేదాకా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడతామని బీజేపీ తేల్చిచెప్పింది. ముఖ్యంగా రూ.2లక్షల రుణమాఫీని సంపూర్ణంగా అమలు చేసేవరకూ వదలిపెట్టబోమని హెచ్చరించింది. బీఆర్ఎస్‌లాగే మోసం చేస్తూ ఉంటే చూస్తూ ఊరుకోబోమని కుండబద్దలు కొట్టింది. లక్షలాది మంది రైతాంగానికి అండగా ఉంటామని ప్రకటించింది. రూ.2 లక్షల రుణమాఫీకి ఆంక్షలెందుకు విధించారని నిలదీసింది. రైతుల ఓట్లతోనే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వారినే దారుణంగా మోసం చేస్తోందని మండిపడింది. ఇప్పటి వరకు ఎంత మంది రైతులకు రుణమాఫీ చేశారో అధికారిక ప్రకటన విడుదల చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. కాంగ్రెస్‌కు హైదరాబాద్ నగరంలో ఓట్లు రాలేదని.. అందుకే ఇక్కడ పేదల ఇళ్లను కూల్చుతోందని ధ్వజమెత్తింది. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ సంపూర్ణంగా అమలు చేయాలని, రూ.15 వేల రైతు భరోసా వెంటనే అందించాలని, రైతు కూలీల ఖాతాల్లో రూ. 12 వేలు జమచేయాలని డిమాండ్ చేస్తూ బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు సోమవారం ఇందిరాపార్కు సమీపంలోని ధర్నా చౌక్‌లో రైతు హామీల

మిగతా 14వ పేజీలో...



బీమా భారం?

నేటి నుంచి అమల్లోకి సవరించిన పాలసీ సరెండర్ వాల్యూ మార్గదర్శకాలు
'చిన్న మొత్తాల' పొదుపు రేట్లు యథాతథం



తిరుమల లడ్డూపై
మీ వైఖరేమిటి?

రాష్ట్ర సిట్‌నే కొనసాగించాలా?.. కేంద్ర దర్యాప్తు అవసరమా?
3 నాటికి స్పష్టత ఇవ్వండి.. కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం
దేవుడిని అయినా రాజకీయాలకు దూరంగా ఉంచాలి
నెయ్యి కల్తీ అయినట్టుగా ఆధారాలు ఉంటే చూపాలి
విచారణ పూర్తి కాకుండానే ముఖ్యమంత్రి మీడియా ముందు మాట్లాడడమేంటి?.. ధర్మాసనం వ్యాఖ్య

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ అపవిత్రమైన వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ స్థాయిలో దర్యాప్తు అవసరమా? లేదా అన్న విషయంపై స్పష్టత ఇవ్వాలని సుప్రీంకోర్టు కోరింది. వచ్చే గురువారం వరకు కేంద్రం తన వైఖరిని తెలియజేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు అత్యున్నత న్యాయస్థానం సూచించింది. తిరుమల లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి లేదా సీబీఐ నేతృత్వంలో విచారణ జరిపించాలని, కోట్లాది మంది భక్తుల మనోభావాలకు సంబంధించిన విషయమైనందున అందరికీ నిజం తెలియాలంటూ సుప్రీంకోర్టులో ఐదు వేర్వేరు పిటిషన్లు దాఖలయ్యాయి. ఇందులో.. బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్యస్వామి, టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డితోపాటు చరిత్రకారుడు డాక్టర్ విక్రమ్ సంపత్, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు దుష్యంత్ శ్రీధర్ కలిపి దాఖలు చేసిన మరో పిటిషన్ సోమవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు వచ్చింది. అయితే.. ఆ మూడు పిటిషన్లతోపాటు తన పిటిషన్‌ను సైతం కలిపి విచారించాలని సురేశ్ చవాంకే తరఫున సీనియర్ న్యాయవాది సోనియా మాథుర్ కోరారు. స్వతంత్ర సంస్థతో దర్యాప్తును

మిగతా 3వ పేజీలో...

కుల గణనకు మార్గదర్శకాలెప్పుడు?

స్పష్టత కోసం బీసీ కమిషన్ ఎదురుచూపులు
బీసీ గణనా? సమగ్ర కులాల గణనా?
ప్రకటనలతోనే సరిపెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం
బీసీ సంఘాల నుంచి పెరుగుతున్న ఒత్తిడి
కుల గణన కోసమే స్థానిక ఎన్నికల వాయిదా

హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త బీసీ కమిషన్ ఏర్పాటై దాదాపు నెల రోజులు కావస్తోంది. ఈ కమిషన్‌పై కుల గణన అనే బృహత్తరమైన బాధ్యత ఉంది. దానిని సవాలుగా తీసుకొని పని చేయడానికి కమిషన్ కూడా సిద్ధంగా ఉంది. కానీ, కుల గణన చేపట్టేందుకు బీసీ కమిషన్‌కు ప్రభుత్వం ఇప్పటికీ మార్గదర్శకాలు (టీవోఆర్) ఇవ్వలేదు. దీంతో ఏం పని చేయాలో తోచని స్థితిలో కమిషన్ ఉంది. కమిషన్‌ను ఎందుకు నియమించారో, అది ఎలాంటి విధులు నిర్వహించాలో చెప్పేదే టీవోఆర్. కాగా, బీసీ కమిషన్‌ను ఏర్పాటు

మిగతా 3వ పేజీలో...

తెలంగాణలో బుల్డోజర్ రాజ్

రాహుల్ జీ స్పందించండి.. చట్టాలను గౌరవించమని చెప్పండి
రేవంత్‌కి నిరంకుశ పాలన.. కాంగ్రెస్ అగ్రనేతకు హరీశ్ లేఖ 13
ఆనంద కన్వెన్షన్‌పై ఆరోపణలు.. ఎంపీ అనిల్‌కుమార్‌కు నోటీసులు
ఢిల్లీకి 25 వేల కోట్లు పంపేందుకు పేదలు బలి: కేటీఆర్ ధ్వజం 14

ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించాకే
చర్యలు చేపట్టాలి

మూసీపై సర్కార్‌కు హైకోర్టు ఆదేశాలు 13
ప్రత్యామ్నాయంతోనే ముందుకు..: ప్రభుత్వం

262 ఇళ్ల మార్కింగ్ పెండింగ్..
మూసీ రివర్‌బెడ్‌లో 1,333 ఇళ్లకు పూర్తి
డబుల్ బెడ్‌రూంలోకి 129 కుటుంబాలు


ఇజ్రాయెల్ దాడులతో ఇంటిని వీడి.. బీరుట్ వీధుల్లో నిద్రిస్తున్న బాలుడు

లెబనాన్‌లోకి ఇజ్రాయెల్!

అమెరికాకు సమాచారం.. సరిహద్దుల్లో వైదొలగిన లెబనాన్ ఆర్మీ
యుద్ధ ట్యాంకులతో అల్-వజానీ, అల్-ఖియామ్ వైపు ఐడీఎఫ్
డమాస్కస్‌పై దాడులు.. లెబనాన్‌లో పదుల సంఖ్యలో మరణాలు
ఇజ్రాయెల్‌పై ఇరాక్, ఇరాన్, సిరియా దాడులకు అవకాశం
లెబనాన్‌కు ఐఆర్‌జీసీ.. సిరియాకు హిజ్బుల్లా నాయకులు
ఇరాన్ ప్రేరేపిత ఉగ్రవాదులను మట్టుబెడతాం: నెతన్యాహు
నెతన్యాహుకు మోదీ ఫోన్.. ఉగ్రవాదానికి చోటు లేదని వ్యాఖ్య

టెల్‌అవీవ్, సెప్టెంబరు 30: హిజ్బుల్లా అంతమే లక్ష్యంగా కంకణం కట్టుకున్న ఇజ్రాయెల్ సేనలు.. సోమవారం అర్ధరాత్రి దాటాక లెబనాన్ భూభాగంలోకి చొచ్చుకెళ్లాయి. సోమవారం ఉదయం నుంచే అమెరికా వార్తా సంస్థలు సీఎన్ఎన్, వాషింగ్టన్ పోస్ట్ తమ వెబ్ ఎడిషన్లలో భూతల దాడులకు సర్వం సిద్ధం అంటూ కథనాలను అప్‌డేట్ చేస్తున్నా.. ఇజ్రాయెల్ మాత్రం అర్ధరాత్రి అధికారికంగా నిర్ధారించింది. ముందుగానే హెచ్చరికలు జారీ చేయడంతో లెబనాన్ సైన్యం సరిహద్దుల్లోని రమిష్, అబూషానన్ ప్రాంతాల్లోని పోస్టుల్లోంచి వెనక్కి వెళ్లినట్లు లెబనాన్ వార్తాపత్రిక అల్-నహర్ వెల్లడించింది. రాత్రి కడపటి వార్తలందేసరికి

మిగతా 2వ పేజీలో...

సూచీల భారీ పతనం.. సెన్సెక్స్ 1,272 పాయింట్లు డౌన్ 12



14

దసరాకు 6 వేల
ప్రత్యేక బస్సులు

హైదరాబాద్ శివార్ల నుంచి కూడా..
నేటి నుంచే ప్రత్యేక బస్సుల సర్వీసులు
9, 10, 11న రద్దీని బట్టి..: సజ్జనార్



సచివాలయ ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధం

సీఎం సంతకం.. నేడో-రేపో ఉత్తర్వులు
ఉద్యోగులు 3 విభాగాలుగా విభజన 11
తొలుత ఎస్‌వోలు, తర్వాత ఉన్నతాధికార్లు

వాయుసేన కొత్త చీఫ్‌గా అమర్ ప్రీత్ సింగ్



» హైదరాబాద్‌తో ప్రత్యేక అనుబంధం

అల్వాల్, న్యూఢిల్లీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భారత వాయసేన కొత్త చీఫ్‌గా ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వీఆర్ చౌదరి స్థానంలో ఆయన నియమితులయ్యారు. అమర్ ప్రీత్ సింగ్ ఇంతకుముందు ఎయిర్‌ఫోర్స్ ఉప అధిపతిగా ఉన్నారు. వైమానిక దళ నూతన అధిపతిగా బాధ్యతలు స్వీకరించిన అమర్ ప్రీత్ సింగ్‌కు హైదరాబాద్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయన దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ నుంచి 1984 డిసెంబరు 21న నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో నియామకం పొందారు. 1964 అక్టోబరు 27న అమర్‌ప్రీత్ సింగ్ జన్మించారు. 1984 డిసెంబరులో భారత వాయుసేనలోని యుద్ధరంగ పైలట్ విభాగంలో చేరారు. యుద్ధ పైలట్‌గా పలు రకాల యుద్ధ విమానాలపై అమర్‌ప్రీత్ సింగ్‌కు 5వేల గంటలకుపైగా ఫ్లయింగ్ అనుభవం ఉంది. ఆయన చేసిన సేవలకుగాను కేంద్ర ప్రభుత్వం నుంచి పరమ్ విశిష్ట్ సేవ, అతి విశిష్ట్ సేవా పతకాలను పొందారు.

దేశీయ గోవుకు 'రాజ్యమాత-గోమాత' హోదా!

» ఆమోదముద్ర వేసిన మహారాష్ట్ర క్యాబినెట్

ముంబై, సెప్టెంబరు 30: మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల ముందు ఏక్‌నాథ్ శిందే సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. దేశవాళీ ఆవులకు 'రాజ్యమాత-గోమాత' హోదా కల్పించింది. సోమవారం సీఎం ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలో భేటీ అయిన క్యాబినెట్ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కొద్ది నెలల్లో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో శిందే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఇక చారిత్రక రికార్డుల ఆధారంగా కుంబీ-మరాఠా, మరాఠా-కుంబీ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు అవసరమైన ప్రొటోకాల్‌ను ఖరారు చేస్తూ జస్టిస్ శిందే కమిటీ ఇచ్చిన రెండు, మూడు రిపోర్టులకు కూడా మహారాష్ట్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది.

కుమారస్వామిని పంది అనలేదు.. అది సామెత!

» లోకాయుక్త ఏడీజీపీకి కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర్ సమర్థన.. ఏడీజీపీపై చర్యలకు జేడీఎస్ వినతి

బెంగళూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి కుమారస్వామిని పంది అని లోకాయుక్త ఏడీజీపీ చంద్రశేఖర్ లేఖలో ప్రస్తావించలేదని కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర్ వెల్లడించారు. సోమవారం బెంగళూరులో పరమేశ్వర్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఐరిష్ రచయిత జార్జ్ బెర్నార్డ్ షా వ్యాఖ్యలను ఏడీజీపీ లేఖలో పొందుపరిచారు. సామెతలు, పెద్దల అభిప్రాయాలను అప్పుడప్పుడు ప్రస్తావించడం సహజం. అంతమాత్రాన కుమారస్వామి తనకు ఎందుకు అన్వయించుకోవాలి? అప్లికేషన్ ఆఫ్ మైండ్ కూడా ముఖ్యం' అని వ్యాఖ్యానించారు. దర్యాప్తును అడ్డగిస్తే పోలీసులు చర్యలు తీసుకుంటారని, వారికీ నిబంధనలు ఉంటాయని తేల్చిచెప్పారు. అంతకుముందు కుమారస్వామిని ఏడీజీపీ పందితో పోల్చారంటూ జేడీఎస్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏడీజీపీ చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకోవాలంటూ విధానసౌధలో చీఫ్ సెక్రటరీని కలిసి వినతి పత్రం సమర్పించారు.

తాత్కాలిక డీజీపీల నియామకంపై ఏడు రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు

» తెలంగాణ, ఏపీలకు కూడా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తాత్కాలిక డీజీపీల నియామకంపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా ఏడు రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కొన్ని రాష్ట్రాలు నిబంధనలకు విరుద్ధంగా తాత్కాలిక డీజీపీలను నియమిస్తుండడాన్ని సవాలు చేస్తూ ఈ ఏడాది ఆగస్టు 8న సావిత్రి పాండే సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నిబంధనల ప్రకారం.. డీజీపీ పోస్టు ఖాళీ అవడానికి మూడు నెలల ముందే యూపీఎస్సీ ఛైర్మన్ అధ్యక్షతన ఒక కమిటీకి రాష్ట్రప్రభుత్వం సీనియారిటీ ప్రకారం పేర్లను పంపించాలి. కనీసం ఆరు నెలల సర్వీసు ఉన్న డీజీ ర్యాంకు అధికారులందరి జాబితాను కమిటీకి పంపాలి. ఆ కమిటీ మెరిట్, సీనియారిటీ ఆధారంగా ముగ్గురు పేర్లను ఖరారు చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆ ముగ్గురిలో ఒకరిని డీజీపీగా నియమించుకోవాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం ఏపీ, తెలంగాణ, పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్, ఝార్ఖండ్‌లలో తాత్కాలిక డీజీపీలు మాత్రమే ఉన్నారని ఆ పిటిషన్‌లో తెలిపారు. దీనిపై సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. సమాధానం చెప్పాలని ఏడు రాష్ట్రాలతోపాటు కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. ఆరువారాల్లో అఫిడవిట్లు సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబరు 19 వరకు వాయిదా వేసింది.

మోదీ పద్మవ్యూహంలో జనం: రాహుల్

చండీగఢ్, సెప్టెంబరు 30: దేశ ప్రజలు ప్రధాని మోదీ పన్నిన 'చక్రవ్యూహం'లో చిక్కుకున్నారని కాంగ్రెస్‌నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. చక్రవ్యూహాన్నే 'పద్మవ్యూహమ'ని కూడా అంటారంటూ బీజేపీ ఎన్నికల గుర్తుపై విమర్శలు గుప్పించారు. రెండు నిమిషాల్లో దేశ యువత దీన్ని ఛేదిస్తారన్నారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం కురుక్షేత్ర జిల్లాలోని తానేశ్వర్‌లో జరిగిన ప్రచారసభలో ప్రసంగించారు. "పేదల జేబుల్లోని డబ్బులు గుంజి కొంతమంది కోటీశ్వరులకు కట్టబెట్టడమే బీజేపీ అమలు చేస్తున్న 'చక్రవ్యూహం'. మహాభారతంలోని చక్రవ్యూహంలో వేలాది మంది సైనికులు పాల్గొంటే ఇప్పటి చక్రవ్యూహాన్ని కేవలం ఆరుగురే అమలు చేస్తున్నారు. వారే మోదీ, అమిత్ షా, అదానీ, అంబానీ, అజిత్ దోవల్, మోహన్ భాగవత్. పేదల సొమ్ము 20-25 మంది కుబేరులకు చెందేలా చేయడమే వారి ఆశయం" అన్నారు.

మూలకణ చికిత్సతో మధుమేహం నయం

బీజింగ్, సెప్టెంబరు 30: జీవన విధానంతో సంబంధంలేకుండా చిన్న వయసులోనే వచ్చే టైప్-1 మధుమేహాన్ని మూలకణ చికిత్సతో నయం చేసినట్లు చైనా శాస్త్రవేత్తలు ప్రకటించారు. 11ఏళ్లుగా టైప్-1 డయాబెటిస్‌తో బాధపడుతున్న తియాంజెన్‌కు చెందిన ఓ 25ఏళ్ల మహిళకు మూలకణ చికిత్సతో ఆమె ఇన్సులిన్ స్థాయులను అదుపులోకి తెచ్చినట్లు పెకింగ్ వర్సిటీ వైద్య కేంద్రం పరిశోధకులు తెలిపారు. రోగి మూలకణాలను ప్రత్యేక కెమికల్ అణువులతో రీప్రోగ్రామ్ చేసి వాటిని ఆమె పొత్తి కడుపు కింది కండరంలో క్లోమ గ్రంధికి దగ్గరగా ట్రాన్స్‌ప్లాంట్ చేశామని, ఆ కణాలు ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తాయని చెప్పారు. భవిష్యత్తులో రోగ నిరోధక శక్తిపై ఏమాత్రం ప్రభావం పడకుండా రోగి శరీరంలోని అడిపోస్ కణజాలం నుంచి కణాలను సేకరించి ఈ ప్రక్రియను పూర్తిచేశారు.



కాంచీపురంలోని శివపార్వతుల విగ్రహాలపై తెలుగు శాసనం

చెన్నై, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కాంచీపురంలో ఉన్న ఏకాంబరేశ్వర ఆలయంలోని శివపార్వతుల విగ్రహాలపై తెలుగుశాసనం బయటపడింది. శివపార్వతులు, స్కంధ విగ్రహాల పీఠంపై ఈ శాసనం లిఖించి ఉంది. ఇది 18వ శతాబ్దానికి చెందినదని పురావస్తు శాఖాధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఈ విగ్రహాలు అమెరికాలోని ఆసియన్ ఆర్ట్ మ్యూజియంలో భద్రపరిచారు. తొండమండల ప్రాంతానికి చెందిన వెల్లకొండమనాయని కుమారుడు, రాఘవనాయని ముదుమన్నరప్ప నాయని మనవడైన వెంకట్రామ నాయని ఏకాంబరేశ్వర ఆలయానికి 11 విగ్రహాలు బహూకరించినట్లు శాసనం పేర్కొంటోంది.

లెబనాన్‌లోకి ఇజ్రాయెల్!



లెబనాన్ సరిహద్దుల్లో ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు

(మొదటి పేజీ తరువాయి)

ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) యుద్ధట్యాంకులతో లెబనాన్‌లోని అల్-వజానీ, అల్-ఖియామ్ వైపు దూసుకెళ్తున్నట్లు తెలిసింది. ఆ ప్రాంతాల్లో యుద్ధట్యాంకులు, ఫిరంగులతో దాడులు జరిగినట్లు అల్-మనార్ పత్రిక ప్రతినిధి షోఫర్ నిర్ధారించినట్లు లెబనాన్ వార్తాసంస్థలు పేర్కొన్నాయి.

ఇజ్రాయెల్‌పై.. దాడులకు వ్యూహాలు..!

తాజా పరిణామాల నేపథ్యంలో ఇజ్రాయెల్‌పై దాడికి ఇరాక్, ఇరాన్, సిరియాలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఆయా దేశాల ముఖ్య నాయకులు సోమవారం చేసిన ప్రకటనలు.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇరాన్ ప్రజలను ఉద్దేశించి ఆంగ్లంలో ఇచ్చిన సుదీర్ఘ వీడియో సందేశం కూడా ఈ విషయాన్ని బలపరుస్తున్నాయి. ఇప్పటికే ఇజ్రాయెల్‌పై ఒకట్రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన ఇరాక్.. నేరుగా కదనరంగంలోకి దిగుతామని సూత్రప్రాయంగా వెల్లడించింది. ఇరాన్ వేల మంది రివల్యూషనరీ గార్డ్స్, ఫైటర్లను లెబనాన్‌కు తరలించింది. మరోవైపు అమెరికా కూడా పశ్చిమాసియాకు ముందుజాగ్రత్తగా అదనపు బలగాలను పంపుతుంది.

యుద్ధరంగంలోకి ఇరాక్?

ఇజ్రాయెల్‌పై యుద్ధానికి సిద్ధమని ఇరాక్ ఎంపీ యాసర్-అల్-హుస్సేనీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఖతార్‌కు చెందిన బ్రిటన్ వార్తాసంస్థ అల్-అరబి ఓ కథనాన్ని ప్రసారం చేసింది. "ఇరాక్ చమురు క్షేత్రాలను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకోనుందని, కీలక ప్రాంతాలపై దాడులకు సిద్ధమవుతోందని నిఘావర్గాలు మా ప్రధాని మహమ్మద్ షియా అల్-సుడానీకి సమాచారం అందించాయి. మా సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి మేం యుద్ధానికి సిద్ధమే" అని ఆయన వ్యాఖ్యానించినట్లు ఆ కథనంలో పేర్కొంది.

ఫైటర్లను లెబనాన్‌కు తరలించిన ఇరాన్

హిజ్బుల్లా చీఫ్‌తోపాటు.. తమ రివల్యూషనరీ గార్డ్స్ జనరల్ అబ్బాస్‌ను అంతమొందించిన ఇజ్రాయెల్‌పై ఇరాన్ అగ్గిమీద గుగ్గిలమవుతోంది. అంతకు ముందు సిరియాలోని డమాస్కస్‌పై ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడుల్లోనూ ఇరాన్ కమాండర్లు మృతిచెందారు. దీంతో ఇజ్రాయెల్‌పై ప్రతీకారానికి ఇరాన్ సిద్ధమైంది. హిజ్బుల్లాకు మద్దతుగా.. ఇరాన్ ఫైటర్లను, రివల్యూషనరీ గార్డ్స్‌ను వేల సంఖ్యలో లెబనాన్‌కు పంపినట్లు ఇజ్రాయెల్ వార్తా సంస్థలు కథనాలను ప్రచురించాయి.



సిరియా కేంద్రంగా..

అగ్ర నాయకత్వాన్ని కోల్పోయిన హిజ్బుల్లా.. హమాస్ ఉగ్రవాద సంస్థల ఫీల్డ్ కమాండర్లు రెండ్రోజులుగా సిరియా బాట పట్టినట్లు ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ గుర్తించింది. అక్కడ ఉన్న ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) నాయకులతో వీరు భేటీ అవుతున్నారని, కలిసికట్టుగా ఇజ్రాయెల్‌పై దాడులకు సిద్ధమవుతున్నారని నిర్ధారించినట్లు ఇజ్రాయెల్ వార్తా సంస్థ 'వైనెట్' పేర్కొంది. మరోవైపు సిరియాపై జరుగుతున్న దాడులపై ఐక్య రాజ్య సమితి(ఐరాస) ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు హిజ్బుల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్ నయీం కాసీమ్ సోమవారం ఓ అరబిక్ టీవీ చానల్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ.. ఇజ్రాయెల్‌పై యుద్ధాన్ని కొనసాగిస్తామని, శత్రువు తమ భూభాగంలోకి ప్రవేశిస్తే గట్టి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. తమ మిలటరీ సామర్థ్యాన్ని ఇజ్రాయెల్ అంచనా వేయలేదని తెలిపారు. కాగా, ఐడీఎఫ్ వైమానిక దళం సోమవారం కూడా లెబనాన్‌పై భీకరదాడులు జరిపింది. ఆదివారం దాడుల్లో 105 మంది చనిపోయారు. ఆదివారం రాత్రి జరిపిన దాడిలో హిజ్బుల్లా మీడియం రేంజ్ మిసైల్స్ బృందం కమాండర్ ఈద్-హసన్ నెషార్‌ను అంతమొందించినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది.

ఏ దేశంలోనైనా చొరబడతాం

ఇరాన్ పౌరులను ఉద్దేశించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సుదీర్ఘ వీడియో సందేశం, లేఖను విడుదల చేశారు. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ చొరబడని ప్రదేశమంటూ లేదని చెబుతూనే.. ఇరాన్ పౌరులు మతోన్మాద శక్తుల ఉచ్చులో పడొద్దని హితవు పలికారు. "మతోన్మాదంతో మీ కలలను నాశనం చేసుకోవద్దు. మీలో మతోన్మాద విష బీజాలు నాటే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి. మా ప్రజలను, మా దేశాన్ని రక్షించుకునేందుకు మేం ఎక్కడిదాకా అయినా వెళ్తాం. మీరు ఒక్క విషయాన్ని ఆలోచించండి. మీ ప్రభుత్వం పాలనను పక్కనబెట్టింది. సంక్షేమానికి కాకుండా.. అనవసర యుద్ధాలకు బిలియన్ల డాలర్లు ఖర్చు చేస్తోంది. ఇరాన్‌కు స్వేచ్ఛ వస్తే.. పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. ఆ సమయం వచ్చేలోగా.. మీ ప్రభుత్వం ఐదు ఖండాల్లో విస్తరించిన ఉగ్రవాద నెట్‌వర్క్‌ను విచ్ఛిన్నం చేస్తాం. అదే జరిగితే.. ప్రపంచ పెట్టుబడులు ఇరాన్‌కు వస్తాయి. ఇరాన్ సుభిక్షంగా మారుతుంది. యూదు-పర్షియన్ ప్రజలు శాంతియుతంగా ఉంటారు" అని ఆయన వ్యాఖ్యానించారు. నెతన్యాహు సందేశాన్ని బట్టి.. ఆయన ఇరాన్‌పై దాడికి సిద్ధమవుతున్నారనే సంకేతాలు వెలువడుతున్నాయని, అందుకే.. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ సురక్షిత ప్రాంతానికి తరలి వెళ్లి ఉంటారని విశ్లేషకులు చెబుతున్నారు.

తోక ఉగ్ర సంస్థల ఖేల్ ఖతం!

హిజ్బుల్లా, హమాస్‌కు అనుబంధంగా పనిచేస్తున్న రెండు ఉగ్రవాద సంస్థలపై మొస్సాద్ అందించిన సమాచారంతో ఐడీఎఫ్ దాడులు జరిపింది. పాపులర్ ఫ్రంట్ ఫర్ ద లిబరేషన్ ఆఫ్ పాలస్తీనా(పీఎఫ్ఎల్‌పీ) సంస్థ హిజ్బుల్లాకు అనుబంధంగా పనిచేస్తోందని ఐడీఎఫ్ ఓ ప్రకటనలో తెలిపింది. ఆ సంస్థ చీఫ్ నిదల్ అబ్దుల్-అల్‌ను ఆదివారం రాత్రి జరిపిన రాకెట్ దాడుల్లో మట్టుబెట్టినట్లు ప్రకటించింది. పీఎఫ్ఎల్‌పీ మిలటరీ కమాండర్ ఇమాద్ ఓదేహ్‌ను కూడా అంతమొందించినట్లు తెలిపింది. అటు హమాస్ అనుబంధ సంస్థ లెబనాన్ ఎరీనాను కూడా టార్గెట్‌గా చేసుకున్నట్లు వివరించింది. ఈ సంస్థ హమాస్-హిజ్బుల్లా మధ్య సంధానకర్తగా పనిచేస్తోందని పేర్కొంది. సోమవారం జరిపిన దాడుల్లో లెబనాన్ ఎరీనా చీఫ్ ఫతా షరీఫ్‌ను హతమార్చినట్లు వెల్లడించింది.

ఉగ్రవాదానికి ప్రపంచంలో చోటు లేదు: మోదీ

ఉగ్రవాదానికి ప్రపంచంలో చోటు లేదని భారత ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సోమవారం ఆయన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితులు, ఉద్రిక్తతలపై చర్చించినట్లు మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. హమాస్ చెరలో ఉన్న ఇజ్రాయెల్ బందీలు సురక్షితంగా వెనక్కి రావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. పశ్చిమాసియాలో శాంతికి భారత్ కృషిచేస్తుందని పునరుద్ఘాటించారు.

లోకం తీరు



ఏకాకి జీవితమే ఆనందం!

» వృద్ధాప్యంలో ఒంటరి బతుకే తృప్తిగా ఉందంటున్న 47శాతం మంది



న్యూఢిల్లీ, సెప్టెంబరు 30: వృద్ధాప్యంలో ఒంటరి జీవితమే ఆనందంగా ఉందంటున్నారు వృద్ధులు. ఒంటరిగా బతుకున్న ప్రతి 100మంది వృద్ధుల్లో 47శాతం మందిది ఇదేమాట! 'ఏజ్ వెల్ ఫౌండేషన్' అనే సంస్థ ఒంటరిగా బతుకుతున్న వృద్ధులపై దేశవ్యాప్తంగా ఓ సర్వే నిర్వహించింది. ఇందులో భాగంగా పట్టణ, పల్లె ప్రాంతాల్లో 10వేలమందిని ప్రశ్నించింది. వీరిలో 41.9శాతం మంది ఎవ్వరి మీదా ఆధారపడకుండా గత ఐదేళ్లుగా పూర్తి స్వతంత్రంగా బతుకుతున్నామని చెప్పారు. వీరిలో 46.5 శాతం మహిళలు ఉండటం గమనార్హం. 46.9శాతం మంది 'వృద్ధాప్యంలో ఒంటరిగా ఉండటం' సంతోషంగా ఉందని చెప్పినా, 41.5శాతం తమకీ జీవితం తీవ్ర అసంతృప్తిగా ఉందని తేల్చి చెప్పారు. స్వతంత్రంగా బతకాలనే ఉద్దేశంతోనే ఒంటరిగా ఉండేందుకు ప్రాధాన్యమిచ్చామని 31శాతం మంది చెప్పారు. వ్యష్టి కుటుంబాలు పెరగడం, పిల్లలు మరోచోట ఉద్యోగాలు చేస్తున్న కారణంగా ఆర్థికంగా-సామాజికంగా ఇబ్బందులు పడుతున్నామని 26.7 శాతం మంది పేర్కొన్నారు. వృద్ధాప్యంలో ఒంటరిగా బతకడం వల్ల వ్యక్తిగత స్వేచ్ఛ ఉంటుందని 21.5శాతం మంది స్పష్టం చేశారు. అయితే ఒంటరిగా బతకడం వల్ల మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం పడుతుందని 41శాతం మంది ఆవేదన వ్యక్తం చేశారు. 10.4శాతం మంది ఎప్పుడూ ఒంటరిగా ఉన్నామనే భావనతో కాలంవెళ్లదీస్తున్నామని చెప్పారు.

గాలి జనార్దన్‌రెడ్డికి ఊరట

» బళ్లారి, అనంతపురం, కడప జిల్లాలకూ వెళ్లొచ్చు

» సుప్రీం కోర్టు ఉత్తర్వులు



బళ్లారి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): అక్రమ మైనింగ్ ఆరోపణలతో సీబీఐ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డికి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. గాలి జనార్దన్‌రెడ్డి ఇక నుంచి బళ్లారి, అనంతపురం, కడప జిల్లాలకూ వెళ్లవచ్చని సుప్రీంకోర్టు సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. గాలి జనార్దన్‌రెడ్డితో పాటు మరికొందరిపై 2009లో సీబీఐ కేసు నమోదు చేసింది. 2011 సెప్టెంబరు 5న జనార్దన్‌రెడ్డితో పాటు మరి కొందరిని సీబీఐ అరెస్టు చేసింది. ఈ కేసుకు సంబంధించి 2015లో గాలి జనార్దన్‌రెడ్డికి కండిషన్ బెయిల్ ఇచ్చారు. కేసు విచారణలో ఉన్నందున ఆయన బళ్లారి, కడప, అనంతపురం జిల్లాల్లో ప్రవేశించరాదని, తప్పని పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే తమ అనుమతి తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. 2021లో ఒకసారి, 2022లో ఒకసారి కోర్టు ఆయన్ను బళ్లారిలో ఉండేందుకు అనుమతించింది. కానీ అప్పట్లో సీబీఐ కోర్టులో కేసు విచారణలో ఉన్నందున జనార్దన్‌రెడ్డి సాక్షులను ప్రభావితం చేస్తారని టపాల గణేశ్ కోర్టుకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఆయన ఆ మూడు జిల్లాలకు రాలేదు. సుప్రీం ఉత్తర్వులతో గాలి జనార్దన్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. ఎక్స్ వేదికగా తన ఆనందాన్ని పంచుకున్నారు. 'బళ్లారి నేను పుట్టి పెరిగిన ఊరు. అక్కడ గాలి, నేల, జనాన్ని తాకక చాలా ఏళ్లు గడిచింది. దసరా నవరాత్రి ఉత్సవాలకు ఊరిలోకి అడుగు పెడుతాను. ముందుగా నేను గెలిచిన, నన్ను నమ్ముకున్న గంగావతికి వెళ్లి అక్కడి జనంతో మాట్లాడుతాను. అంజనాద్రి బెట్టను దర్శించుకుని బళ్లారికి వెళ్తాను. అక్కడ దుర్గామాతను దర్శించుకుని ఇంట్లో కాలు పెడతాను' అని గాలి పేర్కొన్నారు.

ప్రతిభావంతుడిని విద్యకు దూరం కానివ్వం!



ఆ దళిత యువకుడికి అడ్మిషన్ ఇవ్వండి

» ఐఐటీ-ధన్‌బాద్‌ను ఆదేశించిన సుప్రీంకోర్టు

» ఫీజు కట్టలేక సీటు కోల్పోయిన విద్యార్థికి ఊరట

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30: నిర్దేశిత గడువులోపు ఫీజు చెల్లించలేక ఐఐటీ-ధన్‌బాద్‌లో సీటు కోల్పోయిన దళిత యువకుడికి సుప్రీంకోర్టు బాసటగా నిలిచింది. ఆ యువకుడికి బీటెక్ కోర్సులో అడ్మిషన్ ఇవ్వాలని సోమవారం ఐఐటీ-ధన్‌బాద్‌ను ఆదేశించింది. 'ఇలాంటి ప్రతిభావంతుడైన ఒక యువకుడిని ఇలా వదిలేయలేం. అతను ఇలా అనాదరణకు గురికాకూడదు' అని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లా టిటోరా గ్రామానికి చెందిన దినసరి వేతన కార్మికుడి కుమారుడైన అతుల్ కుమార్‌కు ఐఐటీ-ధన్‌బాద్‌లో బీటెక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అడ్మిషన్ ఇప్పించేందుకు దేశ అత్యున్నత న్యాయస్థానం రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన విశేష అధికారాలను ఉపయోగించింది. 'పిటిషనర్ లాంటి అట్టడుగువర్గాలకు చెందిన ప్రతిభావంతుడైన విద్యార్థి ఉన్నత విద్యాభ్యాసం కోసం చేసే ప్రయత్నాలను ఇలా వదిలేయలేం. అతను సకాలంలో ఫీజు చెల్లించి ఉంటే, ఏ బ్యాచ్‌లోనైతే అడ్మిషన్ ఇచ్చేవారో అదే బ్యాచ్‌లో విద్యాభ్యాసం కొనసాగించేలా అతనికి అడ్మిషన్ ఇవ్వాలని ఐఐటీ-ధన్‌బాద్‌ను ఆదేశిస్తున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. అడ్మిషన్ పొందేందుకు అభ్యర్థి జూన్ 24వ తేదీలోపు అంగీకార రుసుము రూ.17,500 చెల్లించాల్సి ఉండగా, అతుల్ కుమార్ తల్లిదండ్రులు సకాలంలో ఆ డబ్బు చెల్లించలేకపోయారు. దీంతో ఐఐటీ-ధన్‌బాద్ అతనికి సీటు కేటాయించలేదు.

ఓ మాజీ చీఫ్‌జస్టిస్‌ను విచారించాలా?

సుప్రీంకోర్టు మాజీ సీజే జస్టిస్ రంజన్ గొగొయ్‌ను ప్రతివాదిగా చేర్చి విచారణ జరపాలంటూ పిల్ దాఖలుచేసిన వ్యక్తికి జస్టిస్ చంద్రచూడ్ చీవాట్లు పెటారు. జడ్జి పేరును రాతపూర్వకంగా తొలగిస్తేనే 'పిల్'పై నిర్ణయం తీసుకుంటామని పిటిషనర్‌కు తేల్చిచెప్పారు. కార్మిక చట్టాల కింద తన సర్వీసు రద్దు చేసిన వ్యవహారంలో వేసిన పిటిషన్‌ను జస్టిస్ రంజన్ గొగొయ్ కొట్టివేస్తూ 2018లో ఇచ్చిన తీర్పు వల్ల తనకు అన్యాయం జరిగిందని నాగ్‌పూర్‌కు చెందిన వ్యక్తి తన పిటిషన్‌లో వాదించారు. అందువల్ల జస్టిస్ రంజన్‌ను కూడా తన పిల్‌లో భాగం చేసి, ఆయనపై ఇన్-హౌస్ ఎంక్వైరీ (కోర్టు నియమించిన కమిటీ జరిపే విచారణ) చేయించాలని కోరారు. పిటిషనర్ విజ్ఞాపనపై చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ మండిపడ్డారు. "ఒక మాజీ చీఫ్‌జస్టిస్‌పైనే ఇన్-హౌస్ ఎంక్వైరీ కోరతారా? కొంచమైనా గౌరవం ఉండాల్సి న అవసరం లేదా? ఓడిపోయిన ఓ కేసులో ఇలా కోరడం ఏమిటి? దీన్ని మేం సహించబోం" అని ఆగ్రహించారు.

బాధిత ట్రైనీ డాక్టరు పేరు వెల్లడించొద్దు

కోల్‌కతాలోని ఆర్.జి.కర్ వైద్య కళాశాలలో అత్యాచారానికి, హత్యకు గురయిన ట్రైనీ డాక్టర్ ఫొటో, పేరును ఎక్కడా వెల్లడించకూడదని సోమవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆమె వివరాలను వికీపీడియా సహా సామాజిక మాధ్యమాల్లో ప్రచురించకూడదంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలు కొనసాగుతాయని తెలిపింది. సామాజిక మాధ్యమాల్లో బాధితురాలి ఫొటో, పేరు వస్తుండడంతో ఆమె తల్లిదండ్రులు బాధపడుతున్నారని న్యాయవాది వృందా గ్రోవర్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. కృత్రిమ మేధ ద్వారా వీడియోలు సృష్టించి ఆన్‌లైన్‌లో పెడుతున్నారని తెలిపారు. ఆమెపై సినిమా కూడా తీశారని, అది మంగళవారం యూట్యూబ్‌లో విడుదల కానుందని చెప్పారు. దీనిపై జస్టిస్ చంద్రచూడ్ స్పందిస్తూ తాము ఉత్తర్వులు ఇచ్చామని, అమలు చేయాల్సిన బాధ్యత సంబంధిత ఏజెన్సీలపై ఉందని తెలిపారు. కాగా, వైద్య కళాశాలల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు నత్తనడకన సాగుతోందంటూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్టోబరు 15 నాటికి ఈ పనులన్నింటినీ పూర్తి చేయాలని ఆదేశించింది.

భారతీయులకు అందుబాటులో మరో 2.5 లక్షల వీసా అపాయింట్‌మెంట్లు

అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): భారతదేశం నుంచి అమెరికా వెళ్లాలనుకుంటున్న వారికి ఆ దేశం శుభవార్త చెప్పింది. ఈ ఏడాది అదనంగా 2.5 లక్షల వీసా అపాయింట్‌మెంట్లను అందుబాటులో ఉంచుతున్నట్లు యూఎస్ ఎంబసీ ప్రకటించింది. పర్యాటకులు, నైపుణ్యం కలిగిన కార్మికులు, విద్యార్థులకు కలిపి వీటిని కేటాయించనున్నట్లు తెలిపింది. గత ఏడాది అత్యధికంగా 1.4 లక్షల మందికి విద్యార్థి వీసాలను ఇచ్చిన అమెరికా ఈ ఏడాది కూడా అత్యధిక స్టూడెంట్ వీసాలను జారీ చేయనుంది. 'ఈ కొత్త స్లాట్ల వల్ల వేలాది మందికి సమయానికి అమెరికా ప్రయాణం చేసే వెసులుబాటు కలుగుతుంది. వరుసగా రెండవ ఏడాది కూడా 10 లక్షల నాన్ ఇమిగ్రెంట్ వీసా దరఖాస్తులు అందాయి' అని ఎంబసీ పేర్కొంది. భారత్‌లోని అమెరికా రాయబారి గార్సెట్టి మాట్లాడుతూ, 'వీసా జారీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఎంబసీలోని అధికారులు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు' అని అన్నారు.

జీవిత బీమా ప్రీమియం పెరుగుతుందా?

» నేటి నుంచి అమల్లోకి సవరించిన పాలసీ సరెండర్ వాల్యూ మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30: జీవిత బీమా పాలసీల సరెండర్ విలువ సవరణకు సంబంధించి ఐఆర్‌డీఏఐ చేసిన ప్రతిపాదనలు మంగళవారం నుంచి అమల్లోకి రానున్నాయి. ఫలితంగా బీమా ప్రీమియంలు పెరగడమో లేదా ఏజెంట్ల కమీషన్ తగ్గడమో జరగవచ్చన్న అంచనాలు వెలువడుతున్నాయి. జీవిత బీమా పాలసీదారులు గడువుకన్నా ముందే తమ పాలసీలను సరెండర్ చేసినప్పుడు మెరుగైన ప్రతిఫలాలు అందించడానికి సంబంధించి సవరించిన సరెండర్ వాల్యూ మార్గదర్శకాలను ఈ ఏడాది తొలినాళ్లలో ఐఆర్‌డీఏఐ తెచ్చింది. ఇవి మంగళవారం నుంచి అమల్లోకి రానున్నాయి. కొందరు పాలసీదారులు పాలసీ గడువు ముగియడానికి ముందే తమ పాలసీని రద్దు చేసుకుంటారు. ఇలా చేయడాన్ని సరెండర్ అంటారు. పాలసీని సరెండర్ చేసినప్పుడు పాలసీదారుకు బీమా కంపెనీలు చెల్లించే మొత్తమే సరెండర్ విలువ.

నేటి నుంచి ఈ మార్పులు...

- క్యాష్, ఫ్యూచర్స్, ఆప్షన్స్ ట్రేడింగ్ లావాదేవీలకు సంబంధించిన ఫీజులను బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు మంగళవారం నుంచి మార్చుతున్నాయి. ఈక్విటీ డెరివేటివ్స్ సెగ్మెంట్‌లో సెన్సెక్స్, బ్యాంకెక్స్ ఆప్షన్స్ కాంట్రాక్టులకు రూ.కోటి ప్రీమియం టర్నోవరుపై ట్రాన్సాక్షన్ ఫీజును బీఎస్ఈ రూ.3,250 వసూలు చేయనుంది. ఇక క్యాష్ మార్కెట్‌కు లావాదేవీ రుసుమును రూ.లక్ష ట్రేడింగ్ విలువకు రూ.2.97గా ఎన్ఎస్ఈ నిర్ణయించింది.
- ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) ట్రేడింగ్ సెక్యూరిటీ లావాదేవీ పన్ను (ఎస్‌టీటీ) పెంపు అక్టోబరు 1 నుంచి అమల్లోకిరానుంది. ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై ప్రస్తుతం ఉన్న 0.0125% ఎస్‌టీటీని 0.02 శాతానికి పెంచారు. ఆప్షన్స్ ట్రేడింగ్‌పై 0.0625% ఎస్‌టీటీ ఉండగా.. 0.1 శాతానికి పెంచనున్నారు. అక్టోబరు ఒకటి నుంచి బైబ్యాక్ సందర్భంగా షేర్లు అమ్మినప్పుడు వచ్చే ఆదాయంపై పన్ను చెల్లించాల్సి వస్తుంది. బైబ్యాక్‌లో భాగంగా కంపెనీ తన వాటాదారుల నుంచి షేర్లను తిరిగి కొనుగోలు చేస్తుంది.
- ఆదాయ పన్ను వివాదాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించేందుకు ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రకటించిన వివాద్ సే విశ్వాస్ రెండో విడత పథకం మంగళవారం నుంచి అమల్లోకి రానుంది.

సిద్ధుపై ఉచ్చు

(మొదటి పేజీ తరువాయి)

రంగంలోకి దిగడంతో.. సిద్దరామయ్య ఇక ఏ క్షణంలోనైనా విచారణను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. లోకాయుక్త ఎఫ్ఐఆర్‌ను పరిగణనలోకి తీసుకొని ఈడీ అధికారులు ఈ అంశంపై సిద్దరామయ్య, ఆయన భార్య పార్వతి తదితరులపై సోమవారం మనీ లాండరింగ్ కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్(ఈసీఐఆర్)ను నమోదు చేశారు. దాని ప్రకారం ఈడీ సమన్లు జారీ చేసి, నిందితులను ప్రశ్నించనుంది. మరోవైపు లోకాయుక్త పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను సీబీఐ కూడా అధ్యయనం చేస్తున్నట్టు సమాచారం. ఇలా అన్ని వైపుల నుంచి ముఖ్యమంత్రికి ఉచ్చు బిగుస్తోంది. వివిధ కార్యక్రమాల షెడ్యూల్ ఉన్నా.. ముఖ్యమంత్రి సోమవారం అధికారిక నివాసంలోనే గడిపారు. మరోవైపు, ముడా కమిషనర్‌కు సిద్దరామయ్య భార్య పార్వతి తన 14 ప్లాట్లను సరెండర్ చేస్తున్నట్లు నెలక్రితం ఓ లేఖ రాశారు. ఈ లేఖ తాజాగా వైరల్ అవుతోంది. మైసూరు తాలూకా కేసరే గ్రామంలోని సర్వే నంబర్ 464లో 3 ఎకరాల 16 గుంటల భూసేకరణకు పరిహారంగా విజయనగర ఫేస్-3, 4లలో తనకు కేటాయించిన 14 ప్లాట్లను తిరిగి ఇస్తున్నట్లు పేర్కొన్నారు. తన భర్తపై 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి మచ్చ లేదని, ఆయనపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు.

నైరుతి నిష్క్రమణ..ముగిసిన 4 మాసాల సీజన్

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి) : నైరుతి రుతుపవనాల సీజన్ సోమవారం ముగిసింది. వాతావరణ మార్పుల ప్రభావంతో ఈ సీజన్‌లో తొలిసారిగా దేశంలో అసాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. అనేకచోట్ల కుంభవృష్టిగా వర్షాలు కురిశాయి. నైరుతి 4 నెలల సీజన్‌లో 868.6 మి.మీ.కి గాను 934.8 మి.మీ. (సాధారణం కంటే 8శాతం ఎక్కువ) వర్షపాతం నమోదైంది. తూర్పు, ఈశాన్య భారతంతోపాటు ఉత్తరాదిలోని పంజాబ్, జమ్ము కశ్మీర్, లద్దాఖ్‌లో తీవ్ర వర్షాభావం నెలకొంది.

తిరుమల లడ్డూపై మీ వైఖరేమిటి?

(మొదటి పేజీ తరువాయి)

ఆయన కోరుతున్నారు. సురేశ్ చవాంకే విజ్ఞప్తి మేరకు ధర్మాసనం నాలుగు పిటిషన్లనూ కలిపి విచారించింది. సుబ్రమణ్య స్వామి తరఫున సీనియర్ న్యాయవాది రాజశేఖర్ రావు, వైవీ సుబ్బారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి, సురేశ్ చవాంకే తరఫున సీనియర్ న్యాయవాది సోనియా మాథుర్, ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, టీటీడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హాజరయ్యారు. ఈ పిటిషన్ మొత్తం ప్రపంచంలో నివసించే కోట్లాది మంది ప్రజలను ప్రభావితం చేసేదని, ఎంతోమంది మనోభావాలకు సంబంధించినదని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. కోట్లాది మంది భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశంపై బహిరంగ ప్రకటనలు చేసేటప్పుడు ఆచితూచి వ్యవహరించాలని సూచించింది.

టీటీడీలో లడ్డూల తయారీకి కల్తీ నెయ్యి వాడినట్టు సీఎం చంద్రబాబు బహిరంగంగా ఆరోపణలు చేయడంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. కేసు విచారణలో ఉన్న సమయంలో ముఖ్యమంత్రి ఇలాంటి ప్రకటనలు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించింది. పరీక్షలు జరిపిన తర్వాత నెయ్యిని తిరస్కరించినట్టు, ప్రయోగశాలల నివేదికలు కూడా అదే విషయాన్ని ప్రాథమికంగా నిర్ధారించాయని న్యాయస్థానం గుర్తు చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో ప్రకటన ప్రకారం కల్తీ నెయ్యిని ఏనాడూ ఉపయోగించలేదని కొన్ని పత్రికలు నివేదించాయని ధర్మాసనం స్పష్టం చేసింది. మీరు రాజ్యాంగబద్ధమైన పదవిని నిర్వహిస్తున్నప్పుడు.. దేవుళ్లను రాజకీయాలకు దూరంగా ఉంచాలని ఆశిస్తున్నామని జస్టిస్ గవాయ్ అన్నారు.



రెండు ట్యాంకర్లను ఎన్‌డీడీబీకి పంపాం : సిద్ధార్థ లూథ్రా

టీటీడీ తరఫున వాదించిన సిద్ధార్థ లూథ్రా.. జూన్‌లో పంపిణీ చేసిన నెయ్యి అలాగే జూలై నాలుగు వరకూ అదే కంపెనీ సరఫరా చేసిన నెయ్యిని పరీక్షలకు పంపలేదని తెలిపారు. జూలై 6,12 తేదీల్లో రెండు ట్యాంకర్లలో కంపెనీ పంపిన నెయ్యిని ఎన్‌డీడీబీ పరీక్షల కోసం పంపినట్టు ఆయన వివరించారు. ఈ నమూనాల ప్రకారం నెయ్యి కల్తీ అయినట్టు తెలిసిందన్నారు. జూన్‌లోనూ, జూలై 4 వరకు సరఫరా చేసిన నెయ్యినీ లడ్డూల తయారీకి ఉపయోగించినట్టు ఆయన తెలిపారు. ఈ అంశంపై దర్యాప్తు తప్పనిసరి అని రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయ పడిందని, ఈ మేరకు సెప్టెంబరు 25న దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా దర్యాప్తు చేసేందుకు సిట్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. దర్యాప్తు జరుగుతున్న క్రమంలో రాజ్యాంగ హోదాలో ఉన్న ముఖ్యమంత్రి ప్రకటన చేయడం మంచిది కాదని కోర్టు అభిప్రాయ పడింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌నే కొనసాగించాలా? లేదా కేంద్ర దర్యాప్తు అవసరమా అనేది సొలిసిటర్ జనరల్ గురువారంలోపు తమకు తెలపాలని ధర్మాసనం ఆదేశించింది. అదేరోజుకు కేసు విచారణను వాయిదా వేసింది.

ముందస్తు బెయిల్ మంజూరు చేయండి

» హైకోర్టులో ఏఆర్ ఫుడ్స్ ఎండీ పిటిషన్

అమరావతి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి సరఫరా చేశారనే ఆరోపణలతో టీటీడీ మేనేజర్ (ప్రొక్యూర్‌మెంట్) ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తిరుపతి ఈస్ట్ పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోసం ఏఆర్ డెయిరీ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.రాజశేఖరన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అరెస్టుతో పాటు ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులివ్వాలని కోరారు. 'ఎఫ్ఐఆర్‌లో నాపై మోపిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలూ లేవు. దర్యాప్తునకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నాను. ముందస్తు బెయిల్ ఇవ్వండి' అని కోరారు.

కుల గణనకు మార్గదర్శకాలెప్పుడు?

(మొదటి పేజీ తరువాయి)

చేస్తూ సెప్టెంబరు 6న ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం.. టీవోఆర్‌ను విడిగా విడుదల చేస్తామని పేర్కొంది. కానీ, నెల రోజులు గడుస్తున్నా విడుదల చేయడంలేదు. వాస్తవానికి కుల గణన కోసమే బీసీ కమిషన్ ఏర్పాటయిందని, దాని తక్షణ కర్తవ్యం కూడా అదేననే రీతిలో అభిప్రాయం జనంలోకి వెళ్లింది. ముఖ్యమంత్రితోపాటు మంత్రులు పదే పదే అదే విషయం చెబుతున్నారు. బీసీ గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని అంటున్నారు. సెప్టెంబరు 9న బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు బాధ్యతలు స్వీకరించిన సమయంలో ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి.. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల గణనకు కట్టుబడి ఉందని, ఆ ప్రక్రియ పూర్తయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. కానీ, ఆచరణలోకి మాత్రం రావడంలేదు. దీంతో కుల గణన వెంటనే చెపట్టాలని, ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చినట్లుగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

ప్రభుత్వంపై బీసీ సంఘాల ఒత్తిడి..

కుల గణన కోసం బీసీ సంక్షేమ సంఘం ఇటీవల 'చలో హైదరాబాద్'కు పిలుపునిచ్చింది. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్.. ఆ సంఘం నాయకులతో మాట్లాడి కార్యక్రమాన్ని వాయిదా వేయించారు. కుల గణన తక్షణం చేపడతామని, మార్గదర్శకాలు రెండు మూడు రోజుల్లో వస్తాయని ప్రకటించారు. అయినా కార్యరూపం దాల్చలేదు. దీంతో రెండు రోజుల క్రితం బీసీ సంఘాలు, మేధావులు సదస్సు నిర్వహించి.. మార్గదర్శకాలు ఎందుకు ఆలస్యమవుతున్నాయని నిలదీశారు. మరోవైపు కొత్త బీసీ కమిషన్ బాధ్యతలు చేపట్టిన వెంటనే.. పాత కమిషన్ చైర్మన్‌ను, సభ్యులను పిలిపించుకొని వారు చేపట్టిన పనులపై ఆరా తీసింది. కుల గణనపై ఎలాంటి కసరత్తు చేశారో వివరాలు తెలుసుకుంది. తర్వాత మరో రెండు రోజులకే పంచాయతీరాజ్ విభాగం అధికారులతో సమావేశమై.. కుల గణనకు అవసరమయ్యే యంత్రాంగం, ప్రక్రియపై చర్చించింది. అనంతరం.. కుల గుణన విధివిధానాలపై చర్చించామని, త్వరలో జిల్లాల వారీగా క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్తామని ప్రకటించింది. రెండు మూడు రోజుల్లో షెడ్యూల్ ప్రకటిస్తామని తెలిపింది. అయితే వారం రోజులవుతున్నా ఎలాంటి ప్రకటన రాలేదు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. బీసీ కమిషన్ ఎలాంటి విధులు నిర్వహించాలో, దాని ఎజెండా ఏమిటో, ప్రాధాన్య క్రమం ఎలాంటిదో తెలుపుతూ ప్రభుత్వం తప్పనిసరిగా టీవోఆర్ విడుదల చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం బీసీ కమిషన్‌కు కులగణనే ప్రధాన కర్తవ్యంగా ప్రభుత్వం బాధ్యత అప్పగించే అవకాశం ఉంది. ఓటరు జాబితా ఆధారంగా బీసీ కులాల లెక్కలు తీయాలా? లేక ఇంటింటి సర్వేకు వెళ్లాలా? అన్నది కూడా మార్గదర్శకాల ద్వారానే స్పష్టత వస్తుంది. ఏ రకమైన కులగణన చేపడితే న్యాయపరమైన చిక్కులు ఉండవో ప్రభుత్వం అధ్యయనం చేసి మార్గదర్శకాలు విడుదల చేయాల్సి ఉంటుంది.

ఎన్నికల వాయిదా..

గ్రామ పంచాయతీల పాలకవర్గాలకు ఈ ఏడాది ఫిబ్రవరి 1తో గడువు ముగిసింది. ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లను నియమించి పాలన సాగిస్తోంది. ఎన్నికల సమయంలో బీసీ గణన చేపట్టి స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో.. దానిని అమలుపరచాలనే ఉద్దేశంతో కూడా ఎన్నికలను వాయిదా వేసింది. అయితే కేంద్ర నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండడం తో వీలైనంత త్వరగా గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే బీసీ గణన చేసేందుకు.. గడువు ముగిసిన పాత కమిషన్ స్థానంలో కొత్త కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వీలైనంత త్వరగా ప్రక్రియను పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉంది. దసరా సెలవులు (అక్టోబరు రెండో వారం) ఇందుకు కలిసివస్తాయని, జనాభా లెక్కల్లో వివరాలు సేకరించడంలో అనుభవం ఉన్న టీచర్లను కూడా వినియోగించుకోవచ్చునని భావిస్తోంది. వివరాల సేకరణ తర్వాత వాటి నిర్ధారణకు క్షేత్రస్థాయి పరిశీలన, వివరాల విశ్లేషణ చేయాల్సి ఉంటుంది. దాని తర్వాత రిజర్వేషన్లు ఎంతమేరకు ఇవ్వవచ్చో కమిషన్ సూచిస్తుంది. ఈ ప్రక్రియను పూర్తిచేసిన తర్వాత ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది.

హైడ్రాతో నష్టపోయిన పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

» మంత్రి సురేఖకు బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాలి: మంత్రి సీతక్క

» ఆ పోస్టులు పెట్టిన వారిని పార్టీ నుంచి బహిష్కరించాలి: మంత్రి పొన్నం

తిమ్మాపూర్, మానకొండూర్, సెప్టెంబరు 30: హైడ్రాతో నష్టపోయిన పేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని పంచాయితీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క భరోసా ఇచ్చారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని చెరువులు, కుంటలతోపాటు మూసీ నదీ పరివాహక ప్రాంతాన్ని వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు ఆక్రమించుకొని, అక్రమ కట్టడాలను నిర్మించారని ఆరోపించారు. ఇబ్బందులు భవిష్యత్తులో లేకుండా చేసేందుకు అక్రమ కట్టడాలను హైడ్రాతో కూల్చి వేయిస్తున్నారని, అంతే తప్పపేదలకు నష్టం చేయాలనే ఉద్దేశం ప్రభుత్వానికి ఎంత మాత్రం లేదని పేర్కొన్నారు. ఒకవేళ పేదలకు నిజంగా అన్యాయం జరిగితే ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. అక్రమ నిర్మాణాలను తొలగిస్తే అక్రమార్కులకు మద్దతు తెలుపుతూ మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. మరోవైపు తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లో సీతక్క మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖను ట్రోల్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ వారు సోషల్ మీడియాలో అసభ్యంగా పోస్టులు పెట్టారని, అందుకు ఆ పార్టీ వారు సురేఖకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కొండా సురేఖపై పోస్టులు పెట్టిన వారిని పార్టీలో నుంచి బహిష్కరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.



సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ బి.లక్ష్మీనారాయణను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. ప్రపంచస్థాయి విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీ నివాస సముదాయాల నిర్మాణం పేరుతో 700 మంది నుంచి సుమారు రూ.360 కోట్లు వసూలు చేసినట్టు ఈడీ విచారణలో తేలింది. - హైదరాబాద్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కరుణానిధి మనవడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ తనయుడు ఉదయనిధి స్టాలిన్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ప్రమోట్ అయ్యారు. తండ్రితో పోల్చితే కుమారుడికి మరీ ఇంత వేగంగా ఈ హోదా దక్కడం కొందరికి ఎబ్బెట్టుగా తోస్తున్నది. అన్నాడీఎంకే అధినేత్రి జయలలితకు రాజకీయవారసులు లేరు కానీ, కరుణానిధి కుటుంబానికి ఆ కొరతేమీ లేదు. పైగా, నలభైయేడేళ్ళ వయసులో హీరోగా నటిస్తున్న వ్యక్తి, రాజకీయాల్లో డిప్యూటీసీఎం పాత్ర నిర్వహించకూడదన్న నియమమేమీ లేదు. వాళ్ళపార్టీ వాళ్ళిష్టం అని సరిపెట్టుకుంటున్నవాళ్ళు కూడా జూనియర్ స్టాలిన్‌కు పట్టాభిషేకం చేయడానికి పెద్దస్టాలిన్ కాసింత తొందరపడ్డారని మాత్రం అంటున్నారు. ఐదేళ్ళక్రితమే పార్టీ యువజన విభాగం కార్యదర్శిగా ఉదయనిధి అధికారిక ప్రవేశం చేశారు. ఆ తరువాత ఎమ్మెల్యేకావడం, ఏకంగా మంత్రిగా అవతరించడం తెలిసినవే. 'సనాతన ధర్మం' మీద ఆ పాటి కఠినమైన వ్యాఖ్యలు చేయకపోతే, దేశమంతా ఆయన పేరు మారుమోగేదికాదేమో. వారసుడన్నాక ప్రమోషన్‌కు సహజమే కానీ, స్టాలిన్‌కు కరుణానిధి పట్టాభిషేకం చేయడానికి కనీసం మూడుదశాబ్దాలు ఆగారు. తమకుటుంబం నుంచి ఎవరూ రాజకీయాల్లోకి రారని సీనియర్ స్టాలిన్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఎందుకు హామీ ఇచ్చారో, అధికారంలోకి వచ్చిన తరువాత మనసెందుకు మార్చుకున్నారో తెలియదు కానీ, తండ్రిలాగా ఎక్కువకాలం నిరీక్షించాల్సిన అవసరం లేకుండానే జూనియర్ స్టాలిన్‌కు రాజమార్గం సుగమమైపోయింది. ఏడాదిన్నరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఈ చర్య అధికులను ఆశ్చర్యపరచలేదు కానీ, ఆదివారం జరిగిన ప్రమాణస్వీకారోత్సవంలో సెంథిల్ బాలాజీకి మళ్ళీ మంత్రిగా చోటుదక్కడం మాత్రం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మాత్రమే ఇచ్చిందనీ, నిర్దోషి అనలేదని స్టాలిన్ మరిచిపోయినట్టున్నారు.


సెంథిల్ పునరాగమనం

రెండురోజుల క్రితం సెంథిల్ బాలాజీ బెయిల్ మీద విడుదలైన వెంటనే ఆయనను కీర్తిస్తూ స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు, స్వాగతసత్కారాలు, పార్టీ హడావుడి చూసిన తరువాత, ఆయనకు మళ్ళీ మంత్రిపదవి కట్టబెట్టే ప్రమాదం ఉన్నదని చాలామందికి తోచింది. అది అప్రదిష్ఠ, అనైతికం అన్న హెచ్చరికలు, హితవులను పక్కనబెట్టి తాను అనుకున్నదే స్టాలిన్ చేశారు. మనీలాండరింగ్ కేసులో పదిహేను నెలలుగా జైల్లో ఉన్న సెంథిల్‌మీద అన్నాడీఎంకె హయాంలో ప్రభుత్వ రవాణాసంస్థలో ఉద్యోగాలు అమ్ముకున్న అభియోగాలున్నాయి. సిట్ దర్యాప్తులో సెంథిల్ కుట్రంతా వెలుగుచూసి న్యాయస్థానాలకు చేరింది. ఫిర్యాదుదారులకు తాను డబ్బులు తిరిగి ఇచ్చేశానని కేసు కొట్టివేయమని సెంథిల్ ఒక దశలో న్యాయస్థానాన్ని అభ్యర్థించాడు. మద్రాస్ హైకోర్టు ఈ జాబ్స్ ఫర్ క్యాష్ కేసు కొట్టివేస్తే, సుప్రీంకోర్టు అడ్డుపడటంవల్లనే నిజానికి వ్యవహారం అరెస్టులవరకూ వచ్చింది. 'రవాణామంత్రి తన శాఖను అమ్మకానికి పెట్టేశాడు. అవినీతి, దోపిడీ, భూకబ్జాలు, అపహరణలతో ఆయన ఎదిగాడు. పదిహేనుసార్లు మంత్రివర్గం మార్పులు జరిగినా ఆ అవినీతిపరుడి స్థానం పదిలం. ఆయన అవినీతిమీద శాసనసభలో నేను స్వయంగా సాక్ష్యాలు సమర్పించినా చర్యలు లేవు' అంటూ జయలలిత ప్రభుత్వంలో సెంథిల్ అవినీతిమీద స్టాలిన్ 2016 ఎన్నికల ప్రచారసభలో తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఒక దశలో జయలలిత కూడా దూరం పెడితే కేవలం రాజకీయార్థిక ప్రయోజనాలకోసం ఆయన డీఎంకెలో చేరాడు.

పదిహేను నెలలుగా ఆయన జైల్లో ఉన్నా సమీపకాలంలో కేసు విచారణకు వస్తుందన్న నమ్మకం లేకపోవడంతో మనీలాండరింగ్ కేసులో సైతం కోర్టు బెయిల్ ఇచ్చింది. తిరిగి మంత్రి కాకూడదన్న ఆంక్షలు విధించకపోవచ్చును కానీ, ఆయన పదవిలో ఉంటే దర్యాప్తు ప్రక్రియకు విఘాతం కలుగుతుందంటూ అప్పట్లో రాజ్‌భవన్ సెంథిల్‌ను సస్పెండ్ చేస్తూ ఇచ్చిన ప్రకటన ఇప్పుడు చాలామందికి గుర్తుకొస్తున్నది. క్యాష్ ఫర్ జాబ్స్, మనీలాండరింగ్ ఆరోపణలతో పాటు, అంతకుపూర్వంనుంచే ఆయనపై అనేక క్రిమినల్ కేసులున్నాయి. అటువంటి వ్యక్తి ఇప్పుడు ఎటువంటి అభ్యంతరాలు లేకుండా తిరిగి అధికారం స్వీకరించడం ఆశ్చర్యకరమైన విషయం. సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు మద్రాస్ హైకోర్టు నియమించే కమిషన్ విచారణ పూర్తయిన తరువాత ఆయనకు మంత్రిపదవి దక్కివుంటే ఎవరికీ అభ్యంతరం ఉండదు. క్యాష్ ఫర్ జాబ్స్ కుంభకోణంలో బాధితులకు అన్యాయం జరిగిందన్న అప్రదిష్ఠ స్టాలిన్‌కు వచ్చేది కాదు.

సమర సరిగమల సారంగపాణి

"ఎర్ర ఎర్ర దారిలోనా నా చెల్లెమ్మా/ ఎత్తరావే ఎర్రాజెండా నా చెల్లెమ్మా.." అంటూ ఎనభయ్యవ దశకం ఉత్తరార్థంలో ఆయన గొంతు ఉద్యమాల ఖిల్లా, పోరాటాల జిల్లా వరంగల్ అంతటా మార్మోగింది. ఒకవైపు ప్రజాకళాకారునిగా, మరోవైపు ప్రజాసంఘాల నాయకుడిగా నాలుగు దశాబ్దాల పాటు అలుపెరుగని కృషి సలిపిన ఆ పోరాట కేతనం పేరే సుతారి సారంగపాణి. వామపక్ష ఉద్యమాలు బలపడుతున్న రోజులవి. తమ వ్యక్తిగత పనులు వదిలేసి పూర్తికాలపు కార్యకర్తలు అవసరమైన కాలం. రైతులు, కార్మికులు తమ కోసం పోరాడే నాయకుల కోసం వెతుక్కుంటున్న రోజుల్లో పెద్దకొడుకులా అందివచ్చాడు సారంగపాణి. వరంగల్ నగరంలో వామపక్ష ఉద్యమాన్ని నిర్మించడానికి జి.రాములు పునాదిరాళ్లు వేస్తున్న సమయమది. ఆ సమయంలో ప్రజలతో మమేకం కావడంలో ఒక కలుపుగోలు మనిషిగా ఉన్న సారంగపాణి పని విధానం రాములును ఆకర్షించింది. దీంతో ఖిల్లా వరంగల్ కేంద్రంగా మార్క్సిస్ట్ పార్టీ జెండా రెపరెపలాడేందుకు బిల్లా సుధాకర్, గడ్డం రమేష్‌లతో కలిసి కదం తొక్కాడు సారంగపాణి.



ఉద్యమ అవసరాలకు అనుగుణంగా తనను తాను మలుచుకున్న నిబద్ధజీవి సుతారి సారంగపాణి. అవసరమైనచోట గాయకునిగా, నాయకునిగా, ఆర్గనైజర్‌గా... బహుముఖాలుగా సుతారి చేసిన కృషి మరువలేనిది. వెనుకబడిన సామాజిక వర్గంలో పుట్టిన సుతారి, ఈ దేశంలో పేదరికం పోయినప్పుడే తన కుటుంబంలో పేదరికం పోతుందని నమ్మాడు.

ఆ నేపథ్యంలో సుతారి సారంగపాణి ఒక కీలకమైన ప్రయోగం చేశాడు. అప్పటికే విప్లవోద్యమ గాలులు రాష్ట్రమంతటా బలంగా వీస్తున్నాయి. ప్రజలు పోరాట పాటలంటే అమితంగా అభిమానిస్తున్నారు. ఈ విషయాన్ని గమనించిన సారంగపాణి, ప్రజానాట్యమండలిని ఆ ఏరియాలో విస్తరింపజేశాడు. తనతో పాటు ఎంతోమంది కళాకారులను కూడగట్టాడు. అట్లా పాటలు, పల్లెసుద్దులు, డప్పు వాయిద్య సహకారం వంటి వాటిలో ఆరితేరాడు. ఆయన గొంతెత్తి పాడితే జనం మంత్రముగ్ధులై వినేవారు. అలా పార్టీని విస్తరించడానికి కళారంగాన్నే వేదిక చేసుకొని ముందుకు సాగాడు.

పోరాటాలే తన ఊపిరిగా మలుచుకున్న సుతారి సారంగపాణి ప్రస్థానం పూలబాటేం కాదు, అడుగడుగునా అనేక అడ్డంకులను ఎదుర్కొన్నాడు. చాలా చిత్రంగా తోటి కమ్యూనిస్టు పార్టీ అయిన ఎంసీపీఐ నుంచి ఆయన ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. తూర్పుకోటకు సంబంధించిన బిల్లా సుధాకర్ ఈ గొడవల్లోనే హత్యకు గురయ్యాడు. గడ్డం రమేష్ ఆనాడు తృటిలో చావు నుంచి బయటపడ్డాడు. ఇక వారి చేతికి చిక్కిన సుతారిని మూడురోజుల పాటు కిడ్నాప్ చేసి చిత్రహింసల పాలు చేశారు. అయినా సరే మొక్కవోని ధైర్యంతో నిలబడ్డ నిజమైన కమ్యూనిస్ట్ సుతారి. అదే ఆయనను ప్రజలకు మరింత చేరువ చేసింది. ముఖ్యంగా వరంగల్ నగరంలో సుతారి చేసిన కృషి నేటికి అక్కడి ప్రజలు చెప్పుకునేలా చేసింది.

ఒకవైపు రైస్ మిల్లు, కాటన్ మిల్లు, ఆయిల్ మిల్లుల కార్మికులను కూడగట్టి "ఆల్ మిల్ వర్కర్స్ అసోసియేషన్" ఏర్పాటు చేశాడు. అంతేకాదు మరోవైపు గీసుకొండ, కొమ్మాల, అనంతారం ఏరియాల్లో రైతు కూలీ సంఘం బాధ్యతలు నిర్వర్తించాడు. రైతు కూలీల సమస్యలపై మడమ తిప్పని పోరాటం చేశాడు. అట్లా కార్మిక, కర్షకుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహించిన ఘనత సుతారిదే. అలాగే హమాలీ వర్కర్స్‌ను సైతం ఏకం చేసి, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడాడు. ఇన్ని సమూహాలకు తలలో నాలుకలా తిరుగుతూ, అనేక ఆటంకాల నడుమ వరంగల్ నగరంలో ఎర్రజెండాను ఎగరేశాడు. క్యాడర్‌ను కంటికి రెప్పలా కాపాడాడు.


ఇక సుతారిలో ఉన్న కళాకారుడు కూడా అలసిపోలేదు. తన యవ్వన కాలంలో వరంగల్ జిల్లాలో ప్రజానాట్యమండలిని బలోపేతం చేసేందుకు ఉమ్మడి జిల్లాకు కార్యదర్శిగా పని చేశాడు. ప్రముఖ రచయిత రుక్మిణి ఆనాడు అధ్యక్షునిగా ఉన్నారు. ఇక వీరికంటే ముందు జిల్లాలో సాంస్కృతిక ఉద్యమాన్ని నిర్మించేందుకు సాంబరాజు యాదగిరి, సింగారపు జనార్ధన్, డోర్నాకల్ శ్రవణ్ (వీరస్వామి) వంటి కళాకారులు ఎంతగానో శ్రమించారు. వారి దారిలో తనవంతు పాత్రను దిగ్విజయంగా పోషించిన ప్రజాకళాకారుడు సుతారి. పిల్లలను మతమౌఢ్యంలోకి నెడుతున్న కాలమిది. సుతారి ప్రజానాట్యమండలి కళాకారునిగా పని చేస్తున్న కాలంలో ఎంతోమంది పిల్లలకు కోలాటం, తదితర కళారూపాలు నేర్పించాడు. పిల్లలు శాస్త్రీయంగా ఆలోచించడం నేర్చుకున్నప్పుడే మన సమాజం ముందుకు సాగుతుందనే విశ్వాసం ఆయనలో బలంగా ఉండేది. అందుకే ఎంతో ఓపికగా ప్రజానాట్యమండలిలో కళారూపాలను విద్యార్థులకే నేర్పించేవాడు. అంతేకాదు సమాజంలో అప్పటికి అక్షరాస్యత మీద పెద్దగా అవగాహన లేదు. ఆనాటి ప్రభుత్వం 1991లో అక్షరాస్యత ఉద్యమం చేపట్టినప్పుడు అందులో భాగస్వామి అయ్యాడు. అంతేకాదు నాలుగు నెలలపాటు పర్యావరణం మీద అవగాహన పెంపొందించేందుకు 'భారత జన విజ్ఞాన జాత'ను నిర్వహించాడు. ఇలా ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందు వరసలో నిలబడ్డాడు సుతారి.

పేద ప్రజలకు ఉండడానికి నిలువ నీడలేకుంటే సుతారి భూపోరాటాల్లో సైతం ముందు నడిచాడు. ఏసిరెడ్డి నగర్, సుందరయ్య నగర్, చౌడి చెరువు వంటి ఏరియాల్లో గుడిసెలు వేసినప్పుడు వాటిని కాపాడేందుకు నాయకునిగా పిట్ట మహేందర్ వంటి అనుచరులతో అక్కడే తిని, అక్కడే నిద్రించాడు. ప్రజల మధ్యలో జీవిస్తూ, ప్రజలు పెట్టింది తింటూ ఇల్లు జాడను మరిచాడు. ఉద్యమ అవసరాలకు అనుగుణంగా తనను తాను మలుచుకున్న నిబద్ధజీవి సుతారి సారంగపాణి. అవసరమైన చోట గాయకునిగా, నాయకునిగా, ఆర్గనైజర్‌గా... బహుముఖాలుగా సుతారి చేసిన కృషి మరువలేనిది. వెనుకబడిన సామాజిక వర్గంలో పుట్టిన సుతారి, ఈ దేశంలో పేదరికం పోయినప్పుడే తన కుటుంబంలో పేదరికం పోతుందని నమ్మాడు. అందుకోసం నిస్వార్థంగా, ఆదర్శనీయంగా విలువలతో జీవించాడు. కమ్యూనిస్ట్ పార్టీల్లో నుంచి బయటికొచ్చి ఆస్తులు కూడబెట్టుకొని, విలువలకు సమాధులు కట్టిన నాయకులున్న కాలంలో సుతారి వంటి నిజమైన నాయకులు అరుదు. ఆయన ఒక్క పేరు తప్ప ఏమీ సంపాదించుకోలేకపోవచ్చుగాని, వరంగల్ జిల్లా ప్రజా ఉద్యమాల చరిత్రలో సాంస్కృతిక కార్యకర్తగా, ప్రజాతంత్ర పోరాటాల నాయకునిగా సుతారి పేరు శాశ్వతంగా నిలిచే ఉంటుంది. పాటకున్న శక్తిని గుర్తించిన ఈ ప్రజా కళాకారుడు కలగన్న సమసమాజం సాధించడమే ఆయనకు మనం ఇచ్చే నివాళి.

• డాక్టర్ పసునూరి రవీందర్

(సెప్టెంబర్ 26న కన్నుమూసిన ప్రజాగాయకుడు సుతారి సారంగపాణి యాదిలో)

కులానికి కూడా పెట్టుబడి కావాలా?



చిత్పావనుల చరిత్ర చెప్పేదొకటే! రాజకీయ, ఆర్థిక ఆధిపత్యాన్ని చవిచూసిన కులాలు ప్రభుత్వ దన్ను లేకుండా కూడా పోటీ పరిస్థితుల్లో నెగ్గుకు రాగలవు. దశాబ్దాల పాలనానుభవం, ఆర్జించిన విద్య, ఇతర సౌకర్యాలు అనేక మెలకువులతో కూడిన ప్రతిభను, చొరవను చిత్పావనులకు సంపాదించి పెట్టాయి. వీటినే సాంస్కృతిక పెట్టుబడిగా వర్ణించొచ్చు. ఇతర అగ్రకులాలకూ ఇది ఎంతో కొంత స్థాయిలో లభిస్తోంది. పోటీ ప్రపంచంలో అదే వారికి కలిసివస్తోంది!

ఎవరికీలేని ఘన చరిత్ర మనకుంది! వేద కాలంనాటి గాయత్రి మంత్రాన్ని ఇప్పటికీ ఉచ్చరిస్తూనే ఉన్నాం. రెండువేల ఏళ్లనాటి మహాకావ్యాలు, పురాణాల విశేషాలను ఇంకా వింటూనే ఉన్నాం. శతాబ్దాల కిందటే జనభాషగా సంస్కృతం అంతరించినా దాని పదాలను ఇంకా వాడుకుంటూనే ఉన్నాం. ఎప్పుడో పుట్టిన జ్యోతిష్య శాస్త్రాన్ని ఇంకా నమ్ముతూనే ఉన్నాం. జాతక చక్రాన్ని బట్టి జీవిత ఎత్తుపల్లాలపై లెక్కలు వేసుకుంటూనే ఉన్నాం. కాల క్రమంలో మార్పులకు లోనైనా కులం నిర్దేశించే పద్ధతుల కింద ఇంకా జీవిస్తూనే ఉన్నాం.

గతాన్ని ఇంత గట్టిగా పాటించే మనం కళ్లముందు జరిగిన ఒకనాటి పరిణామాలను అక్షరబద్ధం చేయటంలో చాలా వెనుకబడి ఉండటమే విచిత్రం! రాజుల చరిత్రా మనకు క్రమబద్ధంగా లభించదు. ఏ గ్రంథం ఎప్పటిదో, దాన్ని రాసింది ఎవరో చెప్పలేని పరిస్థితి ఇంకా ఉంది. ఒకరి పేరుతో ఉన్న గ్రంథం పలువురు రాయటం మనకు సహజం! వారెవరో తేల్చుకోలేని అశక్తత అంతకంటే నిజం! పరమ పవిత్రం అనుకున్న గ్రంథాల్లో మార్పులూ చేర్పులూ జరిగాయి. ప్రక్షిప్తాల్లేని ప్రాచీన సాహిత్యం ఇదీ అని నిర్దిష్టంగా చెప్పలేం. వీటన్నిటికీ కాలనిర్ణయం చేయటం ఇప్పటికీ కత్తిమీద సామే! అందుకే మన చరిత్రలో పలు సంఘటనలను ఊహలకు పదునుపెట్టి అర్థం చేసుకోవటం చాలా ఎక్కువ. కాలంలో వెనక్కి వెళ్లిన కొద్దీ ఈ అవసరం బాగా పెరుగుతుంది. ముందుకొచ్చిన కొద్దీ పరిస్థితి కొంత తేటపడుతుంది. అందుకే రెండుమూడు వందలేళ్లనాటి పరిణామాలను అర్థం చేసుకోవటంలో సాపేక్షికంగా ఇబ్బందులు తక్కువ.

కులాలు ఎప్పటి నుంచో ఉన్నా వాటి ఘనతల గురించి చరిత్రలు రాయటం గడిచిన వందేళ్లలోనే ఎక్కువ. కులవృత్తాంతాలు, కులదీపికలు అలానే పుట్టుకొచ్చాయి. అవెంత పాక్షిక దృష్టితో రాసినా వాటి ద్వారానూ కొన్ని పరిణామాలు తెలుస్తాయి. అన్ని భాషల్లోనూ అవి ఉన్నా మహారాష్ట్రలో వాటి సంఖ్య కాస్త ఎక్కువ. వాటిని నిశితంగా పరిశీలించి కులాల్లో వస్తున్న మార్పులను వివరించే అధ్యయనాలూ వచ్చాయి. మహారాష్ట్రలో చిత్పావన్ బ్రాహ్మణుల గురించి.. చరిత్రకారులు మొరీస్ ఎల్‌పి. పాటర్సన్, రవీందర్ కుమార్ చేసిన అధ్యయనాలు పలు ఆసక్తికరమైన విషయాలను వెలుగులోకి తెచ్చాయి.

కులాలకు రిజర్వేషన్లు, అధికారంలో సముచిత వాటాలుండాలనే వాదనలు ఎప్పటి నుంచో ఉన్నాయి. కులపక్షపాతం అన్నిస్థాయిల్లో వేళ్లూనుకుందని భావించటమూ మనకు కొత్తకాదు. ఆధునిక చట్టాలు అమల్లోకి వచ్చిన తర్వాత కూడా ఆ భావన బలహీనపడకుండా ఉండటానికి గట్టి కారణాలే ఉన్నాయి. రాజకీయ అధికారాన్ని చలాయించే కులాలు చూపించిన పక్షపాతాన్ని చాలా మంది కళ్లారా చూశారు. ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లకు ఛైర్మన్లుగా ఉన్నవారు బంధుగణాలకు వీలున్న చోట్ల ఉద్యోగాలు, పదవులు కట్టబెట్టారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలూ అదే చేశారు. అలా చేయటం.. సమన్యాయపాలనకు విరుద్ధమని వారికి తెలియదనలేం. కులప్రీతి దృష్ట్యా అది తప్పుకాదనే ధోరణి చాలామంది అంతరాంతాలల్లో నాటుకుపోయింది. కులవ్యవస్థ ఏర్పరిచిన మనస్తత్వ పరిధులను దాటలేని నాయకులే మనకు ఎక్కువ. ఇక ఎన్నికల ప్రజాస్వామ్యం వచ్చిన తర్వాత ఓట్ల కోసం సొంతకులాన్ని బుజ్జగించటం అనివార్యంగా మారిపోయింది. ప్రజాస్వామ్యం కులదృష్టిని పెంచింది. కులాల ఆధారంగా పార్టీ టిక్కెట్లు ఇవ్వటం, తాయిలాలను ప్రకటించటం, కులసంఘాలకు స్థలాలు కేటాయించటం, భవనాలు నిర్మించటం, కార్పొరేషన్లు ఏర్పాటు లాంటివి చూస్తే ప్రజాస్వామ్యం—కులం ఒకదానితో ఒకటి పెనవేసుకుని నడుస్తున్నట్లు స్పష్టంగా కనపడుతుంది.

చిత్పావన బ్రాహ్మణుల ఎదుగుదల చూస్తే రాజకీయాలకు కులాలకు ఉన్న సంబంధం స్పష్టంగా తెలుస్తుంది. ఛత్రపతి శివాజీ పాలనను స్వర్ణయుగంగా భావించటం ఇటీవల బాగా పెరిగింది. అందుల్లో సత్యాసత్యాలను అలా ఉంచి ఒక విషయాన్ని స్పష్టంగా చూడాలి. శివాజీ వారసుల పాలన ఎంతో కాలం కొనసాగలేదు. పీష్వాలే (ప్రధానమంత్రులు) అధికారాన్ని గుప్పిటపట్టారు. ఛత్రపతి వారసులందరూ వారికి కీలుబొమ్మలుగా మారారు. శివాజీ మనుమడు సాహు 1713లో చిత్పావనుడైన బాలాజీ విశ్వనాథ్ భట్‌ను పీష్వాగా నియమించారు. వెంటనే సొంత కులం వారికి కీలక ఉద్యోగాలను కట్టబెట్టే పనిని బాలాజీ మొదలుపెట్టారు. ఆ తర్వాతి పీష్వాలు అదే పనిని ఇంకా గట్టిగా చేశారు. గ్రామస్థాయి నుంచి పీష్వా కార్యాలయం వరకూ అనేక పదవులు చిత్పావనులకు లభించాయి. శిస్తుభారం లేకుండా భూములనూ భారీగా కట్టబెట్టారు. సుంకాల మినహాయింపునూ ఇచ్చారు. చిత్పావనులు అంతకు ముందు రత్నగిరి ప్రాంతానికి మాత్రమే పరిమితమై ఉండేవారు. వ్యవసాయాన్నే ప్రధానంగా చేసుకునేవారు. మతపరమైన కార్యక్రమాలతోనూ కొందరు పొట్టపోసుకునే వారు. రాజకీయ ప్రాపకంతో వారి జాతకమే మారిపోయింది. 1818లో బ్రిటిషు సైన్యం చేతిలో పీష్వా ఓడిపోయే వరకూ వారి ప్రాభవానికి తిరుగులేకుండా పోయింది. పీష్వాల పాలన సాగిన ప్రాంతమంతా చిత్పావనులు విస్తరించారు. నిజానికి చిత్పావనులు స్థానికులు కారు. బయటి నుంచి వచ్చి రత్నగిరి పరిసరాల్లో స్థిరపడ్డారు. 1707 వరకు వీరి గురించి తెలిసింది చాలా తక్కువ. చిత్పావనులు తమ మూలం గురించి చిత్రమైన కథ చెప్పుకొంటారు. పరశురాముడు క్షత్రియులందరినీ వధించిన తర్వాత ప్రక్షాళనకు ఉపక్రమిస్తే స్థానిక బ్రాహ్మణులు సహాయ నిరాకరణ చేస్తారు. ఆ సమయంలోనే సముద్ర తీరం వెంబడి 14 శవాలు కొట్టుకువస్తాయి. వాటికి పరశురాముడు దహన సంస్కారాలు చేసిన అనంతరం చితి మీదుగా మళ్లీ ప్రాణం పోస్తాడు. అట్లా చితి నుంచి పావనమై ప్రాణం పొందారు కాబట్టి చిత్పావనులు అయ్యామని చెప్పుకొంటారు. ఈ మొత్తం కథను చారిత్రక దృష్టితో పరిశీలిస్తే చిత్పావనులు సముద్ర ప్రయాణం చేసి మహారాష్ట్ర తీరానికి చేరారనే తెలుస్తుంది.



■ రాహుల్ కుమార్

రాజకీయ అధికారంతో ఉన్నతస్థానాలకు ఎగబాకిన చిత్పావనులకు.. పీష్వా అధికారాన్ని (1818 తర్వాత) కోల్పోయిన తర్వాత ఏం జరిగింది? అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. పాలకులు మారటంతో తాత్కాలికంగా ఒడిదొడుకులు వచ్చాయి. కానీ వందేళ్ల అధికారంలో రాటుతేలటంతో కొత్తపాలనలో తేలికగానే కుదురుకున్నారు. బ్రిటిష్ పాలకులు స్థాపించిన విద్యాసంస్థల్లో చేరారు. వాటిల్లో రాణించారు. తిరిగి వలసపాలనలోనూ కీలకపాత్ర పోషించారు. ఆధునిక వృత్తుల్లో ప్రవేశించారు. వీళ్లనే రవీందర్ కుమార్ కొత్త బ్రాహ్మణులుగా వర్ణించారు. దీనికి భిన్నంగా పాత సంప్రదాయాలను పట్టుకుని వేళ్లాడే సనాతన వర్గం ప్రతిచోటా ఎంతోకొంత ఉంటుంది. ఈ వర్గం చిత్పావనుల నుంచి మొదట్లో ప్రతిఘటన వచ్చింది. బ్రిటిషు పాలకులు బ్రాహ్మణులకు దక్షిణలు ఇవ్వటాన్ని ఆపేసినప్పుడు చాలా ఆందోళన చేశారు. పాలకుల నుంచి దక్షిణలు పొందటం తమ హక్కుగా వాదించారు. సమాజానికి తాము ధర్మ చింతను బోధిస్తూ సామాజిక వ్యవస్థను సమన్వయంతో నడిపిస్తున్నామనీ దక్షిణలు ఆపి దాన్ని దెబ్బతీస్తే రాజకీయ అస్థిరత వస్తుందనీ హెచ్చరించారు. పుణేలో ఆనాడు బ్రాహ్మణ కులాల పంచాయతీలు చాలా బలంగా ఉండేవి. ఆ పంచాయతీల తీర్మానాల ద్వారా కులస్థులను క్రమశిక్షణలో ఉంచేవారు. ఇతర కులాల వివాదాలపై కూడా బ్రాహ్మణ పంచాయతీలు తీర్మానాలు చేసేవి.

కాలం గడిచిన కొద్దీ ఆధునిక భావాల ప్రభావంతో కొత్త బ్రాహ్మణుల నుంచి సామాజిక సంస్కరణలు కావాలనే గొంతుకలు బలంగా విన్పించాయి. రెనడే, గోఖలే, ధొండో కేశవ్ కర్వేలు సామాజిక సంస్కరణలకు ప్రతినిధులుగా నిలిచి మధ్యతరగతిని బాగా ప్రభావితం చేశారు. సంస్కరణ జోలికి వెళ్లకుండా రాజకీయ అధికారం దక్కించుకోవాలనుకునే వారికి ప్రతీకగా బాల్‌గంగాధర్ తిలక్ నిలిచారు. ఈ రెండు రకాల రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిన వారందరూ చిత్పావనులే. అలాగే హిందుత్వవాదాన్ని తెరపైకి తెచ్చిన వినాయక్ దామోదర్ సావర్కర్, ఆ వాదంతో ప్రేరణపొంది మహాత్మాగాంధీని కాల్చి చంపిన గొడ్సే కూడా చిత్పావనులే. భూదానోద్యమ నేత వినోబాభావే, ప్రముఖ నిఘంటుకారుడు వీ.ఎస్.ఆప్టే, ధర్మశాస్త్రాల చరిత్రను రాసిన పీ.వీ. కాణె, ప్రముఖ అంత్రపాలజిస్టు ఇరావతి కర్వే.. ఇలా చెప్పుకొంటూ పోతే చిత్పావనుల జాబితా పెద్దదిగానే ఉంటుంది. అమెరికాలో వైద్యశాస్త్రం చదివిన తొలి భారతీయ మహిళ ఆనందీ బాయ్ కూడా చిత్పావన కులం నుంచే వచ్చారు.

చిత్పావనులతో పాటు మొత్తంగా బ్రాహ్మణులు అనేక రంగాల్లో చొచ్చుకుపోయారు. ముఖ్యంగా విద్యా ఉద్యోగాల్లో వీరి ఆధిపత్యాన్ని ప్రశ్నించటం 1850ల నాటికే మొదలైంది. ఇందులో జ్యోతిరావు పూలె ముందుండటమే గాక బ్రాహ్మణ వ్యతిరేకతకు సిద్ధాంతాన్ని కూడా ప్రచారంలోకి తెచ్చారు. బ్రాహ్మణులందరూ బయటి నుంచి వచ్చినవారేనన్న వాదన లేవదీశారు. విద్యారంగంపై బ్రాహ్మణ ఆధిపత్యం ఆనాడు ఎలా ఉండేదో వివరించటానికి రవీందర్ కుమార్ 1884లో బాంబే రాష్ట్రంలోని ఆరు కాలేజీల్లో విద్యార్థుల వివరాలను ఇచ్చారు. బ్రాహ్మణులు 241, కాయస్థ ప్రభువులు 29, క్షత్రియులు 13, వ్యాపారకులాలు 51 చొప్పున కళాశాలల్లో సీట్లు పొందారు. ఇతర అగ్రకులాలు ఏవీ బ్రాహ్మణులకు దరిదాపుల్లో లేరు. చిత్పావనులు ప్రచురించిన 34 కుల వృత్తాంతాలను పరిశీలించి మొరీస్ ఉద్యోగాలు, వృత్తుల గురించి ఆసక్తికరమైన సమాచారాన్ని ఇచ్చారు. 1960 నాటికి 2 లక్షల చిత్పావన బ్రాహ్మణులు ఉన్నారు. అందులో 34,000 మంది పురుష ఉద్యోగుల, వృత్తి వివరాలు కుల వృత్తాంతాల్లో లభ్యమైంది. 35 శాతం మంది ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నారు. ఏ కోణం నుంచి చూసినా ఈ శాతం చాలా ఎక్కువ! ప్రైవేటురంగ ఉద్యోగాల్లో 20.5 శాతం, వ్యాపారాల్లో 21.9 శాతం, వ్యవసాయంలో 16 శాతం, సంప్రదాయ మతపరమైన వృత్తిలో 5.5 శాతం మంది ఉన్నారు. ఇక 1.1 శాతం మంది గురించి సమాచారం దొరకలేదు.

చిత్పావనుల చరిత్ర చెప్పేదొకటే! రాజకీయ, ఆర్థిక ఆధిపత్యాన్ని చవిచూసిన కులాలు ప్రభుత్వ దన్ను లేకుండా కూడా పోటీ పరిస్థితుల్లో కూడా నెగ్గుకురాగలవు. దశాబ్దాల పాలనానుభవం, ఆర్జించిన విద్య, ఇతర సౌకర్యాలు అనేక మెలకువలతో కూడిన ప్రతిభను, చొరవను చిత్పావనులకు సంపాదించి పెట్టాయి. వీటినే సాంస్కృతిక పెట్టుబడిగా వర్ణించొచ్చు. ఇతర అగ్రకులాలకూ ఇది ఎంతో కొంత స్థాయిలో లభిస్తోంది. పోటీ ప్రపంచంలో అదే వారికి కలిసివస్తోంది!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

గొల్లత్తగుడికి గుర్తింపేది!

తెలంగాణ అంటేనే చరిత్ర. తరచిచూస్తే గతమంతా ఘనవైభవమే. ఆదిమానవుల కాలం నుంచి చాళుక్యులు, కాకతీయులు, నిజాం రాజుల దాకా ఈ నేల అణువణువూ అత్యద్భుతం. ప్రతీ నిర్మాణం అపురూపం. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల, కల్వకుర్తి రహదారిలో ఆల్వాన్‌పల్లి దగ్గర అత్యంత చరిత్రాత్మకమైన, ప్రాచీనమైన గొల్లత్తగుడిగా జనం పిలుచుకునే జైన దేవాలయం ఉంది. ఈ ఆలయం హిందూ దేవాలయ వాస్తు శైలికి భిన్నంగా ఉంటుంది. చరిత్రకారులు ఈ ఆలయాన్ని 'ఆది మందిరం'గా వ్యవహరిస్తారు. క్రీస్తుశకం 7, 8 శతాబ్దాలలో రాష్ట్ర కూటుల పాలనలో పూర్తిగా ఇటుకల దొంతరలా 65 అడుగుల ఎత్తుతో నిర్మించిన ఈ ఆలయం నేటికీ చూపరులకు విభ్రాంతి గొలుపుతుంది.

భూలోక మల్లుని పేర వేయించిన శాసనం ఇక్కడ లభించింది. ఈ ఆలయం ప్రక్కనే జైనులు భక్తితో ప్రణమిల్లే జినుని ఆరడుగుల రాతి పాదాలు నిలబెట్టి ఉన్నాయి. ఈ దేవాలయ నిర్మాణానికి వాడిన ఇటుకల తయారీ శైలి దేశంలో మరెక్కడా కనిపించదు. దొంగలు గుప్తనిధుల కొరకు త్రవ్వకాలు జరిపిన నేపథ్యంలో 1950 సంవత్సరంలో రెండు జైన తీర్థంకరుల విగ్రహాలలో ఒకటి మహబూబ్ నగర్ పిల్లల మర్రి మ్యూజియానికి, ఇంకొకటి హైదరాబాద్ స్టేట్ మ్యూజియానికి తరలించారు. ప్రస్తుతం ఈ ఆలయం పురావస్తుశాఖ అధీనంలో, చుట్టూ ఎత్తయిన ప్రహరీతో కాపలా వ్యక్తి పహారాలో ఉంది. ఇలాంటి ఆలయం దేశం మొత్తంలో ఇంకొకటి ఉత్తరప్రదేశ్‌లో ఉంది. అద్భుతమైన ఈ ఆలయాన్ని చరిత్ర జిజ్ఞాసువులు తప్పక సందర్శించాలి.



ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తే బాగుంటుంది. గొల్లత్తగుడిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే అవకాశం చాలా ఉంది. దేశ విదేశాల నుండి సందర్శకులు, పరిశోధకులు ఈ ఆలయానికి విచ్చేసి ఇక్కడి ఘన చరిత్రను ప్రపంచానికి చాటే అవకాశం ఉంటుంది. దీంతో పాటు మన ప్రాచీన చరిత్ర, ఆనవాళ్లను భావితరాలకు అందించినవారిమవుతాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాకు చెందిన ఈ పురాతన ఆలయం అభివృద్ధికి నోచుకుంటే ఈ ప్రాంతానికి, రాష్ట్రానికి మరింత గుర్తింపు తెచ్చే అవకాశం ఉంటుంది. ప్రత్యేక నిధులను కేటాయించి ఆలయ పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేస్తే ఇక్కడ సందర్శకులు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆశిద్దాం.

– ఖాజా అఫ్రిది

మనం మరచిందే ముర్ము చెప్పారు!

కలకత్తా వైద్య విద్యార్థిని హత్యాచార ఘాతుకంపై దేశమంతా అట్టుడికిపోయిన తర్వాత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇచ్చిన సందేశం అరుదైనది. పిటిఐ (ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా)కు రాసిన ఒక వ్యాసంలో ఆమె చేసిన వ్యాఖ్యలు కొందరినైనా ఆలోచింపచేసి ఉండాలి.

అత్యాచార, హత్యాచారాలు నిరంతరాయంగా జరిగిపోతున్నాయని దేశ రాజ్యాంగ అధినేతగా ఆమె అంగీకరించారు. ఇటువంటివి తరచూ జరుగుతున్నా పట్టించుకోని మొద్దుబారినతనం మనల్ని ఆవహించిందని ఓ కమ్చీ దెబ్బ వేశారు. దీనిని వదిలించుకోవాలన్నారు. ఆడవారిపై అత్యాచార పర్వాన్ని నిరోధించడానికి చిత్తశుద్ధితో కూడిన కృషి జరగాలన్నారు. ఏదో ఒక ఘటనపై దేశమంతా గగ్గోలు పెట్టడం, తర్వాత నిద్రపోవడం జరుగుతున్నదనీ నిర్భయ దారుణ ఘటన తర్వాత లెక్కలేనన్ని హత్యాచారాలు చోటు చేసుకున్నాయని అన్నారు. మహిళను తక్కువ స్థాయి మనిషిగా; శక్తి సామర్థ్యాలు లేని జాతికి చెందిన వ్యక్తిగా; బుద్ధి హీనురాలుగా చూసే దుర్మార్గ మనస్తత్వం రాజ్యం చేస్తున్నదనీ ఎత్తి చూపారు. ఇది ఒక స్త్రీగా భారతీయ సమాజంపై ఆమె హృదయావేదనతో చేసిన వ్యాఖ్య

ఇటువంటి దారుణాలు జరిగినప్పుడెల్లా మరింత తీవ్రమైన శిక్షల గురించి, అందుకు అవసరమైన చట్టాల గురించి రాజకీయ పదవుల్లోనివారు, అధికారులు వల్లిస్తూంటారు. ఇటువంటి నేరాలకు విధిగా ఉరిశిక్ష పడేలా కేంద్రం చట్టం తేవాలని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సూచించారు. ఆమె తన వంతుగా తన రాష్ట్రంలో ఉరి శిక్ష చట్టాన్ని తీసుకువచ్చారు. ఢిల్లీ వీధుల్లో పరిగెడుతున్న బస్సులో చెప్పడానికి సిగ్గుపడాల్సిన భయంకర అమానుష అత్యాచారానికి గురై ఆసుపత్రిలో మరణించిన నిర్భయ కూడా తన చివరి ఆకాంక్షలో ఆ దుండగులను ఉరి తీయాలని, సజీవ దహనం చేయాలని కోరినట్టు వార్తలు వచ్చాయి. నిర్భయ హత్యాచారంలో పాల్గొన్న వారిలో 18 ఏళ్ల లోపు బాలుడు ఉన్నందున బాల నేరస్థుల చట్టాన్ని కూడా బీజేపీ పాలకులు సవరించారు. 16–18 మధ్య బాలురు ఇటువంటి అమానుషాల్లో పాల్గొంటే వారిని పెద్దవారుగానే పరిగణించి శిక్ష విధించాలని బీజేపీ పాలకులు చట్ట సవరణ చేశారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ వారించినా పాలకులు వినలేదు. నిర్భయ దారుణోదంతం 2012లో జరిగింది. అప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వం ఉంది. ఆ తర్వాత వచ్చిన బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ఈ చట్టాలను తెచ్చింది. మహిళపై జరిగే పలు రకాల నేరాలకు శిక్షలను పెంచింది. 2012లో దేశంలో 24,923 అత్యాచార ఘటనలు సంభవించాయి. నిర్భయ ఉదంతం అందులో ఒకటి. అంటే ఆ ఏడాది రోజుకి 68.28 ఉదంతాలు చోటు చేసుకున్నాయి. ఆ తర్వాత ప్రతి సంవత్సరం అదనంగా 24 ఘటనలు (అంటే రోజుకి 90) సంభవించాయని జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

రాజ్యాంగం 14 ఆర్టికల్ మహిళలకు పురుషులతో సర్వ సమానత్వ హక్కును కల్పించింది. రాజ్యం లేదా ప్రభుత్వం స్త్రీని ఏ విధంగానూ తక్కువగా చూడరాదని ఆర్టికల్ 15(1) నిర్దేశిస్తున్నది. ఆర్టికల్ 16 ఆమెకు సమానావకాశాలు కల్పిస్తున్నది. సమాన పనికి పురుషునితో సమాన వేతనాన్ని ఆర్టికల్స్ 39(డి), ఆర్టికల్ 42 హామీ ఇస్తున్నాయి. అయితే కోర్టులకు ఎక్కితే గాని ఇవి ఆమెకు అందుబాటులోకి రావడం లేదు. మగవారు వీధి కుక్కల్లా సందుల్లో గొందుల్లో సైతం మాటువేసి చిన్నారుల నుంచి పెద్దవారి వరకు మహిళలపై లైంగిక దాడులకు తెగబడుతున్నారు. చట్టమంటే భయం ఏ కోశానా కనిపించడం లేదు. సంతానోత్పత్తికి స్త్రీ పురుషుల మధ్య ప్రకృతి ఏర్పరచిన ఆకర్షణను హేళన చేస్తూ ఆమె స్వేచ్ఛను, స్వయం నిర్ణయాధికారాన్ని కాలరాస్తున్న మగ జాతిని ఏమనాలి? సంసారానికి, వంశ వృద్ధికి ఆమె కావాలి, మనిషిగా మగవాడితో సమానంగా తల ఎత్తుకునే హక్కును ఆమె అనుభవించకూడదు. తమకు భోగవస్తువుగా ఉపయోగపడాలి. ఒంటరిగా ప్రయాణం చేయకూడదు. ఒళ్ళు కనిపించకుండా కప్పుకోవాలి. సంప్రదాయం, సనాతనం పేరిట సగాన్ని చచ్చుబరుస్తూ ఇటువంటి దుర్నీతిని పాటించే సమాజానికి మంచి మనుగడ ఉంటాయా? ఈ అభిప్రాయాన్నే ద్రౌపది ముర్ము పరోక్షంగా ప్రకటించారు.

'మీ టూ'ల్లోను, మలయాళ చలన చిత్ర రంగంలో మహిళా కళాకారులపై లైంగిక వేధింపులను బయటపెట్టిన హేమ కమిటీ ఉదంతాల్లోను, మిగతా దాదాపు అన్ని భాషల సినిమా రంగాల్లోను మగాహంకారాల్లో మహిళ దుస్థితి తెలుస్తూనే ఉన్నది. విషాదమేమిటంటే స్త్రీ పురుషులు ప్రధానంగా శారీరక శ్రమ చేసి బతికే కార్మిక వర్గంలో లేని అసమానత వారు మధ్యతరగతికి చేరుకునే క్రమంలో వచ్చి చేరుతున్నది. మహిళకు పురుష బానిసత్వం, దాన్ని బలపూరితం చేసే పూజలు, వ్రతాలూ వంటివి బిగుసుకుంటున్నాయి. మొన్న జూన్‌లో విడుదలైన ప్రపంచ లింగ వివక్ష సూచీలో 146 దేశాల్లో భారతదేశం ర్యాంకు 129 వద్ద మరి రెండు స్థాయిలు పడిపోయింది. కేవలం చట్టాల వల్ల నయమయ్యే రోగం కాదిది. ఈ విషయం తెలిసి కూడా ప్రభుత్వాలు చట్టాలు చేసి చేతులు దులుపుకుంటున్నాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రోగ మూలాన్ని పట్టుకున్నారు. మహిళను రెండో తరగతి పౌరురాలిగా, మగవాడి అడుగులకు మడుగులొత్తే జాతిగా చూడడం పట్ల నిరసన ప్రకటించారు. ఇప్పుడు చికిత్స జరగాల్సింది అక్కడే. అది అనుకున్నంత సులభం కాదు, మొత్తం సమాజం గట్టి సంకల్పం వహించాలి, అవరోధాలుగా ఉన్న అంశాలను నిర్మొహమాటంగా, నిష్పక్షపాతంగా గుర్తించాలి.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రోగ మూలాన్ని పట్టుకున్నారు. మహిళను రెండో తరగతి పౌరురాలిగా, మగవాడి అడుగులకు మడుగులొత్తే జాతిగా చూడడం పట్ల నిరసన ప్రకటించారు. ఇప్పుడు చికిత్స జరగాల్సింది సరిగ్గా అక్కడే.

భారత రాజ్యాంగం నిర్దేశించిన సర్వ సమానత్వం అన్ని రంగాల్లోనూ మహిళకు ఆచరణలో లభించేలా చూడాలి. కుటుంబ జీవనంలో నాలుగు గోడల మధ్య కూడా ఇది అమలుకు నోచుకునేలా చూడాలి. ఇందుకు అనువుగా ఆమె పాతివ్రత్య బంధనాలను సడలింపజేయాలి. తదనుగుణంగా క్షేత్ర స్థాయిలో సాంస్కృతిక ప్రచారం లోతుగా, విస్తృతంగా జరగాలి. మగాధిపత్యాన్ని పెంచి పోషించే ధోరణులకు స్వస్తి పలకాలి. ప్రగతిశీల రాజ్యాంగపాలిత దేశంలో పురుష సింహాలు, అబలలు అనే పదాలకు రవ్వంతైనా చోటు లేదని చాటాలి. పురుషుడి దయాదాక్షిణ్యాలపై బతికే దుస్థితి స్త్రీకి తొలగాలి. అంటే మహిళ తరతరాలుగా అనుభవించిన పురుష దాస్యం నుంచి మానసికంగా బయటపడి పరిపూర్ణమైన ఆర్థిక స్వాతంత్ర్యం అనుభవించే స్థితిని సాధించాలి. కుటుంబ పరిధిలోనూ స్త్రీ పురుషుల మధ్య సమానమైన శ్రమ విభజన ఆచరణలోకి రావాలి. ఖాప్ పంచాయితీలకు బదులు గ్రామ స్థాయి నుంచి రాజ్యాంగ సామాజిక పంచాయితీలను నెలకొల్పి వాటికి చట్టబద్ధ అధికారాలు ఇవ్వాలి. ఇప్పటికే సుప్రీంకోర్టు దృష్టిలో ఉన్న వైవాహిక అత్యాచారం, దాంపత్య అత్యాచారంపై విస్తృత చర్చ జరగాలి. అందులోని సున్నితమైన చేదు వాస్తవాన్ని భారతీయ సమాజం గుర్తించి, విరుగుడును కనుక్కోవాలి. స్త్రీ పురుషుడి సొంత ఆస్తి, భార్య అతడి సొత్తు అనే భావన పూర్తిగా తొలగాలి. స్త్రీ ఆర్థిక బానిసత్వ నిర్మూలనకు నడుం బిగించాలి. దేశంలోని శ్రమశక్తిలో మహిళ వాటా గణనీయంగా పెరగాలి. 2022–23లో దేశంలోని శ్రమశక్తిలో (కార్మికులు, ఉద్యోగులు) మహిళలు 35.9శాతం కాగా పురుషులు 76 శాతం. స్త్రీని పూజగదిలో పెట్టి పూజిస్తున్న భారతీయ సమాజం వాస్తవంలో మాత్రం ఆమెను పురుషుడికి కట్టుబానిసను చేసిందన్న ఘనమైన నిజం ఇందులో వెల్లడి అవుతున్నది. రాష్ట్రపతి ముర్ము స్త్రీ ద్వితీయ శ్రేణి దుస్థితి గురించి చెప్పిన చేదు వాస్తవం ఇదే! ఈ దేశ సనాతన పెద్దలు, ఆధునిక మేధావులు, పాలకులు అంతా కలిసి తలలు ఒక్క చోట చేర్చి రాపాడించవలసిన తరుణం ఇదే.

■ గార శ్రీరామమూర్తి
సీనియర్ జర్నలిస్ట్



చేయూతనిస్తే.. చేతికర్రతో ఏం పని?

7

- జీవిత చరమాంకంలో నిరాదరణకు గురవుతున్న వృద్ధులెందరో
- సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు





నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

రాజకీయ 'రచ్చ'!

అభివృద్ధి ఘనతపై కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

- ఎమ్మెల్యే నాయిని, మాజీ ఎమ్మెల్యే వినయ్ మధ్య మాటలయుద్ధం
- నయీంనగర్ వంతెన వేదికగా సవాళ్లు, ప్రతి సవాళ్లు
- ఢీ అంటే ఢీ అంటున్న ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు
- మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ సోషల్ మీడియా ట్రోలింగ్‌పై ఫైర్
- తెలంగాణ భవన్ వద్ద కొండా అనుచరుల ఆందోళనలు
- ప్రెస్‌మీట్‌లో కన్నీరు పెట్టుకున్న సురేఖ
- హాట్‌హాట్‌గా మారిన ఓరుగల్లు రాజకీయాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

అభివృద్ధి విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల సవాళ్లు, ప్రతి సవాళ్లతో ఓరుగల్లు రాజకీయాలు రచ్చకెక్కుతున్నాయి. అభివృద్ధితోపాటు వ్యక్తిగత విమర్శలపై ఇరరు పార్టీల నేతలు, కార్యకర్తల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. కొద్ది రోజులుగా గత ప్రభుత్వ పాలనలో జరిగిన వరంగల్ నగర అభివృద్ధిపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేస్తున్న విమర్శలకు బీఆర్ఎస్ నేతలు కౌంటర్ ఇచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఉద్రిక్తతకు దారితీస్తున్నాయి. హనుమకొండ నయీంనగర్ వంతెన వేదికగా ఇరు పార్టీల నేతల సవాళ్లు, ప్రతి సవాళ్లతో సోమవారం రాజకీయం వేడెక్కింది. మరో వైపు మెదక్ ఎంపీ రఘునందర్‌రావు మంత్రిని పూలదండతో సన్మానించడాన్ని తప్పు పడుతూ బీఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేయటంపై కొండా అనుచరులు భగ్గుమన్నారు. తెలంగాణ భవన్ వద్ద ఆందోళన దిగిన కొండా అనుచరులకు, బీఆర్ఎస్ కేడర్‌కు మధ్య జరిగిన ఘర్షణ ఉద్రిక్తతకు దారి తీయగా, ప్రెస్‌మీట్‌లో కొండా సురేఖ బీఆర్ఎస్ తీరుతో కన్నీళ్లు పెట్టుకోవడంతో ఒక్కసారిగా ఓరుగల్లు రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.

అభివృద్ధిపై కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అభివృద్ధిపై దూకుడుగా ముందుకు వెళుతున్నారు. గత ప్రభుత్వం శంకుస్థాపనలకే పరిమితమైందని, పైసా నిధులు కూడా లేకుండా శిలాఫలకాలు వేసుకున్నారని నాయిని గత ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వం హయంలో పదేళ్లుగాఈ అసంపూర్తిగా ఉన్న కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి చేసేందుకు రూ.50కోట్ల నిధులు తీసుకు రావడంలో క్రియశీలకంగా నాయిని వ్యవహరించారు. అంతేకాకుండా ప్రతీ వర్షాకాలంలో హనుమకొండ వాసులకు కంటికి కునుకు లేకుండా చేసే నయీంనగర్ వంతెన కోసం రూ.10కోట్ల వరకు నిధులు మంజూరు చేయించారు. ఈ రెండు పనులు కూడా బీఆర్ఎస్ హయాంలోనే పట్టాలెక్కినా నిధులు ముందుకు సాగలేదు. నాయిని రాజేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే తొలి ప్రాధాన్యంగా నయీంనగర్ బ్రిడ్జి, కాళోజీ కళాక్షేత్రం పూర్తి చేయడంతో పాటు గత ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ కూడా నాయిని విమర్శలను తిప్పికొడుతూ వస్తున్నారు. తమ ప్రభుత్వం హయాంలో చేసిన పనినే తాను చేసినట్టుగా చూపించుకుంటున్నారని నాయినిపై విమర్శలు చేస్తున్నారు. కాళోజీ కళాక్షేత్రానికి స్థలం కేటాయింపుతో పాటు రూ.45కోట్ల వరకు నిధులు కూడా తమ ప్రభుత్వం ఖర్చు చేసిందని, అలాగే నయీంనగర్ వంతెనకు శంకుస్థాపన చేసిన వెంటనే ఎన్నికల షెడ్యూల్ రావటంతో పనులు నిలిచాయని కౌంటర్ ఇస్తు వస్తున్నారు. కాగా, ఇటీవల తెలంగాణ భవన్‌లో జరిగిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ సమావేశంలో కేటీఆర్ వరంగల్ అభివృద్ధి, ఎమ్మెల్యే తీరుపై చేసిన విమర్శలు కాంగ్రెస్ శ్రేణులను భగ్గుమనేలా చేశాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ పరస్పర విమర్శలు, సవాళ్లు, ప్రతిసవాళ్లతో ఇరు పార్టీల శ్రేణుల మధ్య ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

కేటీఆర్ వ్యాఖ్యలు.. నాయిని ఘాటు స్పందన

హనుమకొండలోని నయీమ్ నగర్ బ్రిడ్జి విషయంలో మాట్లాడిన మాజీ మంత్రి కేటీఆర్ తాము బ్రిడ్జి కడితే ఇప్పుడున్న ఎమ్మెల్యే పూలాభిషేకాలు చేయించుకుంటున్నారని షాకింగ్ కామెంట్స్ చేశారు. అందుకు స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పందిం చా రు. ఆదివారం నయీంనగర్ బ్రిడ్జి వద్ద మీడియాసమావేశం నిర్వ హించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సవాల్ విసిరారు. కేటీఆర్ నిజమైన రాజకీ యనాయకుడైతే నయీమ్‌నగర్ బ్రిడ్జి వద్దకు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. తాను ఆధారాలతో వస్తానని, పదేళ్లు అధికారంలో ఉన్నా ఎందుకు నయీంనగర్ బ్రిడ్జ్ పూర్తి చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు.

నేతల సవాళ్లతో ఉద్రిక్తత..

కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల సవాళ్లు తీవ్ర ఉద్రికత్తలకు దారి తీశాయి. కొన్నాళ్లుగా సవాళ్లు, ప్రతి సవాళ్లతో నేతల మధ్య జరిగిన మాట యుద్ధం సోమవారం పతాక స్థాయికి చేరింది. ఉదయం 11గంటలకు నయీంనగర్ వంతెన పరిశీలనతో పాటు ప్రెస్‌మీట్ పెట్టేందుకు బీఆర్ఎస్ నేతలు సమాయత్తం కాగా.. మధ్యాహ్నం 12గంటలకు ఇదే వంతెనపై ప్రెస్‌మీట్‌కు అనుమతి తీసుకున్నారు. బీఆర్ఎస్ నేతలు కాస్త ఆలస్యం కావటంతో 12గంటల వరకు వంతెన వద్దకు కాంగ్రెస్ నేతలు చేరుకోవటంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్‌తో పాటు బీఆర్ఎస్ నేతలు, కేడర్ భారీగా తరలి రావటంతో అదే స్థాయిలో అక్కడికి చేరుకున్న కాంగ్రెస్ శ్రేణుల మధ్య పరస్పర తోపులాటతో పాటు నినాదాలతో హోరెత్తించారు. ఇరువర్గాలకు సర్దిచెప్పేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నించారు. అయినా ఘర్షణాత్మక వాతావరణం సద్దుమణగకపోవటంతో మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రాణాకు పంపారు.



గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సురేఖ

నయీంనగర్ బ్రిడ్జి వద్ద రణరంగం

- నిర్మాణ ఘనత తమదేనన్న మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్
- ఖండించేందుకు కాంగ్రెస్ నేతల ప్రయత్నం
- ఇరు వర్గాల పరస్పర నినాదాలు, తోపులాట
- పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు శ్రమించిన పోలీసులు



- పార్టీ ఆఫీసుకు వినయ్‌భాస్కర్, ఇతర నేతల తరలింపు

7

గంటకు పైగా నయీంనగర్ వంతెనపై ఇరువర్గాల ఆందోళనలు, తోపులాటలతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం వంతెన వద్ద మేయర్ గుండు సుధారాణితో పాటు కాంగ్రెస్ నేతలు ప్రెస్‌మీట్ నిర్వహించారు. బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ కూడా విలేకరుల సమావేశాన్ని నిర్వహించి కాంగ్రెస్ తీరు, పోలీసుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సోషల్ మీడియాలో ట్రోలింగ్.. సురేఖ కంటతడి

వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ వారు చేసిన ట్రోలింగ్ కూడా తీవ్ర ఉద్రిక్తతకు కారణమైంది. మంత్రి కొండా సురేఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రిగా ఉన్నారు. ఇటీవల కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హజరయ్యారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మర్యాదపూర్వకంగా మంత్రి సురేఖను పూలదండతో సన్మానించారు. ఆ ఫొటోను ట్రోల్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు అసభ్యకరంగా పోస్టులు పెడుతున్నారని మంత్రి కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు కూడా తప్పుగా మాట్లాడుతున్నారని కొండా అనుచరులు సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ వద్ద ఆందోళనకు దిగారు. కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో కొండా అనుచరులు విమర్శలు చేస్తూ ఆందోళన చేపట్టారు. దీంతో అక్కడ బీఆర్ఎస్ శ్రేణులకు, వరంగల్ కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కేటీఆర్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ శ్రేణులు, సీఎంకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు పరస్పరం ఆరోపణలు చేస్తుండటంతో తీవ్ర ఉద్రికత్త మధ్య పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. అనంతరం మంత్రి కొండా సురేఖ గాంధీభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కన్నీరు పెట్టుకున్నారు. సోషల్ మీడియాలో ఎంపీ రఘునందన్‌రావు తనకు దండ వేసిన ఫొటోను ట్యాగ్ చేసి 'వీరికి షాదీముబారక్ ఎవరు ఇచ్చారు' అని అసభ్యంగా పోస్టులు పెడుతున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. తనను తీవ్రంగా అవమానించారని, నిన్నటి నుంచి తాను అన్నం తినలేదని, నిద్రపోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సురేఖ ప్రెస్‌మీట్ వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడం, కేటీఆర్ చేసిన వాఖ్యలపై భగ్గుమన్న ఓరుగల్లు కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనకు దిగటం చర్చనీయాంశంగా మారింది. కాగా, సోమవారం వరుసగా వరంగల్ పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలు ఓరుగల్లు రాజకీయాల్లో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి.



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్

ఫిర్యాదుల పరిష్కారంపై వేగం పెంచండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- బల్దియా గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల వెల్లువ

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 30 : గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారంపై వేగం పెంచాలని, ఫిర్యాదుదారులకు సరియైన సమయంలో స్పందించి సత్వరమే న్యాయం చేయాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ బల్దియా కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి (గ్రీవెన్స్ సెల్) కార్యక్రమానికి నగర ప్రజల సమస్యలతో రాగా కమిషనర్ నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తు స్వీకరించిన తర్వాత వెంటనే అక్కడి విభాగాల అధికారులను పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 76 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు ప్రవీన్‌చంద్ర, రాజయ్య, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడేకర్, ట్యాక్సీల విభాగం అధికారి బిర్రు శ్రీనివాస్, డీసీపీ ప్రసన్నరాణి, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, టీపీఆర్‌వో కోళ రాజేశ్‌కుమార్ పాల్గొన్నారు. మొత్తం వివిధ విభాగాల నుంచి 76 వినతులను అధికారులు స్వీకరించారు.

- గ్రేటర్ వరంగల్ 11వ డివిజన్‌లోని పోతననగర్ ప్రాంతంలో లైట్లు వెలగడం లేదనీ, దీంతో రాత్రి సమయాల్లో చాలా ఇబ్బందిగా ఉందని మాదిగ అభివృద్ధి పరిరక్షణ సమితి నాయకులు ఫిర్యాదు చేశారు.
- హంటర్‌రోడ్డులోని భద్రకాళి బండ్ ప్రాంతంలో రోడ్లపైన కార్లు, బైకులు పార్కింగ్ చేయడం వల్ల ఇళ్లలో నివసించే వారికి ఇబ్బందిగా ఉందని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- రంగంపేట నుంచి భద్రకాళి దేవాలయానికి వెళ్తే మార్గంలో నెల రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదని రంగంపేట కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ వరంగల్ 1వ డివిజన్ కేయూ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఓ వ్యక్తి చాలా రోజులుగా పందులు పెంచడం వల్ల దుర్వాసన వెదజల్లుతుందని గుండ్లసింగారం బంజారకాలనీ వాసులు ఫిర్యాదు చేశారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

- జీఎస్టీ రాష్ట్ర జాయింట్ కమిషనర్ శ్రీలీల

ధర్మసాగర్, సెప్టెంబర్ 30: విద్యార్థులు ప్రగతికి చోదకులని సామాజిక మార్పునకు దోహద పడతారని జీఎస్టీ రాష్ట్ర జాయింట్ కమిషనర్ ఎడ్ల శ్రీలీల అన్నారు. సోమవారం ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అధ్యక్షతన ఫ్రెషర్స్‌డే, దుస్తుల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యతిథిగా విచ్చేసి మాట్లాడారు. భవిషత్‌లో ఏం కావాలన్నది ఇంటర్‌లోనే విద్యార్థులు నిర్ణయించుకుని లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని ఆమె సూచించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా కమిషనర్ రూ 50,000 విలువ గల దుస్తులను విద్యార్థినులకు పంపిణీ చేశారు.

చదువుపై ఆసక్తిని పెంచుకోవాలి

- ఎంపీ కడియం కావ్య
- 4వేల మంది విద్యార్థినులకు హెల్త్ కార్డులు : కలెక్టర్ ప్రావీణ్య



మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య

ఐనవోలు, సెప్టెంబరు 30: విద్యార్థులు చదువుపై ఆసక్తిని పెంచుకొని లక్ష్యాలను సాధించి బంగారు భవిష్యత్తును ఏర్పరుచుకోవాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఐనవోలు కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో (కేజీబీవీ) విద్యా, ఆరోగ్యశాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఆరోగ్య కార్డుల పంపిణీ- ఆరోగ్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు అన్నిరకాల సదుపాయాలను కల్పిస్తోందని తెలిపారు. వాటిని వినియోగించుకుని ప్రయోజకులుగా మారి సమాజాభివృద్ధికి సాయం అందించాలని(పే బ్యాక్ సొసైటీ) అన్నారు. ఆరోగ్యం, చదువు, వ్యక్తిగత సంరక్షణపై దృష్టిసారించాలని వారికి సూచించారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది విద్యార్థినులకు థైరాయిడ్ పీసీవోడీ పరీక్షలు చేస్తూ వారి ఆరోగ్య జాగ్రత్తలపై చైతన్యపరచాలన్నారు. కేజీబీవీలో డిగ్రీ కళాశాల మంజూరికి తన వంతు కృషిచేస్తానన్నారు.

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ బడి కడితే చదువుకొని విద్యావంతులవుతారని, గుడి కడితే బిచ్చగాళ్లు తయారవుతారన్నారు. అందుకు తాను గుడికంటే బడికే మొదటి ప్రాధాన్యతను ఇస్తానన్నారు. విద్యార్థినులు వ్యక్తిగత సమాచారాన్ని సోషల్‌మీడియాలో షేర్ చేయవద్దన్నారు.ఎమ్మెల్యే తన సొంత డబ్బులు రూ.40వేలతో విద్యార్థినులకు క్రీడా సామాగ్రి అందజేశారు.

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ ప్రస్తుతం ఇంటర్ వరకు ఉన్న కేజీబీవీని డిగ్రీ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ ప్రహరీ, మల్లికార్జునస్వామి దేవస్థానంలో డార్మెంటరీ హాల్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఎంపీని కోరారు.

కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ... విద్యార్థినుల ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు తల్లిదండ్రులకు తెలిసేవిధంగా హెల్త్ కార్డులలో పొందుపరుస్తున్నామన్నారు. ప్రతీ నెల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 15 నుంచి 20 వరకు విద్యార్థినుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9 కేజీబీవీలు, మూడు మోడల్ స్కూల్స్ ఒక అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు 4వేల హెల్త్ కార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో వాసంతి, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ లలితాదేవి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సత్యవేణి, డాక్టర్ శ్రీనివాస్, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో పూజలు

ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావులు మల్లికార్జునస్వామి ఆలయాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలు అందజేసి పట్టువస్త్రాలను బహుకరించారు.

అవార్డులు ప్రతిష్టను పెంచుతాయి

- నగర మేయర్ గుండు సుధారాణి
- నైబర్ హుడ్ చాలెంజ్ సర్టిఫికెట్‌ను మేయర్‌కు అందజేసిన అధికారులు



మేయర్‌కు సర్టిఫికెట్ అందిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 30 : మనం చేసే సేవలకు వచ్చే అవార్డులు ప్రతిష్టను పెంచుతాయని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి గృహ మంత్రిత్వ శాఖ (ఎంఓహెచ్‌యూఏ) ఆధ్వర్యంలో ఢిల్లీలో స్మార్ట్‌సిటీ నగరాలకు సంబంధించిన సమావేశంలో గత మూడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న నర్సరింగ్ నైబర్ హుడ్ చాలెంజ్ (ఎన్ఎన్‌సీ) పోటీలలో దేశంలోని ఐదు నగరాలకు గుర్తింపు లభించింది. ఇందులో గ్రేటర్ వరంగల్ టాప్ - 5లో నిలిచింది. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ నుంచి వరంగల్ బల్దియాకు సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డును స్మార్ట్ సిటీ విభాగం ఎస్ఈ ప్రవీన్‌చంద్ర వారం రోజుల క్రితం అందుకున్నారు. సోమవారం స్మార్ట్ సిటీ అధికారులు వరంగల్ బల్దియాకు చేరుకుని మేయర్ గుండు సుధారాణిని కలిసి సర్టిఫికెట్‌ను మేయర్‌కు అందించారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడారు. ఎన్ఎన్‌సీ పోటీలలో బెంగుళూరు, ఇండోర్, జబల్‌పూర్, కొచ్చి, నగరాలతో పాటు వరంగల్‌కు స్థానం దక్కడం చాలా సంతోషంగా ఉందన్నారు. అవార్డు రావడానికి కృషి చేసిన స్మార్ట్ సిటీ ఇంజనీరింగ్ అధికారులను అభినందించారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 100 స్మార్ట్ సిటీ నగరాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఫేజ్ -1లో భాగంగా ఎన్ఎన్‌సీ చాలెంజ్ పేరుతో వరంగల్ నగరంలో ఎంహెచ్ నగర్‌లో 56 గంటలలో చిట్టి పార్క్‌ను ఏర్పాటు చేసి చరిత్ర సృష్టించామన్నారు. అంతే కాకుండా క్రిస్టి యన్ కాలనీలో నైబర్ హుడ్ పార్క్, కరీమాబాద్‌లో గుండు బావి, శ్రీనగర్ కాలనీలో సెన్‌సోరి పార్క్, ఎన్‌పీ స్కూల్‌లో సైన్స్ పార్క్, అంబేద్కర్ కూడలి వద్ద బుద్ధ ప్లాజాలను నిర్దేశిత సమయంలో ఏర్పాటు చేసి డాక్యుమెంటేషన్ కమిటీకి పంపించడం జరిగిందన్నారు. వరంగల్ నగర అభివృద్ధికి అధికారులు మరిన్ని అవార్డులు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. మేయర్‌ను కలిసిన వారిలో ఎస్ఈ ప్రవీన్‌చంద్రతో పాటు ఈఈలు, డీఈలు, ఏఈలు ఉన్నారు.

సద్దుల బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

- మేయర్ గుండు సుధారాణి
- బల్దియా అధికారులతో సమావేశం

8

నేటి నుంచి డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 30 : డీఎస్సీ ఫలితాలు వెలువడిన నేపథ్యంలో అర్హులైన అభ్యర్థులకు మంగళవారం నుంచి 1:3 ప్రాతిపదికన సర్టిఫికేట్ల పరిశీలన ప్రారంభం అవుతుందని డీఈవోలు ఎం.జ్ఞానేశ్వర్, డి.వాసంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ జిల్లాలో డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్న 301 ఖాళీ పోస్టులకు 1:3 ప్రాతిపదికన 903 మంది అభ్యర్థులకు, హనుమకొండ జిల్లాలో 187 పోస్టులకు 561 మంది డీఎస్సీలో అర్హులైన అభ్యర్థులను 1:3 ప్రాతిపదికన సర్టిఫికేట్ల వెరిఫికేషన్‌కు రావాలని సూచించారు. వరంగల్ జిల్లా అభ్యర్థులకు ప్రభుత్వ డైట్ కళాశాలలో, హనుమకొండ జిల్లా అభ్యర్థులకు సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సర్టిఫికేట్ల పరిశీలిన కేంద్రాల్లో హాజరు కావాలని వారు పేర్కొన్నారు. ఈ నెల 1 నుంచి 5 వరకు సబ్జెక్టుల వారీగా సర్టిఫికేట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అభ్యర్థులు వారికి సంబంధించిన అన్ని ఒరిజినల్స్‌తో పాటు సెల్ఫ్ అటెస్టు చేసిన రెండు సెట్ల జీరాక్స్ కాపీలు, ఒరిజినల్ ఆధార్, పాన్ కార్డులను తీసుకురావాలని వారు సూచించారు.

బొజ్జా తారకం ఆశయాలను కొనసాగించాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి,సెప్టెంబరు 30 : హక్కుల నేత, ఆర్‌పీఐ(బి) వ్యవస్థాపకులు బొజ్జా తారకం ఆశయాలను సమాజంలోని ప్రతీ ఒక్కరు స్ఫూర్తిగా తీసుకొని కొనసాగించాలని వరం గల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్ లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (బొజ్జా తారకం) ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు శ్రీరాముల పైడి అధ్యక్షతన బొజ్జా తారకం 8వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. బొజ్జా తారకం, ఆయన సతీమణి విజయ భారతి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ మాట్లాడుతూ బొజ్జా తారకం జీవితమంతా కుల రహిత వర్గ సమాజ నిర్మూలన కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల హక్కుల కోసం నిరంత రం శ్రమించిన గొప్ప రాజనీతిజ్ఞుడు బొజ్జ తారకం అని కొనియాడారు. ఆర్‌పీఐ (బి) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్ధంతి సభలో ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య, ప్రజా సంఘాల నేతలు బండి మొగిలి, కొండ్ర నర్సింగరావు, తరాల సందీప్, చుంచు రాజేందర్, సుదమల్ల అశోక్, నక్క భిక్షపతి, కీసరి రజిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

DEVARA THANDAVAM



సుదర్శన్ 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.30,6.15,9.45

సంధ్య 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి క్రాస్ రోడ్స్
11.00,2.30,6.00,9.30

SVC సంగీత 70 - ఆర్.సి.పురం 11.00,2.30,6.00,9.30	SVC ఈశ్వర్ 70 - అత్తాపూర్ 11.00,2.30,6.00,9.30
SVC శ్రీలక్ష్మి /ఇంద్ర నాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.15,2.45,6.30,10.00	SVC శివశక్తి 70ఎంఎం - కాప్రా 11.00,2.30,6.00,9.30
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.30,6.00,9.30	శ్రీసాయిరాం 70 - మల్కాజ్‌గిరి 11.15,2.45,6.30,10.15

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 9.00,9.00,9.15,10.30, 9.45,12.15,12.25,12.30, 12.45,1.00,3.30,3.45, 3.45,4.00,4.15,6.45,7.00, 7.05,7.15,7.30,10.00, 10.05,10.25,10.30,10.45

ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 8.15,8.20,8.30,8.45,9.30, 10.00,11.35,11.55,12.10

జిఎస్ఎమ్ - మదీనగూడ 8.00,8.20,8.40,10.45,11.15, 11.35,11.55,12.15,2.20, 2.50,3.10,3.30,3.50,5.55, 6.25,6.45,7.05,7.25,9.30,10.00, 10.20,10.30,10.40,11.00

నెక్సస్ సత్య - కవాడిగూడ 8.40,9.00,9.40,11.15,12.15, 12.40,2.20,2.50,3.50,5.55,6.25, 7.00,7.25,9.30,10.00,10.30

సినీ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 8.40,9.00,9.20,12.10,12.50,3.40,4.00, 4.20,7.10,7.50,10.00,10.40,11.20

సినీ సినిమాస్ - బాలానగర్ 8.40,9.00,9.20,12.10,12.50,3.40,4.00, 4.20,7.10,7.50,10.00,10.40,11.20

సినీ సినిమాస్ - చందానగర్ 8.40,9.00,9.20,12.10,12.50,3.40,4.00, 4.20,7.10,7.50,10.00,10.40,11.20

సినీటౌన్ - మియాపూర్

MASS JATHARA



వరంగల్		
రాధిక ఎ/సి - వరంగల్	అన్నపూర్ణ - హుజూరాబాద్	శ్రీనివాస - చౌటుప్పల్
జెమిని కాంప్లెక్స్ - వరంగల్	అన్నపూర్ణ 70 - జమ్మికుంట	అచ్చిరెడ్డి 70 - హాలియా
ఎస్‌ఆర్ ఎ/సి - వరంగల్	శివరామకృష్ణ - వేములవాడ	వెంకటేశ్వర - తిరుమలగిరి
అమృత 70 - హన్మకొండ	VKM మూవీమ్యాక్స్ - హుస్నాబాద్	సుజన 70 - చిట్యాల
శ్రీదేవి - హన్మకొండ	శ్రీనివాస - చొప్పదండి	వెంకటేశ్వర - వలిగొండ
సూర్య క.మం. - మహబూబాబాద్	రాజశ్రీ సినిమా - రాయికల్	లక్ష్మి - యాదగిరిగుట్ట
దేవి 70 - జనగాం	నిజామాబాద్	లక్ష్మి 70ఎంఎం - మాల్
భవాని 70 - కాజీపేట్	లలిత మహల్ - నిజామాబాద్	వెంకటరమణ - నేరేడుచర్ల
జయశ్రీ - నర్సంపేట్	విజయ - నిజామాబాద్	MRR సాయిరాం - పోచంపల్లి
ఊర్వశి - భూపాలపల్లి	గీత - నిజామాబాద్	సత్యనారాయణ - చండూర్
రామకృష్ణ - తొర్రూర్	వేణు - నిజామాబాద్	పద్మావతి పిపా - దామరచర్ల
లక్ష్మి ఎ/సి - మర్రిపెడ	సినిమాస్ - ఆర్మూర్	తారా సినిమా - మోత్కూర్
తిరుమల ఎ/సి - ములుగు	వి.శాంతి - కామారెడ్డి	ఆదిలాబాద్
విబికె మూవీమ్యాక్స్ - చేర్యాల	వెంకటేశ్వర - బోధన్	నటరాజ్ - ఆదిలాబాద్
సూర్య క.మం. - నెక్కొండ	మహేశ్వరి - బాన్సువాడ	జెమిని - మంచిర్యాల
తిరుమల 70 - పాలకుర్తి	బృందావన్ - ఆర్మూర్	శ్రీనివాస - మంచిర్యాల
నారాయణ 70 - హసన్‌పర్తి	పరమేశ్వర - బిచుకుంద	తిరుమల - నిర్మల్
మహాలక్ష్మి - స్టేషన్‌ఘన్‌పూర్	సుదర్శన్ - భీంగల్	బాలాజీ - బెల్లంపల్లి
మోహన్ ఎ/సి - కె.సముద్రం	వెంకటేశ్వర - పిట్లం	మహానంది - లక్సెట్టిపేట
	లక్ష్మి 70 - ఎల్లారెడ్డి	రాఘవేంద్ర - జైన్నారం

బతుకమ్మ దసరా ఏర్పాట్లపై సమావేశం

వేలేరు ,సెప్టెంబర్ 30: బతుకమ్మ, దసరా ఏర్పాట్లపై వేలేరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీ ప్రసన్న అధ్యక్షతన రెవెన్యూ ,ఆరోగ్య శాఖ ,పోలీసు శాఖల అధికారులు, స్పెషల్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం సోమవారం నిర్వహించారు. రాబోయే బతుకమ్మ , దసరా ఏర్పాట్లలో ఏలాంటి సమస్యలు తలెత్తకుండా మెరుగైన సౌకర్యాలను అందించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాలలో పారిశుద్ధ్యం, వీధి దీపాలు ,శాని టేషన్ వంటి ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. పనులు పూర్తి అయ్యే వరకు గ్రామాలలోజీపీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

అక్టోబర్ 3న బ్రహ్మాండమైన విడుదల



లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్

SRI VIJAYA FILMS

BLOCKBUSTER HIT నేడే చూడండి



దేవి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ (175/- 110/- 55/-)
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.30,6.00,9.30

మల్లికార్జున 70 - కూకట్‌పల్లి (150/- 100/- 50/-) 11.15,2.30,6.15,9.30	సప్తగిరి - కాటెదాన్ 2.00,9.00
వెంకటరమణ/భద్రకాళి - ఇందిరా (150-100/-50/-) 3.00pm	మెగా 70 - దిల్‌సుఖ్‌నగర్ (150/- 100/-) 11.00,2.00,6.00,9.00
ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ (150/- 100/-) 11.15,6.15	భుజంగ 70 - జీడిమెట్ల (150/- 100/-) 11.00,2.00,6.00,9.00
శ్రీరమణ 35 - అంబర్‌పేట్ (150/- 100/- 50/-) 11.00,2.00,6.00,9.00	లక్ష్మి 70 - శంషాబాద్ (150/- 100/- 50/-) 11.00,2.00,6.00,9.00
తారక్లారి 70 - ఇసిఐఎల్ (150/- 75/-) 11.00,2.00,6.00,9.00	లక్ష్మి క.మం - అల్వాల్ (150/- 100/- 70/-) 11.00,2.00,6.00,9.00
సిద్దేశ్వర్ పిపిపి - ఖైరతాబాద్ (235/- 175/- 150/- 50/-) 2.45pm	

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 10.20,10.25 తమిళ్: 1.15,7.10
ఎ.ఎం.బి సినిమాస్ - గచ్చిబౌలి 9.25,12.50,3.00,7.10,10.25 తమిళ్: 3.50pm
పివిఆర్ సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 9.50,1.20,3.30,7.10,10.50
పివిఆర్ ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.00,12.10,3.50,7.30,11.10 తమిళ్: 7.20pm
పివిఆర్ ఆర్.కె. - బంజారాహిల్స్
జిఎస్ఎమ్ - మదీనగూడ 10.20,11.15,3.00,6.45,10.30 తమిళ్: 7.05pm
నెక్సస్ సత్య - కవాడిగూడ 10.40,11.15,3.00,6.45,10.30
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 10.50,2.30,3.40,6.15,10.00
మంజీరామాల్ - కూకట్‌పల్లి 10.00,1.00,4.40,11.20 తమిళ్: 7.05pm
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి
సినీ సినిమాస్ - బాలానగర్ 10.10,12.30,7.30,11.00
సినీ సినిమాస్ - చందానగర్ 10.00,12.30,7.30,11.00
సినీటౌన్ - మియాపూర్ 9.50,1.10,7.30,11.00
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 9.50,1.10,7.30,11.00

GLOBAL CINEMAS RELEASE

ఈనెల 3న బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	జిఎస్ఎమ్ - మదీనగూడ	సినీ సినిమాస్ - బాలానగర్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	నెక్సస్ సత్య - కవాడిగూడ	సినీ సినిమాస్ - చందానగర్
పివిఆర్ సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	లక్ష్మీనరసింహ - మియాపూర్
పివిఆర్ ఫోరం మాల్ - కూకట్‌పల్లి	మంజీరామాల్ - కూకట్‌పల్లి	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
పివిఆర్ ఆర్.కె. - బంజారాహిల్స్	సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
పివిఆర్ ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్	మంత్రామాల్ - అత్తాపూర్	మూవీటైమ్ - అమీర్‌పేట

BGM STUDIO RELEASE

అక్టోబర్ 4న బ్రహ్మాండమైన విడుదల



లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్

SRI LAKSHMI PICTURES RELEASE 9885291789

అక్టోబర్ 4న బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	నెక్సస్ సత్య - కవాడిగూడ	సినీ సినిమాస్ - చందానగర్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	సినీటౌన్ - మియాపూర్
పివిఆర్ సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	మంజీరామాల్ - కూకట్‌పల్లి	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
పివిఆర్ ఫోరం మాల్ - కూకట్‌పల్లి	సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
పివిఆర్ ఆర్.కె. - బంజారాహిల్స్	మంత్రామాల్ - అత్తాపూర్	మూవీటైమ్ - అమీర్‌పేట
పివిఆర్ ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్	సుధా - శాలిబండ	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
పివిఆర్ గలేరియా - పంజాగుట్ట	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్	స్కైమాల్ - సనత్‌నగర్
పివిఆర్ బిగ్‌బాజ్ - హైటెక్‌సిటీ	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్	టివోలి - సికింద్రాబాద్
పివిఆర్ ఐమ్యాక్స్ - ఎర్రమంజిల్	ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
పివిఆర్ ఐమ్యాక్స్ - ముసారాంబాగ్	సినీ ప్లానెట్ - కొంపల్లి	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ ప్రెస్టేజ్ మాల్ - గచ్చిబౌలి	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్	షా ఘౌస్ షా - చింతల్
పివిఆర్ అట్రియమ్ - గచ్చిబౌలి	ఏషియన్ రాధిక - కాప్రా	లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
పివిఆర్ ఎస్‌ఆర్ నోము - మల్లాపూర్	ఎంకాస్ట్ మాల్ - అత్తాపూర్	మూవీమ్యాక్స్ - మౌలాలి
బి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	ఎంబెల్లా సినీస్క్వేర్ - నారపల్లి	జె.పి.సినిమాస్ - చందానగర్
ఎం.పి మాల్ - కాచిగూడ	సినీ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్	అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల
జిఎస్ఎమ్ - మదీనగూడ	సినీ సినిమాస్ - బాలానగర్	మరియు మీ అభిమాన థియేటర్లలో

RUDRA CREATIONS THRU PARAMJYOTHI FILMS 9848028739

నయీంనగర్ బ్రిడ్జి వద్ద రణరంగం

- నిర్మాణ ఘనత తమదేనన్న మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్
- ఖండించేందుకు కాంగ్రెస్ నేతల ప్రయత్నం
- ఇరు పార్టీల శ్రేణుల పరస్పర నినాదాలు, తోపులాట
- పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు శ్రమించిన పోలీసులు
- వాహనాల్లో వినయ్‌భాస్కర్, ఇతర నేతల తరలింపు


నయీంనగర్ బ్రిడ్జి సందర్శనలో వినయ్‌భాస్కర్, సుందర్‌రాజ్ తదితర బీఆర్ఎస్ నాయకులు


బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 30 : హనుమకొండ నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణ ఘనతపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రకటనలు ఉద్రిక్తతకు దారి తీశాయి. నిన్నటి వరకు మీడియా, ఇతర మార్గాల్లోనే జరిగిన మాటల యుద్ధం.. సోమవారం ఏకంగా ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తల ప్రత్యక్ష యుద్ధానికి దారితీసింది. దీంతో నయీంనగర్ బ్రిడ్జి ప్రాంతం రణరంగంగా మారింది. పరిస్థితి చేయి దాటుతున్న క్రమంలో అక్కడికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. వినయ్‌భాస్కర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు బ్రిడ్జిని పరిశీలించి రోడ్డుపై బైఠాయించారు. ఆ సమయంలో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పోటాపోటీ నినాదాలు చేయగా పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు వారిని చెదరగొట్టి.. వినయ్‌భాస్కర్ ఇతర బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకొని వాహనాల్లో తరలించారు. మొత్తంగా సుమారు రెండు గంటల పాటు నయీంనగర్ బ్రిడ్జి వద్ద హై టెన్షన్ వాతావరణం కనిపించింది.

జరిగిందేంటంటే..

నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణమే కాదు బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం, భద్రకాళి మాడ వీధులతో పాటు ఇతర అభివృద్ధి పనులను తొమ్మిది నెలల వ్యవధిలోనే చేపట్టామంటూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రకటిస్తూ వచ్చారు. దీనిపై పలు మార్లు స్పందించిన మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ ఆ ఘనత తమదేనని, తమ హయంలోనే నిర్మాణాలు చేపట్టామంటూ ప్రతి వాదన చేస్తూ వచ్చారు. 'మిత్ర' సంబోధం చేస్తూనే ఇద్దరూ తమ రాజకీయ వైరాన్ని బహిర్గతం చేస్తుండటం నగరంలో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ క్రమంలోనే నయీంనగర్ మాత్రమే కాదు పలు అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు రావాలని నాయిని సవాల్ విసిరారు. అంతేకాదు హనుమకొండలో తాము చేసిన అభివృద్ధిని కాంగ్రెస్ తమ ఘనతగా చెప్పుకొంటుందంటూ మాజీ మంత్రి కేటీఆర్ చెప్పుకొంటున్నారన్న ఎమ్మెల్యే నాయిని కేటీఆర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సెప్టెంబరు 29న బ్రిడ్జి వద్ద చర్చకు రావాలని కేటీఆర్, వినయ్‌భాస్కర్‌కు ఆయన సవాల్ కూడా విసిరారు. తన సవాల్ మేరకు రాజేందర్‌రెడ్డి ఆదివారం బ్రిడ్జి వద్దకు వచ్చి మీడియాతో మాట్లాడారు. నయీంనగర్ బ్రిడ్జి కూల్చివేత, నిర్మాణం వరకు జరిగిన ప్రక్రియ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి నిధుల మంజూరు, నిర్మాణ పూర్తి వరకు వివరిస్తూ బీఆర్ఎస్ నేతల తీరును ఖండించారు.

ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 11గంటలకు నయీంనగర్ బ్రిడ్జి సందర్శనకు మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు వచ్చారు. అప్పటికే నయీంనగర్ బ్రిడ్జి వద్ద మీడియా సమావేశం ఉంటుందని కాంగ్రెస్ ప్రకటించగా మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు తోట వెంకన్న, రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీతో పాటు అజీజ్‌ఖాన్, రజాలీ, అబూబాకర్ తదితరులు బ్రిడ్జికి కొద్ది దూరంలో నిలిచారు. బీఆర్ఎస్ సందర్శన తరువాత మీడియాతో మాట్లాడేందేకు వారంతా సిద్ధమయ్యారు. కానీ అప్పటికే పరిస్థితి వేడెక్కింది.

ఉద్రిక్తతు దారి తీసిన వైనం

మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ మీడియాతో మాట్లాడిన తరువాత బ్రిడ్జి వద్దకు వచ్చేందుకు మేయర్ గుండు సుధారాణి ఇతర కాంగ్రెస్ నాయకులు ప్రయత్నించారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలు చేశారు. ఆ సమయంలోనే కార్యకర్తలు తోపులాటకు దిగడంతో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. వారు ఘర్షణ పడడంతో బ్రిడ్జి రణరంగానికి వేదికగా మారింది. అప్పటికే అక్కడ మోహరించిన అప్రమత్తమై ఇరువర్గాలకు నచ్చజెప్పినా ఫలితం లేకపోవడంతో వారు చెల్లా చెదురు చేశారు. కానీ పరిస్థితి అదుపులోకి తెచ్చేందుకు శ్రమించాల్సి వచ్చింది. రోడ్డుపై బైఠాయించిన వినయ్‌భాస్కర్ ఇతర నాయకులను పోలీసులు వాహనాల్లో బీఆర్ఎస్ కార్యాలయానికి తరలించారు. ఇక ఆ పక్కనే ప్రజాభవన్ ఉండడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే నయీంనగర్ బ్రిడ్జి విషయంలో బీఆర్ఎస్ హయాంలో నాడు ఆ పార్టీలో ఉన్న నాయకులే.. నాటి ప్రతిపక్ష, నేటి అధికార కాంగ్రెస్ వైపు మాట్లాడటాన్ని చూసిన స్థానికులు ఇదేనేమో రాజకీయ సిత్రం అంటే అని చర్చించుకోవడం కనిపించింది.

ఆనాడే నగరాభివృద్ధి ప్రణాళికలు : మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్



నయీంనగర్ బ్రిడ్జిని సందర్శించిన అనంతరం మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ ఇతర బీఆర్ఎస్ నాయకులు మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయంలోనే నగరాభివృద్ధి కోసం రూ.500 కోట్ల ప్రణాళికలు సిద్ధమయ్యాయని వినయ్‌భాస్కర్ వెల్లడించారు. నయీంనగర్ బ్రిడ్జి, నాలా విస్తరణతో పాటు మరికొన్ని అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. నిధుల మంజూరు, అవసరత ప్రాధాన్యత క్రమంలో నిర్మాణ పనులు చేపట్టేందుకు సిద్ధమైనట్లు వివరించారు. గొప్పలు చెప్పుకోవడం తమకు ఇష్టం లేదని, కేయూ వంద ఫీట్ల రోడ్డు నిర్మాణం, ఆపై నయీంనగర్ బ్రిడ్జి చేపట్టేందుకు సిద్ధమైన క్రమంలో ఎన్నికలు వచ్చాయని వివరించారు. నాడు మంజూరైన నిధులతోనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఆ ఘనతను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తమదిగా చెప్పుకొంటున్నారని, రాష్ట్రం కోసం పోరాడిన చరిత్ర తమదని, ఎమ్మెల్యే నాయిని తమ కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

బీఆర్ఎస్‌ది రాజకీయ రాద్ధాంతం : మేయర్ గుండు సుధారాణి



అసత్యప్రచారాలతో బీఆర్ఎస్ రాజకీయ రాద్ధాంతం చేస్తోందని మేయర్ గుండు సుధారాణి విమర్శించారు. నయీంనగర్ బ్రిడ్జి వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు. గతంలో వరదల సమయంలో నగరం ముంపునకు గురైందని, బీఆర్ఎస్ హయంలో బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదనలు మాత్రమే జరిగాయని, నిర్మాణం చేపట్టలేదన్నారు. నిధుల కేటాయింపు కూడా లేదని ఈ విషయాన్ని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి బాహాటంగానే చెబుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాజేందర్‌రెడ్డి నయీంనగర్ బ్రిడ్జితో పాటు కాళోజీ కళాక్షేత్రం ఇతర అనేక అభివృద్ధి పనుల కోసం సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి నిధులు మంజూరు చేయించుకున్నారన్నారు. నయీంనగర్ పాత బ్రిడ్జి కూల్చివేసి నాలుగు నెలల్లోనే నూతన బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేశారని తెలిపారు. నిధులు తీసుకొస్తేనే కదా బ్రిడ్జి నిర్మాణమే కాకుండా ఇతర అభివృద్ధి పనులు పూర్తి అవుతున్నాయంటూ వివరించారు. దీనిని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ రాద్ధాంతం చేస్తోందని, తమ హయంలోనే బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టామంటూ వినయ్‌భాస్కర్ చెప్పడం అసత్య ప్రచారమని కొట్టి పారేశారు.

ఎంపీడీవో కార్యాలయం ఐనవోలుకు మార్పు

- ఆదేశాలు జారీచేసిన కలెక్టర్


ఎంపీడీవో కార్యాలయం మార్పుపై కలెక్టర్, ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

ఐనవోలు, సెప్టెంబరు 30: ఐనవోలు ఎంపీడీవో కార్యాలయాన్ని తక్షణమే హనుమకొండ జిల్లా కేంద్రం నుంచి ఐనవోలు మండలకేంద్రానికి మార్చాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాలు జారీచేశారు. ఏడేళ్ల కిందట ఏర్పడిన ఐనవోలు మండల కేంద్రంలో నేటికీ ఎంపీడీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేయలేదు. జిల్లా కేంద్రంలోని వడ్డెపల్లిలో ఐనవోలు ఎంపీడీవో కార్యాలయం కొనసాగుతోంది. ఈ కార్యాలయాన్ని ఐనవోలుకు మార్చాలని గతంలో ఆంధ్రజ్యోతిలో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. సోమవారం ఐనవోలు కేజీబీవీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే నాగరాజు, టెస్కాబ్ చైర్మన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయం సమస్యపై ఆంధ్రజ్యోతి కథనాలను టెస్కాబ్ చైర్మన్ దృష్టికి పలువురు తీసుకెళ్లగా ఆయన నేరుగా కలెక్టర్, ఎమ్మెల్యే వద్దకు వెళ్లి ఎంపీడీవో కార్యాలయాన్ని హనుమకొండ నుంచి ఐనవోలుకు మార్చడానికి జరుగున్న జాప్యంను వివరించారు. కలెక్టర్, ఎమ్మెల్యేలు వెంటనే స్పందించి ఎంపీడీవో పులి వెంకటేశ్వర్లును పిలిచి కార్యాలయంను తక్షణమే ఐనవోలుకు మార్చాలని అందుకు కావాల్సిన ఆదేశాలను జరీచేస్తానన్నారు. సాయంత్రం కలెక్టరేట్‌కు రావాలని కలెక్టర్ ఎంపీడీవోకు స్పష్టం చేశారు. దీంతో ఎంపీడీవో కార్యాలయాన్ని హనుమకొండ నుంచి ఐనవోలుకు మార్చడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ ఎంపీడీవో కలెక్టర్‌కు లేఖపెట్టడం వెంటవెంటనే జరిగిపోయింది. ఒకటి రెండు రోజుల్లో హనుమకొండలోని కార్యాలయాన్ని ఖాళీ చేసి ఐనవోలులో ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఖాళీగా ఉన్న హాస్టల్ భవనం లేదా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో కార్యాలయం ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో రఘుపతి తెలిపారు.

రామన్నగూడెం యువకులది సహజ మరణమే

నిర్ధారించిన వరంగల్ ఫోరెన్సిక్ ల్యాబ్

నర్సింహులపేట, సెప్టెంబరు 30: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం రామన్నగూడెంలో ఒకేరోజు ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన మిస్టరీ వీడింది. ఆ యువకులది సాధారణ మరణమేనని వరంగల్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ ఇచ్చిన నివేదిక ఆధారంగా నర్సింహులపేట ఎస్సై మాలోత్ సురేష్ సోమవారం వివరాలు వెల్లడించారు. రామన్నగూడెం గ్రామంలో ఈ ఏడాది జూన్ 10న స్నేహితుడి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న బొల్లోజు శ్రావణ్, ఎస్‌కె రహీమ్, ఉపేంద్రాచారి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారికి మెరుగైన వైద్యం అందించినా బొల్లోజు శ్రావణ్, ఎస్‌కే రహీమ్ మృతి చెందడంతో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తింది. వీరి మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపారు. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ వారు ఇచ్చిన నివేదిక ప్రకారం యువకుల శరీరంలో ఎలాంటి విషపూరిత ఆహారం కలవలేదని, ఆ యువకులు సహజంగానే మృతి చెందినట్లు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై సురేష్ తెలిపారు. అయితే యువకుల మృతిపై రామన్నగూడెం వాసుల అనుమానాలకు ఈ ల్యాబ్ ఇచ్చిన నివేదికతో తెరపడింది.





రక్తదానం.. ప్రాణదానం

- ఆపన్నహస్తం అందిస్తున్న రెడ్‌క్రాస్
- రోగులను ఆదుకుంటున్న ఎంజీఎం బ్లడ్ బ్యాంక్
- ఎందరికో జీవం పోస్తున్న దాతలు

నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం





వరంగల్ మెడికల్, సెప్టెంబరు 30 : రక్తదానం అంటే ప్రాణదానం.. అవసరమైన వ్యక్తికి రక్తాన్ని దానం చేయడం మానవుడి నైతిక విలువల్లో ఒకటి. ప్రపంచంలో ప్రతీ 2 సెకన్లకు ఎవరో ఒకరు రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. పూర్తి ఆరోగ్యంతో ఉన్నవారి రక్తం ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడేందుకు ఉపయోగపడుతుంది. స్వచ్ఛందంగా రక్త దానం చేయడానికి ఎందరో ముందుకు వస్తున్నారు. కొందరు 50 సార్ల కన్నా ఎక్కువగా రక్తదాన చేసినవారున్నారు. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని, పైగా వారు మరింత ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్లు చెబుతున్నారు. స్వచ్ఛంద రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి, రక్తదాతలను ప్రోత్సహించడానికి ప్రతీ సంవత్సరం అక్టోబరు 1న జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో ఎక్కువ సార్లు రక్తదానం చేసి ఎందరో ప్రాణాలు కాపాడిన వారు చాలామందే ఉన్నారు. అయితే రక్తదానం చేయడం మంచిది కాదని ఎంతోమంది అపోహపడుతుంటారు. కానీ రక్తదానం వల్ల క్యాన్సర్ రిస్క్‌ను తగ్గించుకోవచ్చని, గుండె సంబంధ వ్యాధులు దరిచేరవని, రక్తపోటు నియంత్రణకు సహాయపడుతుందని, ఏడాదికి రెండు, మూడు సార్లు రక్తదానం చేయడం వల్ల శరీరంలోని కొవ్వును తగ్గించుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే రక్తదానం చేసేవారు వైద్యుల సూచనలు, కొన్ని పరీక్షల తర్వాత చేయాల్సి ఉంటుంది.

రోగుల సేవలో ఎంజీఎం బ్లడ్ బ్యాంక్, రెడ్‌క్రాస్

వరంగల్ ఎంజీఎంలోని బ్లడ్ బ్యాంక్ అవసరమైనంత రక్తాన్ని రోగులకు సమకూర్చడం ద్వారా విశేషమైన సేవలందిస్తోంది. పూర్తిగా రక్తం కావాల్సినవారికి రక్తం, ప్లాస్మా, ప్లేట్‌లెట్స్, ఎర్రరక్త కణాలు మాత్రమే అవసరమైనవారికి రక్తం నుంచి వేరు చేసి అందజేస్తోంది. తలసేవియా, రక్తహీనత, క్యాన్సర్ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు రక్తాన్ని ఉచితంగా ఇస్తోంది. ఏటా 11వేల యూనిట్ల రక్తాన్ని రోగులకు సమకూరుస్తున్న ఈ బ్లడ్ బ్యాంక్ ఆ మేరకు అవసరమైన రక్తాన్ని సేకరించేందుకు ప్రతీ నెల నాలుగు రక్తదాన శిబిరాలను నిర్వహిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఉచితంగా, ప్రైవేటు ఆసుపత్రుల రోగులకు మాత్రం యూనిట్ రూ.1050 చొప్పున అందజేస్తోంది. ప్రతి రక్తదానం చేస్తే వారికి కావాల్సిన గ్రూప్ రక్తాన్ని రూ.800 ఇస్తోంది. అలాగే హనుమకొండ సుబేదారిలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్ఎస్) కూడా రక్త సేకరణ, సరఫరాలో ప్రముఖపాత్ర పోషిస్తోంది. తలసేమియా బాధితులకు ఉచితంగా రక్తాన్ని అందిస్తోంది. రక్తాన్ని నిల్వ చేయడానికి, రక్తం నుంచి ప్లాస్మా, ప్లేట్‌లెట్, ఎర్ర రక్తకణాలను వేరు చేయడానికి అధునాతనమైన పరికరాలు ఇందులో ఉన్నాయి. ఏటా రక్తదాన శిబిరాలను నిర్వహించడమే కాకుండా రక్తదాతలను ప్రొత్సహిస్తోంది.

131 సార్లు రక్తదానం చేసిన రాజేశ్వర్‌రావు



వరంగల్‌లోని మట్టెవాడకు చెందిన తోట రాజేశ్వర్ రావు ఆర్య ఇప్పటి వరకు 131 సార్లు రక్తదానం చేశారు. రక్తదానం గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. తన 20వ ఏట నుంచి మొదలు పెట్టి ప్రతీ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తున్నారు. ఇప్పటి వరకు 131 సార్లు రక్తదానం చేసి రికార్డు నెలకొల్పారు. అంతేకాదు రక్తదానంపై సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో ఆదుకుంటూ ఎన్నో పురస్కారాలు అందుకున్నారు.

ఆ సంఘటనే నన్ను రక్తదాతగా మార్చింది.. : భాస్కర్, రక్తదాత



వరంగల్ దేశాయిపేటకు చెందిన భాస్కర్ వృత్తి రీత్యా ప్రైవేటు ఉపాధ్యాయుడు. 2007లో తన సోదరుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో శస్త్రచికిత్సకు రక్తం అవసరమై రెండ్రోజుల పాటు అనేక మందిని సంప్రదించారు. కానీ రక్తం దొరక్కపోవడంతో చివరకు తాను రక్తం ఇవ్వడంతో ఆపరేషన్ జరిగి తన సోదరుడు కోలుకున్నాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 55 సార్లు రక్తదానం చేసిన భాస్కర్ ప్రతీ మనిషి రక్తదానం చేస్తే ఎందరో ప్రాణాలు నిలుస్తాయని, తన అన్న ఉదంతం తనను రక్తదాతగా మార్చిందని చెబుతున్నారు.



26 సార్లు రక్తదానం చేశా : మధు

పెరుమాండ్ల మధు వృత్తిరీత్యా జర్నలిస్టు. రక్తదానం సామాజిక బాధ్యతగా ఇప్పటి వరకు 26 సార్లు రక్తదానం చేశారు. మన ముచ్చట్లు అనే సంస్థ ద్వారా ఆయన పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆ సంస్థ ద్వారా పలుమార్లు రక్త దాన శిబిరాలు నిర్వహించారు. అందరూ రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.

చేయూతనిస్తే.. చేతికర్రతో ఏం పని?

- జీవిత చరమాంకంలో నిరాదరణకు గురవుతున్న వృద్ధులు
- సంక్షేమ శాఖ అధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు



నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 29 : నవమాసాలు మోసి, కని ఒక బతుకునిస్తారు. ఆ పిల్లల బతుకులు చల్లగా ఉండాలని మనసారా కోరుకుంటారు. వారిని ప్రయోజకులను చేయడంలోనే అలసిపోయినా జీవిత పయనంలో తామూ సేద దీరాలని ఆశిస్తారు. బిడ్డల ప్రేమ లభిస్తే చాలు. తమను కంటికి రెప్పలా చూసుకుంటే చాలు తమకంతకన్నా ఏం కావాలి భగవంతుడా.. అని కలలు కంటారు. కానీ ఆ కలలు ఛిద్రమైతే.. బాధ్యత మరిచి బిడ్డలు తమను భారంగా భావిస్తే.. ఎలాగైనా వదిలించుకోవాలని చూస్తే ఆ తల్లిదండ్రుల మనసులు ముక్కలవుతాయి. అలా ప్రస్తుత సమాజంలో ఎంతో మంది వృద్ధులు దేవుడిపైనే భారం వేసుకుంటూ దిక్కులేని వారిగా మౌనంగా రోదిస్తూ రోడ్డున పడుతున్నారు. తమ కనుపాపల ఆలనాపాలనాకు నోచుకోక.. ఉప్పెనలా వచ్చే కన్నీటి సునామీని దిగమింగుతూ.. బాధను బయటి వారికి చెప్పి తమ కన్నవారిని తక్కువచేయలేక చేయూతనిచ్చే వారు లేక.. చేతికర్రే ఆసరగా.. ఆశ్రమాలే ఆశ్రయంగా.. దుఃఖ దినాలను గడుపుతున్నారు. అలాంటి వారి నిస్సహాయస్థితిని ప్రపంచానికి చూపుతూ.. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పట్టించుకోని కన్నవారిని గుణపాఠాలు చెప్పేలా 'ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవాన్ని' జరుపుతున్నారు. వయోజనుల హక్కుల ఉల్లంఘన, వారిని మానసికంగా, శారీరకంగా వేధించే చర్యలు ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న క్రమంలో 2002లో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్(డబ్ల్యుహెచ్‌వో) ప్రపంచాన్ని ఈ అంశంపై మేల్కొలిపే చర్యలను చేపట్టింది. ప్రపంచంలోని వివిధ ప్రభుత్వ సంస్థలు, మేధావి, సామాజిక వర్గాలు వయో వృద్ధుల సమస్యలపై గళమెత్తాయి. ఈ క్రమంలోనే అక్టోబరు 1వ తేదీన ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

ముందస్తుగా వారోత్సవ కార్యక్రమాలు

జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 25 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు వారోత్సవ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నెల 25న ప్రారంభమైనా ఈ కార్యక్రమాల్లో వృద్ధుల హక్కులు, చట్టాలు, బిడ్డల పోషణ బాధ్యత తదితర అంశాలపై ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమాన్ని అధికారులు నిర్వహిస్తున్నారు.

చేయూత లేక.. ఆశ్రయం దొరక్క..

జీవితమంతా కడుపునపుట్టిన పిల్లల బాగోగులు, వారి ఉన్నతి కోసం శ్రమించిన తల్లిదండ్రులకు ప్రస్తుతం వృద్ధాప్యం ఓ భారంగా మారుతోంది. గుండెల్లపై ఆడుకున్న బిడ్డలే.. పెద్దయ్యాక గుండెలపై తన్నుతుంటే భరించలేక మరింత కుంగిపోతున్నారు. సూటిపోటి మాటలు.. వేధింపులు.. అగౌరవ పరిస్థితుల మధ్య జీవిత చరమాంకాన్ని నరకంగా భరించాల్సిన దుస్థితిలో ఉన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలంటూ పిల్లలు విదేశాలకు వెళుతుండటంతో ఎంతో మంది తల్లిదండ్రులు స్వగ్రామాల్లో ఒంటరి జీవితాలు గడుపుతున్నారు. ఏడాదికో.. రెండేళ్లకో.. పండుగలు పబ్బాలకు వచ్చినా.. ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లో చేతిలో పట్టుకుని సెల్‌ఫోన్లతోనే కాలక్షేపం చేస్తున్నారు తప్ప తల్లిదండ్రుల బాగోగుల గురించి పట్టించుకోని వారెందరో ఉన్నారు. ఇక కొందరైతే ఏళ్లతరబడి విదేశాల్లోనే ఉంటూ ఆన్‌లైన్ పలకరిస్తున్నారు. మరి కొందరు వృద్ధుల జీవితమైతే దారుణం. బిడ్డలు తరిమివేయడం, కోడళ్లు, కుటుంబ సభ్యులు ఈసడించుకోవడం లాంటి పరిణామాలతో తల్లడిల్లుతున్నారు. చిన్నతనంలో బిడ్డల కంట నీరొస్తే తట్టుకోలేకపోయిన ఆ తల్లిదండ్రులకు.. ఆ బిడ్డలే పెద్దాయ్యాక కన్నవారిని వృద్ధాశ్రమాల్లో నిస్సిగ్గుగా, నిర్దయగా చేర్చి చేతులు దులుపేసుకుంటున్నారు. ఇలా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను విస్మరించినా, వారికి ఆర్థిక బాధలు కలగజేసినా కఠిన చర్యలు ఎదుర్కోవాల్సిందే. తల్లిదండ్రులు తమ బిడ్డల నిరాధరణపై ఆర్‌డీవోకు విజ్ఞాపన చేస్తే చట్టరీత్యా విచారణ జరిపి ఆ తదుపరి చర్యలను ఎదుర్కోవాల్సిందే. బిడ్డలు ఉద్యోగులైతే వారి వేతనాల నుంచే కోత విధించే అవకాశాలున్నాయి.

చట్టరీత్యా చర్యలు ఎదుర్కోవాల్సిందే..

వృద్ధుల ఆలనాపాలనా విషయంలో బిడ్డలు ఏమాత్రం ఇబ్బందులు పెట్టినా చట్టరీత్యా తీసుకునే చర్యలను ఎదుర్కోవాల్సిందే. ముఖ్యంగా వారికి సరైన వైద్యం ఇప్పించడంలో నిర్లక్ష్యం చేయడం, దురుద్దేశపూర్వకంగా వారికి అధిక మోతాదులో మందుల ఇవ్వడం, ఆర్థికంగా, శారీరకంగా ఇబ్బందులు పెట్టడం, కనీస వసతుల కల్పనను విస్మరించడం లాంటి ఎన్నో అంశాలు వయోజన వేధింపుల పరిధిలోకి వస్తాయి. ఇలాంటి సమస్యలపై వృద్ధులు ఫిర్యాదు చేస్తే చట్టపరంగా శిక్ష తప్పదు. 1973 సెక్షన్ 125 ప్రకారం తమను తాము పోషించుకోలేని పరిస్థితిలో ఉన్న తల్లిదండ్రులకు వారి పోషణకయ్యే ఖర్చులను పిల్లలే భరించాలి. అలాగే సెక్షన్ 24ప్రకారం ఏదైనా దురుద్దేశంతో వృద్ధుల సంరక్షణ బాధ్యతలను వదిలేస్తే జైలు శిక్ష, జరిమానా కూడా ఉంటుంది.

ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నెంబరు 14567

పిల్లల నిరాదరణకు గురైన తల్లిదండ్రులు న్యాయపరంగా పోరాడేందుకు రెవెన్యూ డివిజనల్ అధికారి, జిల్లా సంక్షేమ అధికారిని సంప్రదించాల్సి ఉంటుంది. తమకు జరిగే అన్యాయంపై 14567 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా కూడా ఫిర్యాదు చేయొచ్చు. దాంతో ప్రత్యేక విభాగం అధికారులు విచారణ జరిపించి వృద్ధులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటారు.

గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజయ్య



రాజయ్య గౌడ్‌కు నియామక పత్రం అందజేసి సన్మానిస్తున్న గౌడ సంఘం నేతలు

మడికొండ, సెప్టెంబరు 30: తెలంగాణ గౌడ సంఘం హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా కాజీపేట మండలం కడిపికొండకు చెందిన నాగపూరి రాజయ్య గౌడ్‌ను నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్ తెలిపారు. ఈమేరకు సోమవారం హనుమకొండలో రాజయ్య గౌడ్‌కు నియామక పత్రం అందజేశారు. అనంతరం ఆయనను సంఘం నేతలు శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా రాజయ్య గౌడ్ మాట్లాడుతూ తనపై విశ్వాసంతో జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



మార్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, టెస్కాబ్ ఛైర్మన్ రవీందర్‌రావు, డైరక్టర్లు

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టెస్కాబ్ ఛైర్మన్ రవీందర్‌రావు

ఐనవోలు, సెప్టెంబరు 30: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావులు అన్నారు. నందనం రైతు సేవా సహకార సంఘం(సొసైటీ) ఆధ్వర్యంలో నందనంలో ఏర్పాటు చేసిన 'మార్ట్'ను సోమవారం ఎమ్మెల్యే నాగరాజు టెస్కాబ్ ఛైర్మన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చెప్పిన విధంగా రైతులకు రుణమాఫీ జరిగితీరుతుందన్నారు. అనంతరం సొసైటీ 52వ మహాజన సభను సొసైటీ వైస్ ఛైర్మన్ టి. చందర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా టెస్కాబ్ ఛైర్మన్ మాట్లాడుతూ రైతుల సహకారంతో నందనం సొసైటీ లాభాల బాటలో నడుస్తోందన్నారు. అనంతరం సొసైటీ పరిధిలోని 7గురు రైతులకు కర్షక మిత్ర లోన్ రూ.56లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్లు బొమ్మినేని బుచ్చిరెడ్డి, బీరు పద్మ, కలకోట్ల ఎలేంద్ర, మాదారపు సంపత్‌రావు, పూజారి రామచంద్రం, మోటే చిరంజీవి, రాజారపు కుమార్, సీఈవో సంపత్, డీసీసీ మేనేజర్ శ్రావణ్, నోడల్ అధికారి సునిల్‌కుమార్ రైతులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తున్న బీజేపీ

సీపీఎం జిల్లా కార్యదరి బోట్ల చక్రపాణి

ఐనవోలు, సెప్టెంబరు 30 : సామాజిక న్యాయానికి బీజేపీ తూట్లు పొడుస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి బోట్ల చక్రపాణి అన్నారు. గర్మిళ్లపల్లిలో సీపీఎం గ్రామ మహాసభను సోమవారం నిర్వహించారు. సీనియర్ నాయకుడు గబ్బెట బాబు హాల్లో నిర్వహించిన కార్యక్రమానికి దర్శనాల సంపత్ అధ్యక్షత వహించగా, మహాసభ సూచికగా చిదురాల రవి జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామ కమిటీ కార్యదర్శిగా గబ్బెట రాంకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. కార్యక్రమంలో మాదాసి యాకుబ్, నారాయణరెడ్డి, ఉప్పలయ్య, నాగరాజు, బి. యాకయ్య, నర్సయ్య, ప్రవీణ్, రవి, సుమలత పాల్గొన్నారు.

ప్రజావాణికి 158 దరఖాస్తులు

వినతులు స్వీకరించిన అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 30 : సమస్యల పరిష్కారానికి హనుమకొండ కలెక్టరేట్‌లో ప్రతీ వారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో 158 దరఖా స్తులు స్వీకరించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి తెలిపారు. సోమ వారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాల నుంచి ఫిర్యాదులు రాగా వారి నుంచి స్వీకరించి పరిష్కరించాలని సంబధిత అధికారులకు అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి ఆదే శాలు జారీ చేశారు. ప్రజావాణికి అత్యధికంగా కాజీపేట తహసీల్దార్ కార్యాల యానికి 25 దరఖాస్తులు రాగా, జీడబ్ల్యూఎంసీకి 19, హనుమకొండ ఆర్‌డీవో కార్యాలయానికి 12 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణిలో డీఆర్‌వో వై.వి గణేష్, హనుమకొండ, పరకాల ఆర్‌డీఓలు వెంకటేష్, నారాయణ, సీపీఓ సత్యనారా యణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలను సాధించాలి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 30 : మునిసిపల్ అధికారులు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి (సీడీఎంఏ) వీపీ గౌతం అన్నారు. సోమవారం హైదరాబాద్ సీడీఎంఏ కార్యాలయంల నుంచి జిల్లాల వారీగా మునిసిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. స్వచ్ఛతాహి సేవా, భువన్‌యాప్‌ల ద్వారా అసెస్‌మెంట్ల ద్వా రా నమోదు, ఎనిమల్ బర్త్ కంట్రోల్ నిర్వహణపై డీఎంసీ కంపోస్ట్ షెడ్‌ల సేకరణ, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, వనమహోత్సవం సందర్భంగా నాటిన మొక్కల పెంపకం తదితర అంశాలపై కమిషనర్‌లతో మాట్లాడారు.

వైద్యుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీకృష్ణారావు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 30 : తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా డాక్టర్ పి.నరహరి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ లాలుప్రసాద్, వరంగల్ జిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా డాక్టర్ శ్రీకృష్ణారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మిత్రమా రాజేందర్ పద్ధతి మార్చుకో..

సహనాన్ని పరీక్షించడం మంచిది కాదు

తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు

సమయం వచ్చినప్పుడు దమ్ము ధైర్యం చూపిస్తా

ప్రెస్ మీట్‌లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న వినయభాస్కర్

రాంనగర్, సెప్టెంబరు 30 : మిత్రమా రాజేందర్ పద్ధతి మార్చుకో, సహనాన్ని పరీక్షించడం మంచిది కాదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ భాస్కర్ హెచ్చరించారు. సోమవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వినయభాస్కర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిపై ధ్వజమెత్తారు. తన మూడు దశాబ్దాల రాజకీయ జీవితంలో ప్రశ్నించే ప్రతిపక్షాలపై గూండాలతో దాడులు చేయించడం తొలిసారన్నారు. చిల్లర గూండాలకు, తాటాకు చప్పుళ్ల భయపడేది లేదన్నారు. ఎమ్మెల్యేగా హుందాగా ప్రవర్తించడం నేర్చుకో, వెకిలి చేష్టలు మానుకో అని దుయ్యబట్టారు. తాను బీసీ వర్గాల అభివృద్ధిపై అధ్యయనం కోసం పార్టీ పక్షాన చెన్నై వెళితే మద్రాసు బాబు అని వ్యంగ్యంగా మాట్లాడడం ఎంతవరకు సమంజసమన్నారు. తాను బీసీ వర్గాల కోసం చెన్నై వెళితే దోచుకున్నది దాచుకునేందుకు అమెరికా, ఆస్ట్రేలియా వెళ్లావని ఆరోపించారు. దమ్ము, ధైర్యం అని తనను ఉద్దేశించి మాట్లాడుతున్నావ్, సమయం వచ్చినప్పుడు తన దమ్ము ధైర్యం చూపిస్తానని వినయభాస్కర్ హెచ్చరించారు. నాలాలపై నిర్మించిన అక్రమ కట్టడాలు తాము కూల్చితే ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి నాలా నిర్మాణాలు అష్ట వంకరలు తిప్పి అందినకాడికి దండుకున్నాడని ఆయన విమర్శించారు. పెద్దమ్మగడ్డ బరేల్ గ్రౌండ్ ప్రహరీ కూల్చిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి 48 గంటల్లో కాంపౌండ్ వాల్ నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. తమ హయాంలో నిధులు తీసుకువచ్చి చేసిన అభివృద్ధి పనులకు కొబ్బరికాయలు కొడుతూ గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. చిల్లర రాజకీయాలు మానుకుని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ సూచించారు. విలేకర్ల సమావేశంలో నేతలు మర్రి యాదవరెడ్డి, సంగంరెడ్డి సుందర్‌రాజ్, పులి రజనీకాంత్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ బాధ్యత అందరిది

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 30: బాలల సంరక్షణ బాధ్యత అందరిదని వరంగల్ సైబర్ క్రైమ్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ కే. విజయ్ కుమార్ అన్నారు. ఎఫ్ఎంఎం సాంఘీక సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ అధ్యక్షతన వరంగల్, హనుమకొండ జిల్లాల బాలల సంరక్షణ విభాగం, వివిధ శాఖలు, ఎన్‌జీఓలతో బాలల సంరక్షణ కొరకు చేపట్టాల్సిన అవగాహన కార్యక్రమాలు, బాలల స్నేహపూర్వక సేవలను వినియోగించడంలో అనుసరించాల్సిన విధానాలపై సోమవారం సుబేదారిలోని అనుంత భవన్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం, ఎన్‌జీఓ సంస్థలు కలిసి పనిచేయడం వల్ల వరంగల్ జిల్లాను బాలల స్నేహ పూరిత జిల్లాగా మార్చవచ్చన్నారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ సమితి ఛైర్మన్ అన్నమనేని అనిల్ చందర్‌రావు, వరంగల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ కే. వసుధ, మహబూబాబాద్ జిల్లా బాలల సంరక్షణ సమితి ఛైర్మన్ డాక్టర్ నాగవాణి, డాన్ బాస్కో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. సంతోష్ కుమార్, ఎఫ్ఎంఎం సాంఘీక సేవా సంస్థ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్లు బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్, మాజీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ ఎం. పరశురాములు, జిల్లా బాలల సంరక్షణ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధికారులు ఎస్ ప్రవీణ్ కుమార్, డి. రాజు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

మేయర్ గుండు సుధారాణి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 30 : గ్రేటర్ వరంగల్ పరిధిలో జరిగే సద్దుల బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలు భక్తి శ్రద్ధలతో ప్రతీ యేడు బతుకమ్మ పండగ జరుపుకుంటారని, వారి సౌకర్యాలకు తగినట్టు ఏర్పాట్లు చేయాలన్నారు. బల్దియా ప్రాంతంలో బతుకమ్మ జరుపుకునే అన్ని చెరువులు, కుంటలతో పాటు బతుకమ్మ ఆట స్థలాలను చదును చేయాలన్నారు. మహిళలు ఆడుకునే బతుకమ్మ ప్రదేశాల్లో గుంతలు పూడ్చి డస్టింగ్, లైటింగ్, మంచినీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. చెరువుల్లో గుర్రపు డెక్కను తొలగించే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బల్దియా పరిధిలోని చిన్నవడ్డెపల్లి చెరువు, ఉర్సుగుట్ట, రంగలీల మైదానం, తోట మైదానం, శివనగర్ గ్రౌండ్, రంగశాయిపేట, ఖిలావరంగ్, బెస్తం చెరువు, మామునూరు పెద్దచెరువు, బంధం చెరువు, భద్రకాళి దేవాలయం, వేయిస్తంభాల గుడి, మెట్టుగుట్ట, పద్మాక్షి టెంపుల్, మడికొండ చెరువులో ఈ నెల 4 వరకు గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఎస్ఈలు ప్రవీన్‌చంద్ర, రాజయ్య, డీసీలు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, శానిటేషన్, ఎలక్ట్రికల్ సిబ్బంది పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబురాలు

హసన్‌పర్తి, సెప్టెంబరు 30: మండలంలోని పెంబర్తి శివారులోని ఏకశిల హైస్కూల్‌లో సోమవారం ముందస్తు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. విద్యాలయ ప్రాంగణంలో విద్యార్థినులు, ఉపాధ్యాయినులు నిర్వహించిన బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. విద్యార్థులు రకరకాల పూలతో బతుకమ్మలను అలంకరించి ఆటపాటలతో సంబురంగా వేడుకలను నిర్వహించారు. ఏకశిల విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మారెడ్డి, షీటీం సీఐ సుజాత, అనురాగ్ హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ ఛైర్మన్, కేయూ పాలక మండలి సభ్యురాలు కె.అనితారెడ్డి, ఏకశిల విద్యా సంస్థల డైరెక్టర్ గౌరు సువిజారెడ్డిలు హాజరయ్యారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో విద్యార్థులతో కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్లు గౌరు సువిజారెడ్డి, ఎం.జితెందర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కె.స్వర్ణరాజు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఐనవోలు : పున్నేలు శివారు ఏకశిల ఈ టెక్నో పాఠశాలలో సోమవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగు రంగుల దుస్తులు ధరించి తీరొక్కపూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ ఆటపాటలతో సందడి చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏకశిల విద్యాసంస్థల ఛైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులు ఆడుకునే బతుకమ్మ పండుగ విశ్వవ్యాప్తమైందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహ్మద్ బాబా, వైస్ ప్రిన్సిపాల్ కునూరు రవికిరణ్, స్టాఫ్ ఇన్‌చార్జిలు, ఎలబ్రేషన్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సందడిగా జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ట్రాస్క్‌ఫోర్స్ సీఐ సార్ల రాజు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 30 : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్‌లోని సింథటిక్ ట్రాక్‌పై వరంగల్, హనుమకొండ జిల్లాల స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు సందడిగా ప్రారంభమైయ్యాయి. సోమవారం హనుమకొండ జేఎన్ఎస్‌లో ఏర్పాటు చేసిన వరంగల్, హనుమకొండ జిల్లా స్థాయి అండర్ 14, 16,18,20 బాల బాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను టాస్క్‌ఫోర్స్ సీఐ సార్ల రాజు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ... హనుమకొండ, వరంగల్ జిల్లాల స్థాయిలో అండర్ 14, 16, 18, 20 బాల బాలిక విభాగంలో నిర్వహించిన పోటీల్లో రెండు జిల్లా నుంచి 400 మంది క్రీడాకారులు పాల్గొనడం జరిగిందన్నారు. అండర్ 14 ఏబీసీ ట్రైయాత్లిన్ అండర్ 16 విభాగంలో 60, 600 పరుగు పందెం, లాంగ్ జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, అండర్ 18 విభాగం 100, 200, 400, 1000, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో అండర్ 20 బాల బాలికల విభాగంలో 100, 200, 400, 800, 1500, 3000, లాంగ్ జంప్, డిస్కస్‌త్రో, షాట్‌పుట్, హ్యామర్‌త్రో, జావెలిన్‌త్రో విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను అక్టోబరు 7, 8 తేదీల్లో జేఎన్ఎస్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మూగల కుమార్‌యాదవ్, యుగేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ మహేందర్, కోశాధికారి కృష్ణ, జనగామ జిల్లా కార్యదర్శి, పీడీ గంగిశెట్టి మనోజ్, కోచ్‌లు శ్రీమన్నారయణ, దిమ్మిక నాగరాజు పాల్గొన్నారు.

దేశం వివిధ సంస్కృతుల సమ్మేళనం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, సెప్టెంబరు 30: భారత దేశం వివిధ సంస్కృతుల సమ్మేళనమని అన్ని మతాలను గౌరవించే గొప్ప సంప్రదాయం మనదని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ వడ్డెపల్లి చర్చి జంక్షన్‌లోని ఇండియా పెంతకోస్ట్ చర్చి సౌజన్యంతో నూతన చర్చి నిర్మాణ పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ప్రత్యేక ప్రార్థన ఆరాధనలు పాస్టర్లతో కలిసి సామూహికంగా నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్ భాస్కర్, స్థానిక కార్పొరేటర్ ఇమ్మడి లోహిత రాజు, కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఛైర్మన్ పెరుమాండ్ల రామకృష్ణ, 58, 60 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాళ్లపెల్లి సుధాకర్, పున్నంచందర్ పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాయిని

బాలసముద్రం, సెప్టెంబర్ 30: బాలసముద్రంలోని ఏకశిలాపార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న నిర్వహించే పెత్రమాస బతుకమ్మ వేడుకలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఏకశిలా పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వంగ రాజిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు చాడా దశరథరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి పడాల సోమయ్య, కోశాధికారి సుంచికాల రవీందర్‌రావు, ఉపాధ్యక్షులు బొద్దిరెడ్డి రాజిరెడ్డి, వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ పచ్చిమట్ల ఎల్లగౌడ్, వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చిట్‌ఫండ్ కార్యాలయం ఎదుట బాధితుల ఆందోళన

బాలసముద్రం, సెప్టెంబరు 30: హనుమకొండ బాలసముద్రంలోని ఓ ప్రైవేట్ చిట్‌ఫండ్ కార్యాలయం ఎదుట బాధితులు సోమవారం ఆందోళన చేశారు. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం.. బాలసముద్రంలోని అక్షర చిట్‌ఫండ్ యాజమాన్యం డబ్బులు ఇవ్వకుండా బాధితులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సోమవారం చిట్‌ఫండ్ కార్యాలయం ఎదుట బాధితులు బైఠాయించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిట్‌ఫండ్ కార్యాలయం వద్దకు సుమారు 300 మందికిపైగా బాధితులు చేరుకుని ఆందోళన నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా బాధితులు ఇక్కడకు రావడంతో కార్యాలయం వద్ద కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో సంస్థకు చెందిన ఓ వ్యక్తి అక్కడకు వచ్చిన బాధితులతో మాట్లాడి 2 లక్షల వరకు ఉన్న చిట్ ఫండ్ బాధితులకు వచ్చే నెల 30వ తేదీ వరకు డబ్బులు చెల్లిస్తానని, రెండు లక్షలకు పైగా ఉన్న వారికి 30శాతం డబ్బులు చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో కొంత మంది బాధితులు డబ్బుల చెల్లింపులో ఆలస్యంపై ఆ వ్యక్తిపై దాడి చేసేందుకు యత్నించారు. దీంతో అక్కడ ఉన్న చిట్‌ఫండ్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించగా సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి అక్కడినికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. ఎలాంటి గొడవలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్రీడలతోనే ఆరోగ్యవంతమైన జీవితం

హసన్‌పర్తి, సెప్టెంబరు 30: క్రీడలతోనే ఆరోగ్యవంతమైన జీవితమని జిల్లా యువజన క్రీడాశాకాధికారి జి.అశోక్ అన్నారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాసురోడ్డు కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఇంటర్ కాలేజీయేట్ టోర్నమెంట్ మెన్ (ఫేజ్-1) పేరుతో పురుషుల టోర్నమెంట్ పోటీలు సోమవారం కిట్స్ ఇండోర్ స్టేడియంలో ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా యువజన క్రీడాశాఖాధికారి జి.అశోక్ హాజరై వివిధ విభాగాలలో ఆరు ఆటల పోటీలలో విజేతలైన క్రీడాకారులకు ట్రోఫీలను అందజేశారు. ఉత్తర తెలంగాణలోని అదిలాబాద్, ఖమ్మం, వరంగల్ వంటి ఉమ్మడి జిల్లాల నుంచి 34 కళాశాలల నుంచి 800 మంది క్రీడాకారులు ఈ ఆటల పోటీలలో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కిట్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పింగిళి రమేష్‌రెడ్డి, కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏటీబీటీ. ప్రసాద్, కిట్స్ ఫిజికల్ డైరెక్టర్

మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 30: జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు సంబంధిత శాఖల అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు సోమవారం మత్తు పదార్థాల నియంత్రణపై వివిధ శాఖల అధికారులతో రెవెన్యూ అధికారి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీస్, రెవెన్యూ, వైద్య, ఆరోగ్య, విద్య, ఎక్సైజ్, నార్కోటిక్స్, రైల్వే, జీఆర్‌పీ శాఖల అధికారులు గత నెల రోజులుగా మత్తుపదార్థాల నియంత్రణకు తీసుకున్న చర్యలు, తీసుకోబోతున్న చర్యలపై వివరించారు. సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ ఎస్‌కే సలీమా, డీఎంహెచ్‌వో డాక్టర్ లలితా దేవి తోపాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జ్వర సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 30 : ఇంటింటి జ్వర సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. 52వ డివిజన్‌లోని రాంనగర్ బంజారా కాలనీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వాటిబారిన పడకుండా చూడటమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఉన్న 8 అర్బన్ హెల్త్‌సెంటర్‌లల్లో 178 వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పదవీ విరమణ పొందిన వెంకటేశ్వర్లుకు సన్మానం

బాలసముద్రం, సెప్టెంబరు 30 : హనుమకొండ బాలసముద్రంలోని ఎల్ఐసీ కార్యాలయంలో గత 35 సంవత్సరాలుగా హయ్యర్ గ్రేడ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించిన కురిమిల్ల వెంకటేశ్వర్లు సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా బాలసముద్రంలోని ఎల్ఐసి సబ్ జోనల్ కార్యాలయంలో వెంకటేశ్వర్లు దంపతులకు ఎల్ఐసి కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీఎం సుబ్రమణ్యం, ఎం ఎం బస్వరాజ్ ప్రసాద్, వోఎస్ మేనేజర్ శ్రీనివాస్, మేనేజర్ రమాదేవి, జీబీఎల్ మేనేజర్ హైమావతి, కార్యాలయ సిబ్బంది ఏవో హైమావతి, పి.ఉమాదేవి, వి.కళ్యాణి, కవితరవిరాజ్, డి.రాం చందర్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వర్లుకు సన్మానం చేస్తున్న ఎల్ఐసీ కార్యాలయ సిబ్బంది

తిరుమల లడ్డూ కల్తీపై నిరసన

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 30 : తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి లడ్డు అపవిత్రతపై విశ్వహిందు పరిషత్ అఖిల భారత కమిటీ పిలుపు మేరకు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భజరంగ్ దళ్ తెలంగాణ ప్రాంత ప్రయోజక్ శివరాములు మాట్లాడుతూ... వేంకటేశ్వరస్వామి దర్శనం అంటేనే భక్తులకు గొప్ప మధురానుభూతి అన్నారు. అనంతరం 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి మాట్లా ్డతూ తిరుమలలో లడ్డు తయారీలో జంతువుల కొవ్వుతో కూడిన నెయ్యిని వినియోగించడం అన్న నివేదిక బయటపడటం హిందూ సమాజం ఒక్కసారిగా ఉలిక్కి పడిందన్నారు. లడ్డులో నాసిరకం పదార్థాలతోపాటు చేపల కొవ్వుతో కూడిన వాటిని వాడటం మానేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వసంత మహేందర్‌రెడ్డి, వెలగందుల రాజు, ఆదిత్య, ఆదిత్య సాయి,. ఓం కుమార్, ఉదయ్ శ్రీరాం, సునంద్, పాల్గొన్నారు.

కల్తీ నివారణకు కఠిన చర్యలు చేపట్టాలి

కాజీపేట జంక్షన్, సెప్టెంబరు 30 : ఆహార పదార్థాలలో కల్తీని నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని ఆల్ ఇండియా కన్స్యూమర్ కౌన్సిల్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. సోమవారం హనుమకొండ రాంనగర్‌లోని జిల్లా వినియోగదారుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినియోగదారుల సదస్సులో ఆయన మాట్లాడారు. భారత ప్రభుత్వం విడుదల చేసిన నివేదిక ప్రకారంగా ఆహార భద్రత ప్రమాణాల పర్యవేక్షణలో తెలంగాణ దేశంలోని 29 రాష్ట్రాలలో 23వ స్థానంలో ఉండడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆహార పదార్థాల ప్రమాణాల విషయంలో చర్యలు చేపట్టాలని, జిల్లా స్థాయి సలహా కమిటీ ఏర్పాటు చేయాలని, ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించి కల్తీ చేసిన వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వైన్స్ వద్ద ఘర్షణ.. కేసు నమోదు

హసన్‌పర్తి, సెప్టెంబరు 30: మండల కేంద్రంలోని గణేష్ వైన్స్ వద్ద ఆదివారం మద్యం ప్రియులకు, క్యాంటిన్ నిర్వాహకులకు మధ్య జరిగిన ఘర్షణ పోలీసు స్టేషన్‌కు చేరుకుంది. ఇన్‌స్పెక్టర్ చేరాలు కథనం ప్రకారం... హసన్‌పర్తికి చెందిన మేకల రాజేందర్, అతడి మిత్రుడు మేకల వినయ్ ఆదివారం గణేష్ వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసి మద్యం షాపు ముందు నిలబడ్డారు. ఈ క్రమంలోనే అక్కడే పర్మిట్ రూం వద్ద క్యాంటిన్ నిర్వహిస్తున్న మీసరగొండ సత్యనారాయణ, అతని సోదరులు కుమారస్వామి, వీరులు వీరితో గొడవపడ్డారు. పర్మిట్ రూం వద్ద మూత్ర విసర్జన చేశారంటూ రాజేందర్, వినయ్‌లను నానా బూతులు తిడుతూ వారిపై దాడి చేసి చేశారు. ఈ ఘటనలో వినయ్ తలకు బలమైన గాయాలవడంతో ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్యాంటిన్ నిర్వాహకుడు సత్యనారాయణతో పాటు అతని ఇద్దరు సోదరులపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట విద్యార్థి సంఘాల నాయకుల ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 30 : పెండింగ్‌లో ఉన్న విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకుల ఆధ్వ ర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో టీఎస్ఎఫ్, డీఎంఎస్పఏ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.




చక్కెరకు ప్రత్యామ్నాయంగా..

చక్కెరతో బరువు పెరుగుతామనే విషయం అందరికీ తెలిసిందే! అయితే బరువు పెంచే చక్కెరకు కొన్ని సురక్షితమైన ప్రత్యామ్నాయాలున్నాయి. వాటి గురించి తెలుసుకుందాం!

- **స్టీవియా:** స్టీవియా మొక్కతో తయారయ్యే ఈ సహజసిద్ధ తీపిపదార్థం చక్కెరను మించి తీయగా ఉంటుంది. అయినా దీన్లో క్యాలరీలు ఉండవు. కాబట్టి రక్తంలో చక్కెర మోతాదులను అదుపులో ఉంచుకునేవారు, మరీ ముఖ్యంగా మధుమేహులు స్టీవియాను ఎంచుకుంటూ ఉంటారు. ఆహారంలో చక్కెరను పూర్తిగా మానేయాలనుకునేవారు కూడా తీపి తినాలని అనిపించినప్పుడు స్టీవియాతో తయారుచేసుకున్న స్వీట్లను ఎంచుకోవచ్చు.
- **మాంక్ ఫ్రూట్:** మాంక్ ఫ్రూట్ ఎక్స్‌ట్రాక్ట్ చక్కెరతో సమానంగా తీయగా ఉంటుంది. ఎలాంటి క్యాలరీలు, గ్లైసెమిక్ ఇండెక్స్‌లూ లేని మాంక్ ఫ్రూట్ గుజ్జు బేకింగ్‌లకూ, కాఫీల్లో కలుపుకోడానికీ బాగుంటుంది. ఈ ప్రాచీన పండును సంప్రదాయ ఔషధ తయారీల్లో కూడా ఉపయోగిస్తూ ఉంటారు.
- **ఎరిథ్రిటాల్:** పండ్లు, పులియబెట్టిన పదార్థాల్లో దొరికే ఈ షుగర్ ఆల్కహాల్‌లో 70 శాతం చక్కెర తీయదనం ఉంటుంది. అయినా దీన్లో ఏమాత్రం క్యాలరీలు ఉండవు. ఇది రక్తంలోని చక్కెర మోతాదును ఏమాత్రం పెంచదు. కాబట్టే తక్కువ కార్బ్స్‌తో కూడిన కీటోజెనిక్ డైట్‌ను అనుసరించేవాళ్లు తీయదనం కోసం దీన్నే ఎంచుకుంటూ ఉంటారు.
- **అల్యులోజ్:** రుచిలో చక్కెరకు ఏమాత్రం తీసిపోని అల్యులోజ్ కేవలం 10% క్యాలరీలనే కలిగి ఉంటుంది. ఇది నాన్ గ్లైసెమిక్ కూడా! అంటే దీన్ని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర మోతాదులు ఏమాత్రం పెరగవు. కాబట్టి డిజర్ట్ మొదలు డ్రెస్సింగ్‌ల వరకూ ఈ గిల్ట్ ఫ్రీ తీపిని ఎంచుకోవచ్చు.
- **యాకాన్ సిరప్:** యాకాన్ మొక్క నుంచి సేకరించే సిరప్ క్యారమెల్ రుచిని కలిగి ఉంటుంది. ప్రిబయోటిక్స్ సమృద్ధిగా కలిగి ఉండే ఈ సిరప్ తీయదనాన్ని కలిగి ఉండడంతో పాటు పేగుల ఆరోగ్యానికి కూడా తోడ్పడుతుంది. రోజంతా శక్తి మోతాదులు సమంగా కొనసాగడానికి తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉండే ఈ సిరప్, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉండే ఈ సిరప్‌ను ఎంచుకోవచ్చు.


ఆంధ్రజ్యోతి
9
నవ్య డాక్టర్
మంగళవారం • 1 అక్టోబరు 2024



విదేశాలతో పోలిస్తే, మన దేశంలో ప్రోస్టేట్ కేన్సర్ ఉధృతి తక్కువ. అయినప్పటికీ మొదటి స్థానంలో ఉన్న లంగ్ కేన్సర్ స్థానాన్ని అధిగమించే స్థాయికి ఈ కేన్సర్ కేసులు పెరిగిపోడానికి కారణం అప్రమత్తత లోపమే అంటున్నారు వైద్యులు. అందుబాటులో ఉన్న అత్యాధునిక వ్యాధి నిర్ధారణ పరీక్షలతో ప్రోస్టేట్ కేన్సర్‌కు ఎలా అడ్డుకట్ట వేయవచ్చో వివరిస్తున్నారు.

పని పడదాం!

> "కుటుంబ చరిత్రలో పెద్దపేగు, ప్రోస్టేట్ కేన్సర్ ఉంటే, నడి వయసులో ఈ కేన్సర్ సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి 45 ఏళ్లకే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి.



మన దేశంలో పురుషుల్లో తలెత్తే రెండవ అత్యంత సాధారణ కేన్సర్ ఇది. మొదటిది... లంగ్ కేన్సర్. ధూమపానంతో లంగ్ కేన్సర్ సోకుతుందనే అవగాహన పెరగడంతో ఈ కేన్సర్ కేసులు తగ్గుముఖం పట్టాయి. కానీ రెండో స్థానానికి పరిమితమైన ప్రోస్టేట్ కేన్సర్ ఉధృతి ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోయింది. ఇందుకు కారణం ఈ కేన్సర్ పట్ల అవగాహన లేకపోవడమే! వయసుతో పాటు పెరిగే ఈ ప్రోస్టేట్ గ్రంథి మూత్రాశయం దిగువన నెలకొని ఉంటుంది. దీన్లోని కణాల్లో తలెత్తే అసహజ మార్పులు, కణ విచ్ఛిత్తి మూలంగా ప్రోస్టేట్‌లో కణితి ఏర్పడుతుంది. ఇలా గ్రంథికే పరిమితమైన కేన్సర్‌ను నయం చేయడం తేలిక. ఒకవేళ కేన్సర్ గ్రంథిని దాటి బయటకు విస్తరిస్తే, దాన్ని తీవ్రమైన కేన్సర్‌గా పరిగణించి తదనుగుణంగా చికిత్స చేయవలసి ఉంటుంది. కాబట్టి సులువైన చికిత్సతో ప్రోస్టేట్ కేన్సర్ నుంచి శాశ్వత విముక్తి పొందాలంటే, దాన్ని తొలినాళ్లలోనే కనిపెట్టడం అవసరం.

కారణాలు కోకొల్లలు

ప్రోస్టేట్ కేన్సర్ సోకడానికి ఎన్నో కారణాలున్నాయి. ప్రధానంగా 65 ఏళ్లు పైబడిన వృద్ధుల్లో ఈ కేన్సర్ కనిపిస్తూ ఉంటుంది. అలాగే పెద్ద వయసుతో సంబంధం లేకుండా 40 నుంచి 45 ఏళ్లకే కేన్సర్ సోకే అవకాశాలూ లేకపోలేదు. అందుకు కారణాలున్నాయి.



జన్యుపరమైన కారణాలు: కుటుంబ చరిత్రలో పెద్దపేగు, ప్రోస్టేట్ కేన్సర్ ఉంటే, నడి వయసులో ఈ కేన్సర్ సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి 45 ఏళ్లకే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి.

మెటబాలిక్ సిండ్రోమ్: ఒబేసిటీ, అదుపు తప్పిన మధుమేహం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ కూడా ప్రోస్టేట్ కేన్సర్ సోకే అవకాశాలను పెంచుతాయి.

హెచ్చరికలను కనిపెట్టాలి

ప్రోస్టేట్ కేన్సర్ కొన్ని లక్షణాల రూపంలో బయల్పడుతూ ఉంటుంది. మూత్రాశయం దిగువన ఉంటుంది కాబట్టి కేన్సర్‌తో దీని పరిమాణం పెరగగానే మూత్రవిసర్జనలో ఇబ్బంది తలెత్తుతుంది. విసర్జన కష్టంగా మారడం, తరచూ మూత్రవిసర్జన అవసరం పడుతూ ఉండడం, అత్యవసరంగా మూత్రవిసర్జన చేయవలసి వస్తూ ఉండడం, మూత్రం పూర్తిగా బయటకు వెళ్లిపోకుండా, లోపలే మిగిలిపోతూ ఉండడం, మూత్రంలో రక్తం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే పెద్ద వయసులో ప్రోస్టేట్ గ్రంథి పరిమాణం పెరగడం సహజం. కాబట్టి ఈ లక్షణాలు కనిపించినంత వాళ్లందర్లో కేన్సర్ ఉంటుందని భావించడానికి వీల్లేదు. అయినప్పటికీ వయసుతో సంబంధం లేకుండా ఈ లక్షణాలు కనిపించిన ప్రతి ఒక్కరూ ప్రోస్టేట్ పరీక్షలు చేయించుకోవాలి. మరీ ముఖ్యంగా కుటుంబ చరిత్రలో ఈ కేన్సర్ ముప్పు ఉన్నవాళ్లు 40 ఏళ్ల నుంచీ ప్రతి ఏటా ప్రోస్టేట్‌ను పరీక్షించుకుంటూ ఉండాలి.

భిన్నమైన దశల్లో...

ప్రోస్టేట్ కేన్సర్ ఎన్నో దశల్లో బయల్పడుతూ ఉంటుంది. తొలి దశలోనే బయల్పడినప్పుడు, రోబోటిక్ సర్జరీ ద్వారా ప్రోస్టేట్‌ను సమూలంగా తొలగించగలిగితే కేన్సర్ నుంచి పూర్తిగా బయటపడవచ్చు. ముదిరిన తర్వాత ప్రోస్టేట్‌ను తొలగించినా ప్రయోజనం ఉండదు కాబట్టి దాన్ని అలాగే వదిలేసి హార్మోన్ థెరపీ, కీమో, రేడియేషన్‌లను ఆశ్రయించవలసి ఉంటుంది. కేన్సర్ కణాలు టెస్టోస్టెరాన్ పురుష హార్మోన్ ను ఆహారంగా తీసుకుంటూ వృద్ధి చెందుతూ ఉంటాయి. కాబట్టి శరీరంలో ఈ హార్మోన్ మోతాదును తగ్గిస్తూ, అదనపు హార్మోన్లను అందిస్తూ చికిత్సను కొనసాగించాల్సి ఉంటుంది. పూర్వం ప్రోస్టేట్ కేన్సర్ సోకిన వాళ్లందరికీ ఒకే రకమైన చికిత్సా విధానాన్ని అనుసరించే పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు వ్యాధి తీవ్రత ఆధారంగా వైద్యులు చికిత్సను ఎంచుకుంటున్నారు. బాడీ బిల్డింగ్ చేసేవాళ్లు, టెస్టోస్టెరాన్ హార్మోన్‌ను అదనంగా తీసుకుంటూ ఉంటారు. అయితే ఇలా అదనంగా తీసుకోవడం వల్ల ప్రోస్టేట్ కేన్సర్ సోకే అవకాశాలు ఉన్నాయని ఇప్పటివరకూ నిరూపణ కానప్పటికీ, ఈ ముప్పు పొంచి ఉన్న వాళ్లు, అప్పటికే ప్రోస్టేట్ కేన్సర్ సోకి ఉన్న వాళ్లు అదనంగా ఈ హార్మోన్‌ను తీసుకోవడం వల్ల కేన్సర్ ఉధృతి పెరిగిపోతుంది. కాబట్టి ఈ హార్మోన్‌ను తీసుకోవాలనుకున్న వాళ్లు ముందుగా వైద్యుల సలహా తీసుకోవడం తప్పనిసరి.

నియంత్రణ ఇలా...



ప్రోస్టేట్ కేన్సర్ రాకుండా నియంత్రించడం కష్టం. కానీ దాన్ని ముందుగానే కనిపెట్టడం మన చేతుల్లోనే ఉంటుంది. కాబట్టి ముప్పు ఉన్నప్పటికీ, లేనప్పటికీ ముందస్తుగా అప్రమత్తంగా వ్యవహరించడం అవసరం. అలాగే వీలైనంత మేరకు ఆరోగ్యకరమైన అలవాట్లతో కేన్సర్ సోకే అవకాశాలను తగ్గించుకోవచ్చు. అవేంటంటే...

- ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్లు పుష్కలంగే ఆహారం తీసుకోవాలి
- యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా దొరికే ఆహారం తినాలి. యాంటీఆక్సిడెంట్లు ఫ్లేవనాయిడ్స్‌లో ఎక్కువగా ఉంటాయి. ఈ యాంటీఆక్సిడెంట్లకు కేన్సర్‌ను నిలువరించే గుణాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి, ఇవ ఎక్కువగా ఉండే, సహజసిద్ధ ముదురు రంగులను కలిగిన టమేటా, క్యారట్, బీట్‌రూట్, బ్లూబెర్రీ లాంటివి తింటూ ఉండాలి.
- శరీర బరువును నియంత్రణలో పెట్టుకోవాలి. ఒత్తిడి తగ్గించుకోవాలి.
- మధుమేహం, రక్తపోటు, కొలెస్ట్రాల్‌లను నియంత్రణలో పెట్టుకోవాలి.
- క్రమం తప్పక వ్యాయామం చేయాలి.
- కుటుంబ చరిత్రలో కేన్సర్ ఉంటే, 45 ఏళ్ల వయసు నుంచి, ఇతరులు 50 ఏళ్ల నుంచీ ప్రోస్టేట్ స్క్రీనింగ్ చేయించుకోవాలి.



సమర్థమైన ఆధునిక పరీక్షలు

- **పిఎస్ఎ పరీక్ష:** ప్రోస్టేట్ స్పెసిఫిక్ యాంటిజెన్ టెస్టింగ్. ఇది రక్త పరీక్ష. కేన్సర్ ప్రోస్టేట్‌లోనే పెరగాలనే నియమం లేదు. మూత్ర ఇన్‌ఫెక్షన్లు, ఇతరత్రా ఇన్‌ఫెక్షన్లు కూడా కేన్సర్‌కు దారి తీయవచ్చు. కాబట్టి 50 ఏళ్లు దాటిన పురుషులందరూ ఈ పరీక్ష చేయించుకోవడం తప్పనిసరి. ఈ పరీక్షలో కేన్సర్ సోకినట్టు అనుమానం ఉంటే, ఎమ్మారై, ప్రోస్టేట్ బయాప్సీలతో కేన్సర్‌ను నిర్థారించుకోవచ్చు.
- **జీనోమిక్ ప్రొఫైల్:** ఫస్ట్ డిగ్రీ రిలేటివ్స్ (తండ్రి, సోదరులు)కు ప్రోస్టేట్ కేన్సర్ ఉండి ఉంటే, జీనోమిక్ ప్రొఫైల్ చేయించుకుని కేన్సర్ సోకే అవకాశాలను ముందుగానే పసిగట్టవచ్చు. కాబట్టి ఈ కోవకు చెందిన వాళ్లు 40 నుంచి 45 ఏళ్ల వయసులో ఈ పరీక్ష చేయించుకోవాలి.

డాక్టర్ రాజేష్ కుమార్ రెడ్డి అడపాల
కన్సల్టెంట్ యూరో ఆంకాలజిస్ట్,
ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూరో ఆంకాలజీ అండ్ రోబోటిక్,
ఎఐఎన్‌యు,
బంజారాహిల్స్,
హైదరాబాద్.



ఫిట్‌నెస్

కుర్చీలో వ్యాయామం

ఎక్కువ సమయాల పాటు కంప్యూటర్లకు అతుక్కుని పని చేసే ఉద్యోగాలు మనవి. అలాంటప్పుడు శరీరంలో కొవ్వు పేరుకుపోవడం సహజం. జిమ్‌కు వెళ్లే సమయం కూడా దొరకని పరిస్థితి. ఇలాంటి వాళ్లు కుర్చీలో కూర్చుని చేసుకునే వ్యాయామాలు కూడా ఉన్నాయి. అవే ఇవి!

- **సిట్టింగ్ క్రంచెస్:** కుర్చీ అంచు మీద నిటారుగా కూర్చుని, చేతులను మడిచి తల వెనక ఉంచుకోవాలి. తర్వాత ఛాతీ మోకాళ్లకు తగిలేలా వంగాలి. ఇలా వంగేటప్పుడు శ్వాస వదులుతూ పైకి లేచేటప్పుడు శ్వాస పీల్చుకోవాలి. ఇలా 15 సార్లు, 3 సెట్లు చేయాలి.



- **బటర్‌ఫ్లై పోజ్:** బద్ధకోణాసనంతో కూడా పొట్ట కొవ్వును కరిగించవచ్చు. ఈ ప్రయోజనంతో పాటు, ఒత్తిడి కూడా తగ్గుతుంది. ఈ వ్యాయామం కోసం, కుర్చీలో నిటారుగా కూర్చుని, మోకాళ్లను మడిచి, నడుము దగ్గరకు తీసుకురావాలి. ఇలా చేస్తున్నప్పుడు రెండు పాదాలనూ బలంగా ఆనించి ఉంచి, చేతులతో పట్టుకోవాలి. తర్వాత అదే భంగిమలో మోకాళ్లను పైకి, కిందకూ లేపి, దించాలి. ఇలా 15 సార్లు, 3 సెట్స్ చేయాలి.
- **సిట్టింగ్ స్ట్రెయిట్:** కుర్చీలో నిటారుగా కూర్చునే అలవాటు అలవరుచుకోవాలి. ఈ అలవాటుతో రోజుకు 350 క్యాలరీలు ఖర్చవుతాయి. కాబట్టి జారిగిలబడి కూర్చోకుండా, వెన్ను కుర్చీకి ఆనుకుని ఉండేలా నిటారుగా కూర్చోవాలి.
- **అంకెలు గీయాలి:** కుర్చీలో కూర్చుని, కాలి వేళ్లతో గాల్లో అంకెలు, అక్షరాలు గీయడం సాధన చేయాలి. ఇలా చేయడం వల్ల కాలి పిక్కలు, తొడ కండరాలు, లిగమెంట్లు, టెండాన్లు ఆరోగ్యంగా మారతాయి. కాళ్లకు వ్యాయామం దొరుకుతుంది.

హెర్బల్ హెల్త్

కర్పూరవల్లి కమనీయం

వాము ఆకునే కర్పూరవల్లి అంటారు. దీనికి మెక్సికన్ మింట్ అనే ఇంకొక పేరు కూడా ఉంది. కొద్దిపాటి జాగ్రత్తలతో, చిన్న ప్రదేశాల్లో ఈ మొక్కను పెంచుకోవచ్చు. పోషకాల నిలయమైన ఈ ఆకుతో ఒరిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం!

- ఈ ఆకు, గొంతు నొప్పి, జలుబులను తగ్గిస్తుంది. ఆకును నమలి, రసం మింగడం వల్ల గొంతు నొప్పి తగ్గుతుంది. ఆకు రసాన్ని తేనెతో కలిపి తీసుకోవడం వల్ల జలుబు తగ్గుతుంది.
- వానాకాలం, చలికాలాల్లో ఈ ఆకుతో బజ్జీలు వండుకుని తినడం ద్వారా దీన్లోని ఔషధగుణాలను ఉపయోగించుకోవచ్చు.
- ఈ ఆకులను నూరి గాయాలకు, దెబ్బలకూ, కాలిన బొబ్బలకూ పట్టు వేయవచ్చు.



- అజీర్తి, నోటి పుండ్లు, చర్మ ఇన్‌ఫెక్షన్లు, వెక్కిళ్లు, పొట్టలో నొప్పుల నుంచి ఈ ఆకు ఉపశమనాన్ని అందిస్తుంది.
- ఇమ్యూనిటీని పెంచుకోవడం కోసం ఈ ఆకులతో తయారుచేసుకున్న కషాయం తాగాలి.
- కర్పూరవల్లి ఆకులను మరగకాచి, ఆవిరి పడితే ఛాతీలో పేరుకున్న కఫం కరుగుతుంది. రసాన్ని ఛాతీకి పూసుకున్నా ఫలితం ఉంటుంది.
- కర్పూరవల్లితో తయారుచేసిన ఎసెన్షియల్ ఆయిల్, యాంటీ కేన్సర్ గుణాలను కనబరిచినట్టు పరిశోధనల్లో రుజువైంది.

అవగాహన

కల్తీ లేని నెయ్యి దొరుకుతుందా?

మంది ఎంత పెరిగినా, బజార్లో దొరికే నేతి మిఠాయిలకు కొదవుండదు. ఇక్కడే నెయ్యి తాజాదనం గురించి తార్కికంగా ఆలోచించాలి. స్వచ్ఛమైన నెయ్యిని పొందడం కోసం కల్తీలను పసిగట్టడంతో పాటు, ఇంట్లో స్వయంగా నేతిని తయారుచేసుకోగలిగే మెలకువల గురించి తెలుసుకోవాలి.

మనం కూరగాయలు, పండ్లు, పూల మొక్కలు పెంచుకుంటాం. పప్పుధాన్యాలు పండించుకుంటాం. కోళ్లు, మేకలను పెంచుకుంటాం! తిరగళ్లతో పిండ్లు ఇసురుకుం టాం! కానీ ఘన, ద్రవ రూపాల్లోని కొవ్వులను మాత్రం బయటి నుంచే కొనుక్కుంటూ ఉంటాం! వంటల కోసం, రుచి కోసం ఉపయోగించే నూనెలు, నెయ్యిలను ఇళ్లలో తయారు చేసుకునే సంప్రదాయం క్రమేపీ అడుగంటింది. అవసరం పెరగడం, ఉత్పత్తులు తగ్గడం వల్ల కల్తీలు సర్వత్రా సర్వసామాన్యపోయాయి. నెయ్యిలోని పోషక విలువల గురించి అవగాహన పెరిగిన తర్వాత, తాజా నెయ్యి కోసం వెంపర్లాట ఊపందుకుంది. కానీ కల్తీ లేని నెయ్యి బజార్లో దొరుకుతుందా? నిజానికి ఎంత ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉన్నా, నూరు శాతం స్వచ్ఛమైన నెయ్యి దొరకని పరిస్థితి నెలకొని ఉంది. అయినా పిండి వంటల తయారీ కోసం, భోజనంలో రుచిని పెంచుకోవడం కోసం తరచూ నెయ్యి మీద ఆధారపడక తప్పడం లేదు. దాంతో మార్కెట్లో దొరికే బ్రాండెడ్ ఘీల మీద ఆధారపడుతున్నాం. లేదంటే గ్రామాల్లో గాలించి తెచ్చుకుంటున్నాం. అయితే ఇలా మనం స్వచ్ఛమైన నెయ్యినే కొంటున్నామా?

కల్తీ నెయ్యిని ఇలా కనిపెట్టాలి

నెయ్యి విషయంలో కళ్లు, ముక్కు మనల్ని మోసం చేయలేవు. ఘుమఘుమలాడుతూ, లేత బంగారు రంగులో కనిపించేది మాత్రమే స్వచ్ఛమైన నెయ్యి. రంగు, వాసనలు, గాఢతలో తేడాలు కనిపిస్తే, కొన్ని తేలికపాటి పరీక్షలతో నెయ్యిలో జరిగిన కల్తీని సునాయాసంగా కనిపెట్టవచ్చు. అదెలాగంటే...

- **పాల అవక్షేప పరీక్ష:** తెల్ల పేపర్ లేదా ప్లేటు మీద ఒక స్పూను నెయ్యిని వేసి, కొన్ని గంటల పాటు అలాగే వదిలేయాలి. తర్వాత పేపర్, లేదా ప్లేటు మీద ఏవైనా మలినాలు, అవక్షేపాలు కనిపిస్తే ఆ నెయ్యి కల్తీదని అర్థం చేసుకోవాలి. స్వచ్ఛమైన నెయ్యితో ఎలాంటి మరకలు ఏర్పడవు.
- **స్పష్టత, ఆకృతి:** స్వచ్ఛమైన నెయ్యి పారదర్శకంగా ఉంటుంది. నున్నని టెక్స్‌చర్‌ను కలిగి ఉంటుంది. మసకగా ఉన్నా, కణుపులు కనిపించినా, ముద్దగా ఉన్నా దాన్లో కల్తీ జరిగిందని అర్థం చేసుకోవాలి. స్వచ్ఛమైన నేయి, గది ఉష్ణోగ్రతలో ద్రవ రూపంలో ఉంటుంది.



- **బర్న్ టెస్ట్:** ఒక టీ స్పూను నెయ్యిని ప్యాన్‌లో వేడి చేసి అది కల్తీదో కాదో కనిపెట్టవచ్చు. స్వచ్ఛమైన వేడి తగిలిన వెంటనే ఎలాంటి పొగలు, మాడు వాసనలను వెలువరించకుండా క్షణాల్లో కరిగిపోతుంది. మలినాలు కలిసిన నెయ్యి పొగలు, దుర్వాసనలను వెలువరిస్తుంది.

> **నెయ్యి నిల్వ ఇలా...**
> **నెయ్యి గది ఉష్ణోగ్రతలో 3 నుంచి 4 నెలల వరకూ చెక్కుచెదరకుండా ఉంటుంది. ఫ్రిజ్‌లో ఏడాది వరకూ నిల్వ ఉంటుంది. ఒకవేళ గడ్డకట్టిపోకుండా ఉండాలనుకుంటే, నెయ్యి సీసాలో చిన్న బెల్లం ముక్క వేసుకోవాలి.**

- **నీళ్ల పరీక్ష:** గోరువెచ్చని నీళ్లలో కొద్ది పాటి నెయ్యిని వేయాలి. నెయ్యి స్వచ్ఛమైనదైతే వెంటనే నీళ్లలో కరిగిపోతుంది. నీళ్లు కూడా స్పష్టంగా ఉంటాయి. ఒకవేళ ఏదానా మడ్డి, మలినాలు నెయ్యి నుంచి వేరుపడితే, అది కల్తీదని అర్థం చేసుకోవాలి.
- **ఫ్రిజ్ పరీక్ష:** నెయ్యిని కొన్ని గంటల పాటు ఫ్రిజ్‌లో ఉంచాలి. స్వచ్ఛమైన నెయ్యి హెచ్చుతగ్గులు లేకుండా సమంగా గడ్డకడుతుంది. దీన్లో వేర్వేరు పొరలు, స్ఫటికాలూ కనిపించవు. హెచ్చుతగ్గులతో కూడిన పొరలు, స్ఫటికాలూ కనిపిస్తే అది కల్తీ నెయ్యిని అర్థం.
- **రుచి పరీక్ష:** స్వచ్ఛమైన నెయ్యి నోట్లో వేసుకున్నప్పుడు వెన్నలా తగులుతుంది. కల్తీ నెయ్యి తేలికగా గొంతులోకి జారకుండా, దంతాలకూ, నాలుకకూ అంటుకుంటుంది.
- **మరక పరీక్ష:** స్వచ్ఛమైన నెయ్యి ఎలాంటి మరకలనూ ఏర్పరచదు. వస్త్రం మీద నెయ్యి మరక ఏర్పడినా, ఏవైనా అవక్షేపాలు మిగిలిపోయినా ఆ నెయ్యి కచ్చితంగా కల్తీదే!

టేబుల్ బటర్‌తో నెయ్యి

స్వచ్ఛమైన నెయ్యిని ఎలా తయారుచేసుకోవాలో మనందరికీ తెలిసిందే! పాలు కాచి, తోడుకున్న పెరుగును చిలికితే, వెన్న తయారవుతుంది. ఈ వెన్నను వేడి చేసి నెయ్యి తయారుచేసుకోవచ్చు. కానీ కల్తీ లేని చిక్కని పాలు కరువైపోతున్న ఈ రోజుల్లో, రెడీమేడ్ వెన్న నుంచి నెయ్యిని ఎలా తయారుచేసుకోవచ్చో తెలుసుకుందాం! నెయ్యి తయారీ కోసం సాల్టెడ్ బటర్‌కు బదులుగా అన్‌సాల్టెడ్/టేబుల్ బటర్ ఎంచుకోవాలి. ఈ వెన్నను ముక్కలు చేసి, పాత్రలో వేసి చిన్న మంట మీద కాచుకోవాలి. 5 నుంచి 8 నిమిషాల్లో వెన్న కరిగి, ఉడికి బంగారు రంగులోకి మారిపోతుంది. కమ్మని వాసన కూడా మొదలవుతుంది. చివర్లో గుప్పెడు కరివేపాకు చల్లి పొయ్యి నుంచి దించేసుకుని, చల్లారిన తర్వాత సీసాలో నిల్వ చేసుకుని వాడుకోవాలి. మిల్క్ క్రీమ్ నుంచి కొందరు నెయ్యి తయారుచేసుకుంటూ ఉంటారు. దీన్ని కూడా పాత్రలో వేసి, కాచి, నెయ్యి తయారు చేసుకోవచ్చు. అయితే నెయ్యి తయారు చేసుకునేటప్పుడు పొగలు వచ్చేవరకూ మరిగించుకోకూడదు. ఇలా చేస్తే నెయ్యి మాడిపోవడమే కాకుండా, పోషకాలన్నీ అడుగంటే ప్రమాదం ఉంటుంది.

హెల్తీ స్నాకింగ్

ఇలా కూడా బరువు తగ్గొచ్చు

బరువు పెరగకుండా ఉండాంటే కడుపు మాడ్చుకోవలసిన అవసరం లేదు. ఆకలిని అదుపులో ఉంచే ఆరోగ్యకరమైన స్నాక్స్‌తో కూడా అదనపు క్యాలరీలు శరీరంలో పెరిగిపోకుండా నియంత్రించుకోవచ్చు. అయితే దీన్లో కూడా కొన్ని నియమాలు పాటించాలి.



- భోజనానికీ భోజనానికీ మధ్య తినే స్నాక్స్ కచ్చితంగా ఆరోగ్యకరమైనవై ఉండాలి.
- ఒకసారి తినే స్నాక్స్ 200 క్యాలరీలను మాత్రమే కలిగి ఉండాలి. పరిమాణం కంటే నాణ్యతే ప్రధానమనే విషయం గుర్తు పెట్టుకోవాలి.
- చురుకైన జీవనశైలిని కొనసాగించే వాళ్లు, రోజుకు మూడు సార్లు స్నాక్స్ తీసుకోవచ్చు. గంటల తరబడి కూర్చుని పని చేసేవాళ్లు ఒక స్నాక్‌తో సరిపెట్టుకోవాలి.
- తాజా పండ్లు, సలాడ్, నట్స్, ఇలా తక్కువ కార్బ్స్, ఎక్కువ ఫైబర్ ఉండే పదార్థాలనే ఎంచుకోవాలి.
- ప్రాసెస్డ్ ఫుడ్స్ స్నాక్స్‌గా పనికి రావు. అలాగే చక్కెరతో తయారైనవీ మానేయాలి.

ఏసెట్ అక్టోబరు సెషన్ నోటిఫికేషన్



ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యాక్చురీస్ ఆఫ్ ఇండియా- స్టూడెంట్ నమోదు సహా తదుపరి యాక్చురియల్ ఎగ్జామ్స్ రాసేందుకు ఉద్దేశించిన 'యాక్చురియల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏసెట్) 2024 అక్టోబరు సెషన్‌కు దరఖాస్తులు కోరుతోంది. ఎగ్జామ్‌కు సంబంధించిన వివరాలను అభ్యర్థుల ఈ మెయిల్స్‌కు పంపుతారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం సంస్థ మాక్ టెస్టులు కూడా నిర్వహిస్తుంది. గత ఆరేళ్ల ప్రశ్న పత్రాలు, వాటి సమాధానాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఏసెట్ స్కోర్ వ్యాలిడిటీ మూడేళ్లు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూపుతో ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా, డిగ్రీ కోర్సులు పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. మేథ్స్, స్టాటిస్టిక్స్, ఎకనామెట్రిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా చదివిన వారికి; ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, చార్టర్డ్ అకౌంటెంట్, కాస్ట్ అకౌంటెంట్, కంపెనీ సెక్రటరీ కోర్సులు చేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది.

ఏసెట్ వివరాలు: పరీక్ష సమయం మూడు గంటలు. ఇందులో మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఇంగ్లీష్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్ అంశాలనుంచి 70 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మొత్తం మార్కులు 100. ఒక మార్కు ప్రశ్నలు 45, రెండు మార్కుల ప్రశ్నలు 20, మూడు మార్కుల ప్రశ్నలు 5 అడుగుతారు. మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్‌లకు సంబంధించి ఒక్కోదానిలో 30 మార్కులకు; డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇంగ్లీష్‌లకు సంబంధించి ఒక్కోదానిలో 15 మార్కులకు; లాజికల్ రీజనింగ్ నుంచి 10 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. రుణాత్మక మార్కులు లేవు. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి.

ఏసెట్ నిర్వహణ: ఇది హోమ్ బేస్డ్ ఆన్‌లైన్ ఎగ్జామ్. ఈ పరీక్ష రాయదలచుకొన్న అభ్యర్థులు సంస్థ నిర్దేశించిన మేరకు హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ సాంకేతికతను అందుబాటులో ఉంచుకోవాలి.

- హార్డ్‌వేర్‌కు సంబంధించి పర్సనల్ ల్యాప్‌టాప్/డెస్క్‌టాప్, 640x480 @ 15fps రిజల్యూషన్ ఉన్న వెబ్ కెమెరా, 1 ఎంబీపీఎస్ బ్యాండ్‌విడ్త్‌తో వైర్డ్/వైర్‌లెస్ ఇంటర్నెట్, 2 జీబీ ర్యామ్, 2 కోర్స్-4 థ్రెడ్స్-2.2 గిగా హెర్ట్జ్ ప్రాసెసర్, 64 ఎంబీ గ్రాఫిక్స్ మెమరీ, 1024 x 768కంటే తక్కువ కాకుండా స్క్రీన్ రిజల్యూషన్, మల్టీ మీడియా సపోర్ట్ ఉన్న సౌండ్ కార్డ్ ఏర్పాటు చేసుకోవాలి.
- సాఫ్ట్‌వేర్‌కు సంబంధించి విండోస్ 10/8/7 ఆపరేటింగ్ సిస్టమ్, లేటెస్ట్ వెబ్ బ్రౌజర్, 4.5.2 నెట్ ఫ్రేమ్ వర్క్ సిద్ధం చేసుకోవాలి.
- పరీక్ష రాసే సమయంలో ఒరిజినల్ ఆధార్ కార్డ్/డ్రైవింగ్ లైసెన్స్/పాస్‌పోర్ట్/ఓటర్ ఐడీ కార్డ్/పాన్ కార్డ్‌లను దగ్గర ఉంచుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 5
- **ఏసెట్ 2024 అక్టోబరు సెషన్ తేదీ:** అక్టోబరు 13
- **వెబ్‌సైట్:** www.actuariesindia.org

దిక్సూచి DIKSUCHI

తెలంగాణ బీసీ మహిళా గురుకులాల్లో బీఎస్సీ(ఆనర్స్)అగ్రికల్చర్

మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలోని మహిళా వ్యవసాయ డిగ్రీ కళాశాలలు అందిస్తున్న బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. వనపర్తి అగ్రికల్చరల్ కాలేజ్, కరీంనగర్ అగ్రికల్చరల్ కాలేజీల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. ఒక్కో కాలేజీలో 120 సీట్లు ఉన్నాయి. తెలంగాణ ఈఏపీసెట్ 2024 స్కోర్ ప్రకారం 85 శాతం సీట్లను భర్తీ చేస్తారు. మిగిలిన 15 శాతం సీట్లను పీజేటీఎస్ఏయూ అగ్రిసెట్ 2024 స్కోర్ ద్వారా భర్తీ చేస్తారు. అంటే తెలంగాణ ఈఏపీసెట్ 2024 అభ్యర్థులకు 102 సీట్లు, పీజేటీఎస్ఏయూ అగ్రిసెట్ 2024 అభ్యర్థులకు 18 సీట్లు కేటాయించారు. బీసీ అభ్యర్థులకు 75 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 5 శాతం, ఓసీ/ఈబీసీ అభ్యర్థులకు 2 శాతం, అనాథలకు 3 శాతం సీట్లు నిర్దేశించారు. రాష్ట్రానికి చెందిన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు లేదా పీజేటీఎస్ఏయూ నుంచి రెండేళ్ల డిప్లొమా(అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ/ఆర్గానిక్ అగ్రికల్చర్) ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ ఈఏపీసెట్ 2024 (బైపీసీ స్ట్రీమ్) లేదా పీజేటీఎస్ఏయూ అగ్రిసెట్ 2024 అర్హత పొంది ఉండాలి. అభ్యర్థి వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000; పట్టణాల్లో రూ.2,00,000 మించకూడదు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 10
- **ఆన్‌లైన్ దరఖాస్తులో కరెక్షన్స్ విండో ఓపెన్:** అక్టోబరు 11 నుంచి 12 వరకు
- **వెబ్‌సైట్:** mjptbcwreis.telangana.gov.in

సీటీటీసీలో ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లు

భువనేశ్వర్‌లోని సెంట్రల్ టూల్ రూమ్ అండ్ ట్రెయినింగ్ సెంటర్(సీటీటీసీ)- ఉచిత శిక్షణ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడు నెలలు. వీటిని నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఎస్‌డీసీ) స్పాన్సర్ చేస్తోంది. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

సీఎన్‌సీ ఆపరేటర్: సీఎన్‌సీ ఆపరేటర్ టర్నింగ్ ప్రోగ్రామ్‌లో 300 సీట్లు, సీఎన్‌సీ ఆపరేటర్ వర్టికల్ ప్రోగ్రామ్‌లో 250 సీట్లు ఉన్నాయి.

- **అర్హత:** (ఐటీఐ/డిప్లొమా)(మెకానికల్/ఫిట్టర్/ఇన్‌స్ట్రుమెంటేషన్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

సీఎన్‌సీ ప్రోగ్రామర్: ఇందులో 210 సీట్లు ఉన్నాయి.

- **అర్హత:** (డిప్లొమా/బీఈ/బీటెక్)(మెకానికల్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. • **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 22
- **వెబ్‌సైట్:** www.cttc.gov.in

ఐసర్ భోపాల్‌లో పీహెచ్‌డీ

భోపాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐసర్)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.


విభాగాలు: నేచురల్ సైన్సెస్ స్ట్రీమ్-బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, ఫిజిక్స్ • ఇంజనీరింగ్ సైన్సెస్ స్ట్రీమ్- కెమికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ అండ్ ఇంజనీరింగ్. • హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ స్ట్రీమ్- ఎకనామిక్ సైన్సెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్(కాగ్నిటివ్ సైన్స్, సోషల్ వర్క్ అండ్ సోషియాలజీ)

అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగాల్లో ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్/ఎంఎస్/ఎమ్మెస్సీ/ఎంఏ ఉత్తీర్ణులు; ఎంబీబీఎస్/బీఈ/బీటెక్/బీఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. గేట్ వ్యాలిడ్ స్కోర్ లేదా సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్/యూజీసీ జేఆర్ఎఫ్/డీబీటీ జేఆర్ఎఫ్/ ఐసీఎంఆర్ జేఆర్ఎఫ్/ఇన్‌స్పైర్ జేఆర్ఎఫ్/రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్/సీఎస్ఐఆర్ ఎల్ఎస్/యూజీసీ ఎల్ఎస్ అర్హత తప్పనిసరి. కనీసం 8 సీజీపీఏ స్కోర్‌తో ఐఐటీల నుంచి బీఈ/బీటెక్ అలాగే ఐసర్ల నుంచి బీఎస్ - ఎంఎస్ పూర్తిచేసినవారికి గేట్/ఫెలోషిప్ అర్హత అవసరం లేదు. మెడికల్ సంబంధిత స్పెషలైజేషన్‌లకు ఎంబీబీఎస్ పూర్తిచేసినవారు కూడా అర్హులే. జీఆర్ఈ జనరల్ టెస్ట్‌లో 280 స్కోర్/గేట్ వ్యాలిడ్ స్కోర్, టోఫెల్‌లో 60 స్కోర్/ఐఈఎల్‌టీఎస్‌లో 6 స్కోర్ తప్పనిసరి. • **చివరి తేదీ:** అక్టోబరు 14

- **వెబ్‌సైట్:** www.iiserb.ac.in/

బెంగాల్ టైగర్‌కు ఫాల్కే పురస్కారం





బాలీవుడ్‌లో 'బెంగాల్ టైగర్'గా పేరొందిన నటుడు మిథున్ చక్రవర్తికి 2022 సంవత్సరానికిగాను ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్ ఇస్తున్నట్టు కేంద్ర సమాచారశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఆశా పరేఖ్, కుష్బూ, విపుల్ అమృతలాల్ షా సభ్యులుగా ఉన్న జ్యూరీ కమిటీ ఈ అవార్డ్‌కు మిథున్ పేరుని ఎన్నిక చేసిందని మంత్రి వెల్లడించారు. దేశంలోని అత్యున్నత పురస్కారాల్లో మూడోది అయిన పద్మభూషణ్ పొందిన ఆరు నెలల కాలంలో భారతీయ చిత్ర పరిశ్రమ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్ వరించడంతో బెంగాలీబాబు మిథున్ చక్రవర్తి నట జీవితానికి ఓ సార్థకత లభించిందని చెప్పాలి. మిగతా హీరోల్లా ఆయన కెరీర్ మొదటి నుంచీ అంత సాఫీగా సాగలేదు. ప్రతి దశలోనూ పోరాటమే. విద్యార్థి దశలోనే కాదు చిత్ర పరిశ్రమలోనూ ఆయనది పోరుబాటే. పోరాడి అన్నీ సాధించుకున్నారు మిథున్. అయితే ఆయన అసలు పేరు అది కాదు.. గౌరంగ చక్రవర్తి. 1950 జూన్ 16న కోల్‌కతాలో పుట్టిన గౌరంగ బి.ఎస్సీ చదివారు. వామపక్ష భావజాలం కలిగి ఉండడంతో సమాజంలో పెట్టుబడిదారీ వ్యవస్థ చేస్తున్న దోపిడి చూసి తట్టుకోలేకపోయేవారు. నక్సలిజం ఉద్యమం పట్ల ఆకర్షితుడై సోదరుడితో కలసి అందులో చేరి ఉద్యమకారుడిగా పీడిత ప్రజల్ని ఆకట్టుకున్నారు. అయితే తన సోదరుడు మరణించిన తర్వాత ఉద్యమ బాట వదిలి జనంలోకి వచ్చారు. బెంగాల్‌లో ఇక ఉండలేక ముంబైకి వెళ్లిపోయారు. మొదట్లో సినిమాల మీద ఆసక్తి ఉండేది కాదు. బతకడం కోసం ఏదన్నా ఉద్యోగం చేయాలనుకుని ఓ నైట్ క్లబ్‌లో డాన్సర్‌గా చేరారు. ఆ క్లబ్‌కు వచ్చిన సినీ ప్రముఖుల దృష్టిని ఆకర్షించారు. బెంగాలీ దర్శకుడు మృణాల్ సేన్ 'మృగయా'(1976) చిత్రంలో మిథున్‌కు అవకాశం ఇచ్చారు. అవార్డ్ వచ్చిన సందర్భంగా మిథున్ తన గతాన్ని గుర్తు చేసుకున్నారు. 'ముంబైకి వచ్చిన తొలి రోజుల్లో తినడానికి తిండి దొరికేది కాదు. గార్డెన్‌లో పడుకున్న రోజులు ఉన్నాయి. ఆ కష్టాలు తట్టుకోలేక చచ్చిపోదామని ఎన్నోసార్లు అనిపించేది. కానీ నాకు నేనే ధైర్యం చెప్పుకొన్నా. మంచి రోజులు వస్తాయని నమ్మా. ఆ నమ్మకమే నన్ను నిలబెట్టింది' అని చెప్పారు 74 ఏళ్ల మిథున్.


బాలీవుడ్‌పై బలమైన ముద్ర

తొలి చిత్రంతోనే జాతీయ అవార్డ్ పొందిన మిథున్ చక్రవర్తి నట జీవితాన్ని మలుపు తిప్పిన సినిమా 'డిస్కో డాన్సర్'. అందులో 'ఐయామ్ ఏ డిస్కో డాన్సర్' అంటూ ఆయన తెరపై డాన్స్ చేస్తుంటే థియేటర్లలో ప్రేక్షకులు ఆనందంతో గంతులు వేశారు. అమ్మాయిలు వెర్రెత్తి పోయేవారు. 80ల దశకంలో హిందీ సినిమాపై ఎంతో ప్రభావం చూపిన నటుడాయన. హీరో అనే పదానికి అర్థం మార్చేసిన మిథున్ 1989లో 19 చిత్రాల్లో నటించి రికార్డ్ నెలకొల్పారు. బాలీవుడ్‌లో 'బెంగాల్ టైగర్'గా పేరు తెచ్చుకోవడమే కాదు రెండుసార్లు ఉత్తమ నటుడిగా, ఒకసారి సహాయ నటుడిగా మిథున్ జాతీయ అవార్డులు అందుకొన్నారు. హిందీలోనే కాకుండా బెంగాలీ, ఒరియా, భోజ్‌పురి భాషల్లో 370 పైగా చిత్రాల్లో నటించారు. తెలుగులో పవన్‌కల్యాణ్ నటించిన 'గోపాల గోపాల'లో విలన్‌గా ఆకట్టుకొన్నారు. ఆమధ్య వచ్చిన 'కశ్మీరీ ఫైల్స్' చిత్రంలో మిథున్ నటనని ప్రేక్షకులు మరువలేరు. మంచి పాత్రల కోసం ఇప్పటికీ పరితపించే ఈ నటుడు తనకు వచ్చిన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్‌ను తన కుటుంబానికి, అభిమానులకు అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు. అక్టోబర్ 8న జరిగే జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మిథున్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్ అందజేస్తారు.

నవ్య | చిత్రజ్యోతి

రా మచ్చా

రామ్ చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. క్రిస్మస్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం నుంచి రెండోపాటను మేకర్స్ సోమవారం విడుదల చేశారు. 'రా మచ్చా మచ్చా' అంటూ హీరో పాత్రను



పరిచయం చేస్తూ సాగే ఈ గీతానికి అనంత్ శ్రీరామ్ సాహిత్యం అందించారు. తమన్ స్వరాలు సమకూర్చగా, నకాష్ అజీజ్ ఆలపించారు. ఈ చిత్రంలో రామ్‌చరణ్ సరసన కియారా అద్వాణీ కథానాయికగా నటిస్తున్నారు. దిల్‌రాజు-శిరీష్ నిర్మిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: తిరుణావుక్కరుసు

శివరాత్రి పాట చిత్రీకరణలో



నాగచైతన్య, సాయిపల్లవి జంటగా రూపొందుతున్న చిత్రం 'తండేల్'. చందూ మొండేటి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాస్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. భారీ సెట్ వేసి అందులో నాగచైతన్య సాయిపల్లవిపై శివరాత్రి నేపథ్యంలో సాగే గీతాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సందర్భంగా పాట చిత్రీకరణకు సంబంధించిన రెండు పోస్టర్స్‌ను చిత్ర బృందం సోమవారం విడుదల చేసింది. శివ పార్వతులను తలపించేలా నర్తిస్తున్న నాగచైతన్య, సాయిపల్లవి జంట ఆకట్టుకుంది. ఈ చిత్రానికి సంగీతం: దేవి శ్రీ ప్రసాద్. సినిమాటోగ్రఫీ: షామ్‌దత్.

కమిటీ కుర్రోళ్లు యాభై రోజుల వేడుక



నిహారిక కొణిదెల సమర్పణలో పణి అడపాక నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం యాభై రోజుల వేడుక సోమవారం ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో జరిగింది. సీనియర్ నటీనటులతో పాటు పదకొండు మంది హీరోలు, నలుగురు హీరోయిన్లను పరిచయం చేస్తూ నిర్మించిన ఈ చిత్రానికి యదు వంశీ దర్శకత్వం వహించారు. ఈ వేడుకకు నాగబాబు, దిల్ రాజు ముఖ్య అతిథులుగా హాజరైన యూనిట్ సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ రోజుల్లో ఒక సినిమా 50 రోజులు పూర్తి చేసుకోవడం అరుదనీ, 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ఆ రికార్డ్ సాధించినందుకు అతిథులు అభినందించారు.

దసరాకు వస్తున్న రాజావారు

ఇన్ ప్రోగ్రెస్



నార్నే నితిన్ హీరోగా సతీశ్ వేగేశ్న దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'శ్రీశ్రీశ్రీ రాజావారు' చిత్రం దసరాకు విడుదల కానుంది. లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో సంపద హీరోయిన్. ఈ టీజర్‌ను దర్శకుడు వంశీ పైడిపల్లి విడుదల చేసి, టీమ్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ 'నార్నే నితిన్ నటిస్తున్న మరో మంచి సినిమా 'శ్రీశ్రీశ్రీ రాజావారు', దసరాకు విడుదల చేస్తున్నాం' అన్నారు.

సిస్టర్ సెంటిమెంట్‌తో



రామ్ మిట్టకంటి, పవిత్ర, కస్వీ ప్రధాన పాత్రలు పోషించిన 'చిట్టి.. పొట్టి' చిత్రం ట్రైలర్‌ను యూనిట్ విడుదల చేసింది. భాస్కర్ యాదవ్ దాసరి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన సినిమా ఇది. ఈ సందర్భంగా దర్శకనిర్మాత మాట్లాడుతూ 'అన్నా చెల్లెలు అనుబంధం కథాంశంగా రూపుదిద్దుకున్న సినిమా ఇది. చెల్లెలుగా, మేనత్తగా, చివరికి బామ్మగా .. ఓ మహిళ జీవితంలోని ఎమోషనల్ జర్నీని ఇందులో చూపించాం. అక్టోబర్ 3న విడుదల చేస్తున్నాం' అని చెప్పారు.

ముగింపు మెప్పిస్తుంది




నోయల్, రిషిత నెల్లూరు జంటగా నటించిన 'బహిర్భూమి' చిత్రం ఈ నెల నాలుగున విడుదల కానుంది. రామ్‌ప్రసాద్ కొండూరు దర్శకత్వంలో మచ్చ వేణుమాధవ్ నిర్మించారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత మాట్లాడుతూ 'న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ బిల్ బోర్డ్ మీద మీ సినిమా ట్రైలర్‌ను డిస్ ప్లే చేస్తున్నాం. తెలుగులో విడుదల చేసిన తర్వాత మిగిలిన భాషల్లో రిలీజ్ చేస్తాం' అని చెప్పారు. బహిర్భూమి అనే టైటిల్ ఎందుకు పెట్టామో సినిమా చూస్తే అర్థమవుతుందని దర్శకుడు చెప్పారు. ఈ సినిమా ముగింపు ప్రేక్షకులను మెప్పిస్తుందని నోయల్ చెప్పారు.

పరిష్కారం చూపే ప్రయత్నం



'మంత్ర' ఫేం ఓషో తులసీరామ్ దర్శకత్వంలో తెరకెక్కిన హారర్ థ్రిల్లర్ 'దక్షిణ'. సాయిధన్సిక లీడ్‌రోల్ పోషించారు. ఈ నెల 4న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తులసీరామ్ మాట్లాడుతూ 'ఇదొక సూపర్ థ్రిల్లర్. సమాజంలో అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ, వాటికి పరిష్కారం చూపే ప్రయత్నం చేశాం' అన్నారు. సినిమా ఆసక్తికరంగా ఉంటుంది, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని సాయిధన్సిక చెప్పారు.

పవన్‌ను విమర్శించేవాళ్లు సూడో సెక్యులరిస్ట్‌లు



నాగబాబు

'పవన్ కల్యాణ్ అసలైన సెక్యులరిస్ట్. ఆయన్ను విమర్శించేవాళ్లంతా 'సూడో సెక్యులరిస్ట్‌లు' అని నటుడు నాగబాబు ఘాటు వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న నాగబాబు తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై స్పందించారు. 'వైకాపా నాయకుల విమర్శలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. లడ్డూ కల్తీకి పాల్పడిన వారు ఎవరనేది విచారణలో తేలుతుంది. ప్రభుత్వాల అవినీతి వల్ల హిందూ ధర్మానికి ఆపద వాటిల్లుతోంది అనేదే పవన్ ఆవేదన. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంతో హిందూ ధర్మంపై జరుగుతున్న కుట్రలు పతాక స్థాయికి చేరాయి. హిందూ ధర్మ రక్షణ మండలి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది' అని నాగబాబు అన్నారు. ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన తెలుగు రాష్ట్రాల్లోని శ్రీవారి భక్తులకు మద్దతుగా సంగీత దర్శకుడు కీరవాణి 'ఓం నమో నారాయణాయ' పేరుతో ఓ ఆడియో రికార్డును విడుదల చేశారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ ఓ ప్రకటనలో కీరవాణికి, ఆయన బృందానికి అభినందనలు తెలిపారు.

దేవుణ్ణి రాజకీయాల్లోకి లాగొద్దు : ప్రకాశ్‌రాజ్

తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ అంశం వెలుగులోకి వచ్చినప్పటి నుంచి వరుస ట్వీట్లతో తన అభిప్రాయాలను తెలుపుతూ వార్తల్లో నిలుస్తున్నారు నటుడు ప్రకాశ్‌రాజ్. లడ్డూ కల్తీ అంశంపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ప్రకాశ్ రాజ్ మరోసారి సోషల్ మీడియా వేదికగా 'జస్ట్ ఆస్కింగ్' అంటూ తనదైన శైలిలో స్పందించారు. 'దేవుణ్ణి రాజకీయాల్లోకి లాగకండి' అంటూ దండం పెడుతున్న ఎమోజీలను ఆయన పోస్ట్ చేశారు.

వినోదం ప్లస్ సందేశం




సాయిరోనక్, ప్రగ్యా నగ్రా జంటగా నటించిన చిత్రం 'లగ్గం'. రాజేంద్రప్రసాద్ కీలకపాత్ర పోషించారు. రమేశ్ చెప్పాల దర్శకత్వంలో వేణుగోపాల్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. అక్టోబర్ 25న ప్రేక్షకుల ముందుకొస్తోంది. హీరో సుధీర్‌బాబు ఈ చిత్రం రిలీజ్ డేట్ పోస్టర్‌ను ఆవిష్కరించి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. పెళ్లి నేపథ్యంలో వినోదంతో పాటు చక్కని సందేశంతో తెరకెక్కిన చిత్రమిదని దర్శకుడు తెలిపారు. సంగీతం: మణిశర్మ, చరణ్ అర్జున్, సినిమాటోగ్రఫీ: బాల్‌రెడ్డి

కొత్త కాన్సెప్ట్



సుగి విజయ్, జుహ్వీ భద్ర హీరోహీరోయిన్లుగా నటిస్తున్న 'ఐ హేట్ మ్యారేజ్ ' చిత్రం షూటింగ్ సోమవారం హైదరాబాద్‌లో మొదలైంది. పరమేశ్ రేణుకుంట్ల దర్శకత్వంలో ఎం. దయానంద్ నిర్మిస్తున్నారు. నేటి యువతరంతో పాటు కుటుంబ సభ్యులకు నచ్చే భావోద్వేగాలతో ఈ సినిమా ఉంటుందనీ, యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా సినిమా ఉంటుందనీ దర్శకుడు చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'రొటీన్‌కు భిన్నంగా కొత్త కాన్సెప్ట్‌తో చిత్రాన్ని తీస్తున్నాం. డిసెంబర్ వరకూ ఏకధాటిగా జరిగే షూటింగ్‌తో చిత్రం పూర్తవుతుంది' అని చెప్పారు.

కలి స్ఫూర్తిగా



జీవితంలో ఎదురయ్యే సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదు అనే అంశాన్ని 'కలి' చిత్రంలో చూపించబోతున్నాం. కలి పురుషుడి పాత్రను స్ఫూర్తిగా తీసుకొని ఈ చిత్రం తెరకెక్కించాను' అని దర్శకుడు శివశేష అన్నారు. ప్రిన్స్, నరేశ్ అగస్త్య హీరోలుగా నటించిన ఈ చిత్రం ఈ నెల 4న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శివశేష సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు. 'సమయాన్ని, ఆత్మను ఆధారంగా చేసుకొని కలి ఈ యుగాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నాడు అనేది ఆసక్తికరంగా చూపించాం. ఇందులో మంచి ప్రేమకథ కూడా ఉంది. వీఎఫ్ఎక్స్ మా సినిమాకు ప్రత్యేకార్షణ' అని చెప్పారు.

ఉపాధ్యాయ వృత్తి ఉద్యోగం కాదు..
భావోద్వేగం



(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో కేవలం ఒక సారి డీఎస్సీ నిర్వహించి 7,857 పోస్టులు భర్తీ చేశారని, తమ ప్రజా ప్రభుత్వం పది నెలల్లోనే 11,062 పోస్టులకు డీఎస్సీ నిర్వహించిందని తెలిపారు. ప్రతి పోస్టుకు 1:3 నిష్పత్తిలో ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేపడతామని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు అక్టోబరు 9వ తేదీన ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందజేస్తామని, ఆయా అభ్యర్థుల కుటుంబాల్లో దసరా పండగకు ముందే పండగ వాతావరణం నెలకొనేలా చేస్తామని పేర్కొన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత టెట్ నిర్వహించాలని నిరుద్యోగుల నుంచి విజ్ఞప్తి వస్తే మరోసారి టెట్ నిర్వహించామని, ఫలితంగా డీఎస్సీ రాసేందుకు అదనంగా 1,09,168 మంది అభ్యర్థులు అర్హత సాధించారని గుర్తుచేశారు. డీఎస్సీ రాత పరీక్షలను జూలై 18వ తేదీ నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు 26 సెషన్లలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) నిర్వహించినట్లు తెలిపారు. డీఎస్సీ, టెట్ నిర్వహణలో సమర్థంగా వ్యవహరించారని, బాగా కష్టపడ్డారని విద్యా శాఖ అధికారులను అభినందించారు. కాగా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా వంద నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయనున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలలు వేర్వురుగా ఉండటంతో పిల్లల్లో ఆత్మనూన్యత భావం ఏర్పడేదని, దానిని తొలగించి వారి సమగ్ర వికాసానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రతి నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో రూ.వంద కోట్లతో ఒక్కో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇప్పటికే కొడంగల్, మధిర నియోజకవర్గాల్లో ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైందని, ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కోళ్ల షెడ్లు, అద్దె గృహాల్లో వసతి గృహాలు ఏర్పాటు చేసిందని, కనీస మౌలిక వసతులు కల్పించలేదన్నారు. గత ప్రభుత్వం ఏళ్ల తరబడి టీచర్ల పదోన్నతులు, బదిలీలు చేపట్టలేదని.. తాము అధికారంలోకి వచ్చాక వివాదాలకు తావు లేకుండా 34,706 మంది టీచర్లకు బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టామని చెప్పారు.

నియామకాలే లక్ష్యంగా !

నిరుద్యోగులకు అండగా నిలవడం, ఉద్యోగ నియామకాలే లక్ష్యంగా తాము అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లోనే 30వేల ఉద్యోగాల నియామక పత్రాలు అందించామని సీఎం పేర్కొన్నారు. ఉపాధ్యాయ పోస్టల భర్తీని 65 రోజుల్లోనే పూర్తి చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రూప్ 1, 2, 3 పోస్టులను అంగడీ సరకుల్లా మార్చిన పీఎస్సీని ప్రక్షాళన చేశామన్నారు. ఎటువంటి లోపాలు లేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే గ్రూపు-1 ఫలితాలను ప్రకటించి, వారిని కూడా తెలంగాణ పున ర్ నిర్మాణంలో భాగస్వామ్యులను చేస్తామన్నారు. మొత్తంగా మొదటి ఏడాదిలోనే 60వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల సంఖ్యతో ప్రమేయం లేకుండా ప్రభుత్వ పాఠశాలలు నిర్వహిస్తామని, ఎట్టి పరిస్థితుల్లో మూసేయబోమని చెప్పారు. 317 జీవో సమస్య ప్రభుత్వ పరిశీలనలో ఉందని, ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణపై ప్రత్యేక కమిటీని వేసిన విషయాన్ని గుర్తు చేశారు. క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పారు. ఏ విభాగంలో కూడా ఖాళీ పోస్టు లేకుండా నియామకాలను చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దామోదర, తుమ్మల, పొంగులేటి, కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, విద్యా శాఖ కమిషనర్ నరసింహారెడ్డి, అదనపు డైరెక్టర్ లింగయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టీచర్ పోస్టుల వివరాలు..

పోస్టు పేరు	సంఖ్య
స్కూల్ అసిస్టెంట్	2,629
భాషా పండితులు	727
పీఈటీలు	182
సెకండరీ గ్రేడ్ టీచర్స్	6,508
స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేటర్స్)	220
సెకండరీ గ్రేడ్ టీచర్స్ (స్పెషల్ ఎడ్యుకేటర్స్)	796
మొత్తం	11,062

నేటి నుంచి ధ్రువీకరణ పత్రాల పరిశీలన

ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో భాగంగా మంగళవారం నుంచి 5వ తేదీ వరకు జిల్లాల వారీగా అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను ప్రక్రియను చేపట్టనున్నారు. ఈ మేరకు సోమవారం అధికారులు షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు సంబంధించి అభ్యర్థులకు ఈ-మెయిల్, ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం ఇస్తారు. ప్రతి పోస్టుకు ముగ్గురి చొప్పున అంటే... 1:3 నిష్పత్తిలో ఈ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను నిర్వహిస్తారు.

- సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం ప్రతి పోస్టుకు ఒక్కరి చొప్పున అంటే... 1:1 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. డీఈవోల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరుగనుంది.
- 1:1 జాబితాలో ఎంపికైన అభ్యర్థుల నుంచి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వెబ్ ఆప్షన్లను తీసుకుంటారు. ఈ వెబ్ ఆప్షన్ల ఆధారంగా పోస్టింగ్‌లను ఇస్తారు. ఆ లోపు అభ్యర్థులకు నియామక ఉత్తర్వులను జారీ చేయనున్నారు.

డీఎస్సీ వివరాలు

మొత్తం 11,062 పోస్టుల భర్తీకి 2024, ఫిబ్రవరి 29న నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ పోస్టుల కోసం మొత్తం 2,79,838 మంది అభ్యర్థులు దరఖాస్తులను చేసుకున్నారు. జూన్ 18 నుంచి ఆగస్టు 5వ తేదీల మధ్య 26 సెషన్స్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)లను నిర్వహించారు. ఈ పరీక్షలకు మొత్తం 2,46,584 మంది అభ్యర్థులు అంటే... 88.11 శాతం మంది హాజరయ్యారు. అనంతరం ప్రాథమిక కీని విడుదల చేశారు. ఈ కీపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి తుది కీని విడుదల చేశారు. ఈ తుది కీపై కూడా కొన్ని అభ్యంతరాలు నమోదయ్యాయి. దాంతో మళ్లీ ఈ అభ్యంతరాలను పరిశీలించి సోమవారం ఫలితాలను వెల్లడించారు. జిల్లాల వారీగా జనరల్ ర్యాంకుల జాబితాను ప్రకటించారు. ఈ ఫలితాలను https://schooledu.telangana.gov.in అనే వెబ్‌సైట్‌లో అభ్యర్థులు పరిశీలించుకోవచ్చు.

హన్మాజిపేటవాసికి మొదటి ర్యాంకు

వేములవాడ రూరల్, సెప్టెంబరు 30: డీఎస్సీ ఫలితాల్లో సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేట గ్రామానికి చెందిన కోడం చంద్రశేఖర్ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిషు సబ్జెక్టులో డీఎస్సీ రాసిన చంద్రశేఖర్ 77.03 మార్కులు సాధించాడు. రెండు నెలల క్రితమే గురుకుల పాఠశాలలో టీజీటీగా ఉద్యోగం సాధించారు. చంద్రశేఖర్ తల్లి కమల తండ్రి నారాయణ చేనేత కార్మికులు. రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన చంద్రశేఖర్‌ను గ్రామస్థులు, నాయకులు అభినందించారు. డీఎస్సీ ఫలితాల్లో తనకు మంచి మార్కులు రావడం సంతోషంగా ఉందని చంద్రశేఖర్ చెప్పారు. పరీక్ష కోసం ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకుంటూ రోజుకు 18 గంటలు చదివినానని.. తాను పడ్డ కష్టానికి ఫలితం దక్కిందని పేర్కొన్నారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధం

» ఫైల్‌పై ముఖ్యమంత్రి రేవంత్ సంతకం

హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం సన్నద్ధమైంది. ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన ఫైల్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపినట్లు తెలిసింది. దశాబ్దాలుగా ఒకే శాఖలో పాతుకుపోయిన ఉద్యోగులను ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక కూడా బదిలీలు చేయకపోవడం, దీర్ఘకాలంగా కొంతమంది ప్రాధాన్యత ఉన్న విభాగాల్లోనే కొనసాగడంపై ఉద్యోగుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఈ పరిస్థితిని చక్కదిద్దాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన ఫైల్‌పై సీఎం సంతకం చేయడంతో దీనిపై జీఏడీ సర్వీసెస్ ముఖ్యకార్యదర్శి మహేశ్‌దత్ ఎక్కా కసరత్తు చేస్తున్నారు. ఉద్యోగులను మూడు విభాగాలుగా విభజించి బదిలీలు చేయనున్నట్లు తెలిసింది. ఫోకల్, నాన్ ఫోకల్, సెమీ ఫోకల్ ప్రాతిపదికన శాఖలను విభజించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, విద్య, పురపాలక, నీటిపారుదల వంటి శాఖలను ఫోకల్ కేటగిరీ కింద, అన్ని సంక్షేమ శాఖలు, జీఏడీ, ప్లానింగ్ వంటివి నాన్ ఫోకల్‌గా, పాఠశాల విద్య, కార్మిక శాఖ, వ్యవసాయం, యూత్ సర్వీసెస్ వంటివి సెమీ ఫోకల్‌గా పేర్కొంటూ కేటగిరీ చేశారు. కాగా, సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి మంగళ, బుధవారాల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని ఉన్నతాధికారుల సమాచారం. తొలుత సెక్షన్ అధికారులను బదిలీ చేస్తారు. 150 మందికిపైగా ఉన్న ఈ క్యాడర్‌లో చాలా మందికి పదేళ్లుగా ఎలాంటి బదిలీలు జరగలేదు. వీరి తరువాత మిగిలిన క్యాడర్ల అధికారుల బదిలీలు ఉండే అవకాశం ఉంది. ఇప్పటికే శాఖల వారీగా దీర్ఘకాలం పని చేసిన వారి వివరాలను సేకరించిన జీఏడీ సర్వీసెస్ విభాగం ఆ వివరాల ఆధారంగా బదిలీల ఉత్తర్వులు విడుదల చేసే అవకాశం ఉందని ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది.

బాలికపై అత్యాచారం ఘటనలో..
రెండో రోజూ గ్రామంలో ఉద్రిక్తత

» నిందితుడి ఇంటిపై దాడి చేసిన వారి అరెస్టు

» పోలీసు వాహనాన్ని అడ్డుకున్న గ్రామస్థులు

చేర్యాల, సెప్టెంబరు 30 : బాలికపై అత్యాచారం జరిగిందని ఆందోళనలు చెలరేగిన గ్రామంలో రెండో రోజూ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిందితుడి ఇంటికి నిప్పు పెట్టి, వాహనాలను ధ్వంసం చేశారని పలువురిపై కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ పేరిట సోమవారం ఉదయం కొంత మందిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని ఆ గ్రామంలో మరోసారి అలజడి రేగింది. చిన్నారిపై ఓ దుర్మార్గుడు లైంగిక దాడి జరపాడన్న ఆవేదనలో ఆందోళ చేపట్టామని.. కానీ, బాధితులకు అండగా నిలిచిన వారిపై కేసు నమోదు చేయడం సబబుకాదని గ్రామస్థులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. నిందితులకు సహకరిస్తూ తమకు అన్యాయం చేయడం ఏంటని ప్రశ్నించారు. గ్రామస్థులను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న వాహనాన్ని కదలనివ్వలేదు. దీంతో ఊరిలో ఉద్రిక్తత నెలకొంది. పోలీసు అధికారులు గ్రామస్థులతో మాట్లాడి నచ్చచెప్పారు. తమకు కొంత సమయం ఇవ్వాలని, దాడికి పాల్పడిన వారిని తామే స్టేషన్‌కు తీసుకువస్తామని గ్రామస్థులు చెప్పడంతో.. పోలీసులు వారిని వదిలిపెట్టారు. ఉద్రిక్తతల నేపథ్యంలో ఆ గ్రామంలో పోలీసు పికెటింగ్ కొనసాగుతోంది. బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఉన్మాదిని కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు కత్తుల లక్ష్మి డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించారు.

కొత్త నేర న్యాయ చట్టాలను వద్దు: ఐఎఫ్‌టీయూ

కవాడిగూడ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఐపీసీ, సీఆర్పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌ల స్థానంలో కొత్తగా తీసుకువచ్చిన మూడు నేర న్యాయ చట్టాలు, లేబర్ చట్టాలకు చేసిన నాలుగు సవరణలను వెంటనే ఉపసంహరించుకోవాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కొత్త లేబర్ చట్టాలను రాష్ట్రంలో అమలు చేయబోమని అసెంబ్లీ ద్వారా ఒక తీర్మానాన్ని చేసి కేంద్రానికి పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, కొత్త నేర, కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఐఎఫ్‌టీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఏసీబీకి చిక్కిన పశువైద్యాధికారి

» నల్లగొండ జిల్లా చింతపల్లిలో ఘటన



లంచం తీసుకుంటూ పట్టుబడిన జోసఫ్‌పాల్

చింతపల్లి, సెప్టెంబరు 30: గేదెలకు బీమా వర్తింపజేసే ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు రూ.6 వేలు లంచం తీసుకున్న పశువైద్యాధికారిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అరెస్టు చేశారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం నసర్లపల్లికి చెందిన రైతులు రాశిక వినోద్‌కుమార్, కుమార్‌లకు ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీపీ) కింద ఎనిమిది గేదెల కొనుగోలుకు రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ తరుణంలో వారు గేదెలకు బీమా వర్తింపజేసే ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని మండల పశువైద్యాధికారి జోసఫ్ పాల్‌ను కోరారు. అందుకు ఆయన రూ.8 వేలు డిమాండ్ చేశారు. రూ. 6వేలు ఇచ్చేందుకు అంగీకరించిన రైతులు.. ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి సూచన మేరకు సోమవారం రైతులు.. ఆ నగదును జోసఫ్ పాల్‌కు ఇవ్వగా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, అరెస్టు చేసినట్లు నల్లగొండ ఏసీబీ డీఎస్పీ జగదీశ్ చంద్ర తెలిపారు.

పాలడుగు హెచ్‌ఎం రిమాండ్, సస్పెన్షన్

» విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనలో చర్యలు

వైరా, సెప్టెంబరు 30: విద్యార్థినులను లైంగికంగా వేధించిన కేసులో పాలడుగు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చావా శ్రీనివాసరావును ఖమ్మం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తమపై శ్రీనివాసరావు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని శనివారం కొందరు విద్యార్థినులు వారి తల్లిదండ్రులు, గ్రామస్థులతో కలిసి పాఠశాల వద్ద ఆందోళన చేసి ప్రధానోపాధ్యాయుడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో ఆయనపై పోక్సో, అట్రాసిటీ కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి శ్రీనివాసరావును పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. సంఘటనపై పాఠశాలలో విచారణ నిర్వహించిన డీఈవో ఇచ్చిన నివేదికతో శ్రీనివాసరావును సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

కుటుంబం ఫొటో తీసుకోవడం..
ఒక ఆప్షన్ మాత్రమే

» ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై 3 నుంచి క్షేత్ర స్థాయి పరిశీలన

» మొత్తం 238 ప్రాంతాల్లో ఐదు రోజుల పాటు ప్రక్రియ

» పొరపాట్లకు తావివ్వొద్దు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి సంబంధించి.. 119 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి పరిశీలనను సమర్థంగా చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రతి నియోజకవర్గం పరిధిలో ఒక పట్టణ, ఒక గ్రామీణ ప్రాంతాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఒక వేళ పూర్తిగా పట్టణ/నగర నియోజకవర్గమైతే రెండు వార్డులు లేదా డివిజన్లు, పూర్తిగా గ్రామీణ నియోజకవర్గమైతే రెండు గ్రామాల్లో (మొత్తం 238 ప్రాంతాల్లో) క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. వార్డులు/డివిజన్లలో జనాభా ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పరిశీలన బృందాల సంఖ్యను పెంచుకోవాలన్నారు. తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డులకు సంబంధించి సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పైలట్ ప్రాజెక్టు, సేకరించే వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. 119 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనున్న గ్రామాలు, వార్డులు/ డివిజన్ల ఎంపిక ఇప్పటికే పూర్తయిందని వెల్లడించారు. పైలట్ ప్రాజెక్టును ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారని సీఎం ప్రశ్నించగా.. అక్టోబరు 3 నుంచి 7వ తేదీ వరకు చేపడతామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కుటుంబ సభ్యులందరూ సమ్మతిస్తేనే కుటుంబం ఫొటో తీయాలని, అదో ఆప్షనల్‌గానే ఉండాలని స్పష్టం చేశారు. కుటుంబం సమ్మతి లేకుంటే ఫొటో తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. క్షేత్ర స్థాయి పరిశీలనపై ఉమ్మడి జిల్లాలకు ఉన్న నోడల్ అధికారులు కలెక్టర్లకు మార్గనిర్దేశం చేయాలని, అప్పుడే పకడ్బందీగా కార్యక్రమం కొనసాగుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం వద్ద ఉన్న రేషన్ కార్డు, పింఛన్, స్వయం సహాయక సంఘాలు, రైతు భరోసా, రుణమాఫీ, ఆరోగ్య శ్రీ తదితర డేటాల ఆధారంగా ఇప్పటికే కుటుంబాల గుర్తింపునకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిందని, పైలట్ ప్రాజెక్టులో దానిని నిర్ధారించుకుంటామని అధికారులు వివరించగా.. పకడ్బందీగా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఎటువంటి పొరపాట్లకు తావివ్వవద్దని హెచ్చరించారు. పైలట్ ప్రాజెక్టుతో ఎదురయ్యే ఇబ్బందులు, సానుకూలతలతో ఓ నివేదిక తయారు చేయాలని సూచించారు. ఆ నివేదికపై చర్చించి లోపాలను సవరించిన తర్వాతే.. పూర్తి స్థాయిలో క్షేత్రస్థాయి పరిశీలన చేపడదామన్నారు. సమీక్షలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో ఓబీసీ రిజర్వేషన్లు ఉండాలి: శ్రీనివాస్‌గౌడ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): చట్టసభలలో ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని బీఆర్ఎస్ మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు అమలైతేనే ఓబీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. సోమవారం ఢిల్లీలో ఆయన మాట్లాడారు. దేశంలో 60-70 కోట్ల జనాభా ఉన్న ఓబీసీలకు రాజకీయంగా తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తెలంగాణలో వెంటనే కులగణన చేపట్టాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42% రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సోదర సమానుడు.. నూలు దండ వేస్తే తప్పా?

సోషల్‌మీడియాలో అసభ్యంగా ట్రోల్ చేస్తారా?.. కన్నీళ్లు పెట్టుకున్న కొండా సురేఖ

» బీఆర్ఎస్ ట్రోలింగ్‌ను క్షమించబోమంటూ ఫైర్

» కేటీఆర్‌ను బట్టలు విప్పించి ఉరికిస్తమని హెచ్చరిక

» సురేఖ గారు.. అసౌకర్యానికి చింతిస్తున్నా: హరీశ్



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్/బంజారాహిల్స్/సిద్దిపేటకల్చరల్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తాను మెదక్ వెళ్లినప్పుడు.. చేనేత కార్మికుల సమస్యలను చెబుతూ.. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు గౌరవ సూచకంగా తనకు ఒక నూలు దండ వేస్తే.. దాన్ని బీఆర్ఎస్ సోషల్ మీడియా అసభ్యకరంగా ట్రోల్ చేసిందంటూ మంత్రి కొండా సురేఖ కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ ట్రోలింగ్ చూసి గడిచిన రెండ్రోజులుగా తనకు అన్నం సహించడం లేదని, నిద్ర పట్టట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేటీఆర్, హరీశ్‌రావు ఇంట్లో ఆడవాళ్లపైనా ఇలాంటి ట్రోలింగ్ చేస్తే వారికెలా ఉంటుందని ప్రశ్నించారు. రఘునందన్‌రావు తనకు సోదర సమానుడని, ఆయన తనకు ఫోన్ చేసి బాధపడ్డారని వెల్లడించారు. తనపై అసభ్యకరంగా పెట్టిన పోస్టులో డీపీ హరీశ్‌రావుది ఉందన్నారు. తనపైన జరిగిన ట్రోలింగ్‌కు హరీశ్, కేటీఆర్‌లు క్షమాపణ చెప్పాలన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా ద్వారా ఇకపైన ఇలా ట్రోలింగ్‌లు చేస్తే క్షమించేది లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు.. కేటీఆర్ బట్టలు విప్పించి బజారున ఉరికిస్తరని హెచ్చరించారు. తనపై అసభ్యకరంగా పెట్టిన పోస్టుపైన సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశామని, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికీ తీసుకెళ్లామని చెప్పారు. కాగా.. మీడియా సమావేశం ముగిసేలోపు సురేఖ పలుమార్లు భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. ఇటు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ స్పందిస్తూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ నేతలపైన సోషల్ మీడియా ద్వారా బీఆర్ఎస్ నేతలు దాడులు చేస్తున్నారని, ఈ వర్గాలు కన్నెర్ర చేస్తే వారెక్కడుంటారని ప్రశ్నించారు. సురేఖపై పోస్టులను కేటీఆర్ ఎందుకు ఖండించలేదని నిలదీశారు. కాగా, కొండా సురేఖపై ట్రోలింగ్‌లను నిరసిస్తూ తెలంగాణ భవన్ ముట్టడికి కాంగ్రెస్ ఇచ్చిన పిలుపు ఉద్రిక్తతకు దారి తీసింది. తెలంగాణ భవన్ వద్ద దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించిన కాంగ్రెస్ కార్యకర్తలను బీఆర్ఎస్ నేతలు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

వికృత చేష్టలను ఖండిస్తున్నా..: హరీశ్

సోషల్ మీడియాలో మంత్రి కొండా సురేఖను ట్రోల్ చేయడం, ఆమె కన్నీళ్లు పెట్టుకోవడంపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. 'కొండా సురేఖ గారు.. మీకు కలిగిన అసౌకర్యానికి నేనూ చింతిస్తున్నాను. సోషల్ మీడియా వేదికగా జరిగే ఈ వికృత చేష్టలను ఖండిస్తున్నా' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు. మహిళలను గౌరవించటం మనందరి బాధ్యత, వారి పట్ల అగౌరవంగా ప్రవర్తిస్తే ఏ ఒక్కరు కూడా సహించబోరని స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ అయినా.. వ్యక్తిగతంగా తానైన ఉపేక్షించేది లేదన్నారు. సోషల్ మీడియాలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

మూడో త్రైమాసికంలో 7,400 కోట్ల అప్పు

బహిరంగ మార్కెట్ నుంచి ప్రభుత్వం సేకరించే రుణాలివి

హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మూడో త్రైమాసికంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.7,400 కోట్ల మేర అప్పు తీసుకోవాలని నిర్ణయించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించే ఈ-వేలం ద్వారా ఈ బహిరంగ మార్కెట్ రుణాలను తీసుకోనుంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం వచ్చే మూడు నెలల్లో తీసుకునే రుణాల వివరాలను ఆర్‌బీఐ ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబరు 30 నాటికి రెండు త్రైమాసికాలు గడిచిపోయాయి. అక్టోబరు 1 నుంచి మూడో త్రైమాసికం(అక్టోబరు-నవంబరు-డిసెంబరు) ప్రారంభం కాబోతోంది. ఈ మూడు నెలల కాలంలో బహిరంగ మార్కెట్ నుంచి రూ.7,400 కోట్ల అప్పును సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అక్టోబరు 1న రూ.2000 కోట్లు, 8న రూ.1400 కోట్లు, 22న రూ.1000 కోట్లు, నవంబరు 5న రూ.1000 కోట్లు, 26న రూ.1000 కోట్లు, డిసెంబరు 17న రూ.1000 కోట్ల చొప్పున... మొత్తం రూ.7,400 కోట్ల రుణాలు తీసుకుంటామని వెల్లడించింది. అక్టోబరులో కాస్త ఎక్కువగా రూ.4,400 కోట్లు తీసుకుంటున్నా.. నవంబరులో రూ.2000 కోట్లు, డిసెంబరులో కేవలం రూ.1000 కోట్లు మాత్రమే తీసుకుంటుండడం గమనార్హం. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు నాటికి రూ.29,449కోట్ల అప్పు తీసుకుంది. ఈసారి బహిరంగ మార్కెట్ నుంచి రూ.49,255కోట్ల రుణాలు తీసుకుంటామని బడ్జెట్‌లో పొందుపర్చింది.

కృష్ణాలో ప్రాజెక్టుల అనుమతుల కోసం డీపీఆర్‌లు

కేంద్ర జలవనరుల సంఘంలో సమర్పించే యోచన.. డీపీఆర్‌లకు తుది రూపు ఇచ్చే పనిలో సర్కారు

హైదరాబాద్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్ పరిధిలోని అన్ని ప్రాజెక్టుల సమగ్ర ప్రాజెక్టు నివేదికలు(డీపీఆర్‌లు) కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)లో అనుమతుల కోసం దాఖలు చేసి, ట్రైబ్యునల్‌లో ఆయా ప్రాజెక్టుల నీటి కేటాయింపుల కోసం పట్టుబట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. కృష్ణా జలాల పంపిణీ కోసం జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ విచారణ జరుగుతుండటంతో రాష్ట్రంలో బేసిన్ పరిధిలో ఉన్న వివిధ ప్రాజెక్టుల డీపీఆర్‌లకు తుదిరూపు ఇచ్చి, సమర్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటికే కీలకమైన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్ సీడబ్ల్యూసీ పరిశీలనలో ఉంది. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంకు కెనాల్, డిండి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, భక్తరామదాసు ఎత్తిపోతల పథకం, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం, నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకం, జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం, ఎలిమినేటి మాధవరెడ్డి ఎత్తిపోతల పథకాల డీపీఆర్‌లకు తుది రూపు ఇచ్చి, అనుమతుల కోసం సీడబ్ల్యూసీలో దాఖలు చేసే యోచనతో ఉంది. కృష్ణాలో ఇప్పటికే పూర్తయిన, నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదించిన ప్రాజెక్టులకు నీటి పంపిణీ చేయాలని నిర్దేశిస్తూ జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్‌కు విచారణ విధి విధానాలు కేంద్రం జారీ చేసింది. నవంబరు నుంచి విచారణ ప్రక్రియలో భాగంగా క్రాస్ ఎగ్జామినేషన్ ప్రారంభం కానుంది. మరోవైపు 2021 జూలై 15వ తేదీన కృష్ణా, గోదావరి బేసిన్ పరిధిలో అనుమతి ప్రాజెక్టుల జాబితాను కేంద్రం విడుదల చేసింది. అయితే వీటికి గెజిట్ జారీ చేసిన ఆరు నెలల లోపు అనుమతులు తెచ్చుకోవాలని, లేనిపక్షంలో ఆయా ప్రాజెక్టులను పక్కన పెట్టాలని కేంద్రం నిర్దేశించింది. దీని ప్రకారం గోదావరిలో నీటి పంపకాలపై వివాదాలు లేకపోవడంతో దాదాపు అన్ని ప్రాజెక్టుల డీపీఆర్‌లు తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసింది. గోదావరి బేసిన్‌లో దాఖలు చేసిన డీపీఆర్‌లలో సీతారామ ఎత్తిపోతల పథకం-సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు, సమ్మక్కసాగర్ ప్రాజెక్టు, డాక్టర్ అంబేద్కర్ వార్ధా ఎత్తిపోతల పథకం డీపీఆర్‌లు మాత్రమే సీడబ్ల్యూసీలో పెండింగ్‌లో ఉన్నాయి. కృష్ణాలో 90టీఎంసీల సామర్థ్యంతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల డీపీఆర్ ఒక్కటే దాఖలు చేశారు.

గోదావరిలో 4561.. కృష్ణాలో 3048 టీఎంసీలు

గోదావరి, కృష్ణా నదుల్లో ఏటా సగటు నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ నివేదిక ఇచ్చింది. గోదావరిలో ఏటా 4561 టీఎంసీలు, కృష్ణాలో 3048 టీఎంసీల నీటి లభ్యత ఉందని లెక్క తేల్చింది. ఈ మేరకు సీడబ్ల్యూసీ ఇటీవల నివేదికను విడుదల చేసింది. గోదావరిలో 1985-86 నుంచి 2022-23 వరకు ఏటా సగటున 4561.60 టీఎంసీల నీటి లభ్యత ఉందని వెల్లడించింది. అలాగే, కృష్ణా బేసిన్‌లో 1985-86 నుంచి 2022-23 దాకా వరద ఆధారంగా ఏటా సగటున 3,048.37 టీఎంసీల నీటి లభ్యత ఉన్నట్లు సీడబ్ల్యూసీ గుర్తించింది. కృష్ణాలో 75 శాతం (ప్రతి నాలుగేళ్లలో కచ్చితంగా మూడేళ్ల పాటు వచ్చే వరద)ఆధారంగా బచావత్ ట్రైబ్యునల్ (కృష్ణా-1) 2130 టీఎంసీల లభ్యత ఉందని తేల్చితే.. బ్రిజేష్ ట్రైబ్యునల్ (కృష్ణా-2) 2173 టీఎంసీల లభ్యత ఉన్నట్లు గుర్తించింది. ఈ రెండు ట్రైబ్యునళ్లు తేల్చినదానికంటే ఏటా 875 టీఎంసీల లభ్యత అధికంగా ఉన్నట్లు సీడబ్ల్యూసీ లెక్కలు చెబుతున్నాయి. అయితే 50ఏళ్ల లేదా వందేళ్ల ప్రవాహాల ఆధారంగా లెక్కలు తీస్తేనే కచ్చితమైన వివరాలు వస్తాయని అధికారులు పేర్కొటున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు

» చెల్లించకుంటే సచివాలయ ముట్టడి

» బీసీ విద్యార్థులకు ఆర్ కృష్ణయ్య పిలుపు



ఇందిరాపార్కు వద్ద ధర్నాలో మాట్లాడుతున్న కృష్ణయ్య, వేముల రామకృష్ణ

కవాడిగూడ, సెప్టెంబర్ 30(ఆంధ్రజ్యోతి): రూ.4,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కళాశాల విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని ఎడల సచివాలయాన్ని ముట్టడించడంతో పాటు రాష్ట్రాన్ని నిర్బంధిస్తామని ఆయన హెచ్చరించారు. అలాగే స్కాలర్‌షిప్ నిధులను పెంచి విడుదల చేయకపోతే రాష్ట్రంలో మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ అడ్డుకొని నిరసనలు చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కళాశాల విద్యార్థుల పూర్తి ఫీజులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇందిరాపార్కు వద్ద బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, బీసీ ఫ్రంట్ చైర్మన్ గొరిగె మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాకు ఆర్ కృష్ణయ్య హాజరై మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిగ్రీ, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో వారు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ వైపు పాసైనా సర్టిఫికెట్లు రాక, పై చదువులకు వెళ్లలేక విద్యార్థులు, మరోవైపు అధ్యాపకులకు జీతాలు, భవనాలకు అద్దెలు చెల్లించలేక యాజమాన్యాలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇతర రాష్ట్రాల్లో సంవత్సరానికి రూ.20వేలు, రూ.15వేలు స్కాలర్‌షిప్‌లు ఇచ్చి విద్యార్థులకు పెద్ద పీట వేస్తోంటే, మన రాష్ట్రంలో రూ. 5,500 స్కాలర్‌షిప్ ఇస్తూ చేతులు దులుపుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి, స్కాలర్‌షిప్‌లను పెంచి, రీయింబర్స్‌మెంట్ నిధులు కూడా విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, వివిధ కళాశాలల విద్యార్థులు, బీసీ సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

కనీస పెట్టుబడి రూ.10 లక్షలు



అధిక రిస్క్ తీసుకోగలిగే వారి కోసం సరికొత్త ఇన్వెస్ట్‌మెంట్ సాధనం

ఆమోదం తెలిపిన సెబీ బోర్డు

ముంబై: క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ కేంద్ర బోర్డు సోమవారం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అధిక రిస్క్ తీసుకోగలిగే హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (హెచ్‌ఎన్ఐ) కోసం సరికొత్త అసెట్ క్లాస్‌ను ప్రవేశ పెట్టేందుకు సెబీ బోర్డు ఆమోదం తెలిపింది. ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీస్ పేరుతో పిలిచే ఈ అసెట్ క్లాస్‌లో కనీస పెట్టుబడి పరిమితి రూ.10 లక్షలుగా ఉండనుంది. అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు హెచ్‌ఎన్ఐల కోసం లాంగ్-షార్ట్ ఈక్విటీ వంటి అధిక రిస్క్ వ్యూహాలతో కూడిన పెట్టుబడి పథకాలను ఆఫర్ చేయవచ్చని నియంత్రణ మండలి తన ప్రకటనలో ప్రస్తావించింది. సరికొత్త అసెట్ క్లాస్ విడుదలపై ప్రజాభిప్రాయం కోరుతూ సెబీ ఈ జూలైలో చర్చాపత్రాన్ని విడుదల చేసింది. ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉన్న మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) పథకాలు, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సేవలకు (పీఎంఎస్) మధ్య అంతరాన్ని పూడ్చడమే ఈ పెట్టుబడి సాధనం ముఖ్య ఉద్దేశం. సెబీ ఛైర్‌పర్సన్ మాధవి పురి బుచ్‌పై అమెరికన్ మార్కెట్ రీసెర్చ్, షార్ట్ సెల్లింగ్ కంపెనీ హిండెన్‌బర్గ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ పలు ఆరోపణలు చేసిన నేపథ్యంలో జరిగిన తొలి బోర్డు సమావేశమిదే. ఈ భేటీ అనంతరం ప్రకటించిన మరిన్ని ముఖ్య నిర్ణయాలు..

ఎంఎఫ్ లైట్ ఫ్రేమ్‌వర్క్: పాసివ్ ఫండ్ల కోసం సడలించిన మ్యూచువల్ ఫండ్ లైట్ (ఎంఎఫ్ లైట్) ఫ్రేమ్‌వర్క్‌ను సైతం సెబీ ఆమోదించింది. ఇందులో భాగంగా ఫండ్ స్పాన్సర్ల నెట్‌వర్త్, ట్రాక్ రికార్డ్, లాభదాయకత, ట్రస్టీల బాధ్యత, ఆమోద ప్రక్రియ, సమాచార వెల్లడి వంటి పలు అర్హత నిబంధనలను సడలించింది. ఈ వ్యాపారంలోకి తేలికగా ప్రవేశించేందుకు వీలు కల్పించడంతో పాటు కొత్త వారిని ప్రోత్సహించడం, నిబంధనల భారాన్ని తగ్గించడం, ఈ ఫండ్ల వ్యాప్తితో పాటు మార్కెట్లో ద్రవ్య లభ్యత పెంచడం, పెట్టుబడుల వివిధీకరణ, ఆర్థికావిష్కరణలను ప్రోత్సహించడమే ఈ ఫ్రేమ్‌వర్క్ ప్రధానోద్దేశం.

బ్లాక్ డీల్.. టీ+0 సెటిల్‌మెంట్: ఆప్షనల్ టీ+0 సెటిల్‌మెంట్‌లో ట్రేడింగ్ అర్హత కలిగిన కంపెనీల షేర్ల సంఖ్యను సెబీ దశలవారీగా టాప్ 25 (మార్కెట్ క్యాప్‌పరంగా) నుంచి టాప్ 500కు పెంచనుంది. రిజిస్టర్డ్ స్టాక్ బ్రోకర్లందరూ తమ ఇన్వెస్టర్లకు టీ+0 సెటిల్‌మెంట్ విధానానికి ప్రవేశం కల్పించవచ్చు.

ఇక వేగంగా రైట్స్ ఇష్యూలు: కంపెనీ బోర్డు ఆమోదం తెలిపిన తేదీ నుంచి 23 పని దినాల్లో రైట్స్ ఇష్యూను పూర్తి చేయవలసి ఉంటుంది. ప్రస్తుతం రైట్స్ ఇష్యూ పూర్తికి సగటున 317 రోజుల సమయం పడుతోంది.

డిస్క్లోజర్లకు మరింత సమయం: మార్కెట్ ట్రేడింగ్ సమయం ముగిశాక పూర్తయ్యే బోర్డు సమావేశ నిర్ణయాలను వెల్లడించేందుకు కంపెనీలకు ప్రస్తుత 30 నిమిషాలకు బదులు అదనంగా 3 గంటల సమయం లభించనుంది. అలాగే, లిటిగేషన్లు, వివాదాలకు సంబంధించిన సమాచారాన్ని వెల్లడించేందుకు ప్రస్తుత 24 గంటలకు బదులుగా 72 గంటల సమయం లభించనుంది. కంపెనీల సమాచార వెల్లడి ప్రక్రియను సులభతరం చేసేందుకు సెబీ సింగిల్ ఫైలింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది.

ఇన్‌సైడర్ ట్రేడింగ్

నియంత్రణ మండలి ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిషేధ నియమావళిలో కనెక్టెడ్ పర్సన్ పరిధిని మరింత విస్తరించింది. తద్వారా మరింత మంది ఈ నిబంధనల పరిధిలోకి రానున్నారు.

ట్రేడింగ్‌లో సొమ్ము బదిలీకి మరో ఆప్షన్

ప్రస్తుత ట్రేడింగ్ విధానానికి అదనంగా, స్టాక్ బ్రోకర్లు క్లయింట్లకు యూపీఐ బ్లాక్ మెకానిజం ద్వారా తమ ఖాతాలోని సొమ్మును బ్లాక్ చేసుకోగలిగే వెసులుబాటుతో పాటు 3 ఇన్ 1 ట్రేడింగ్ అకౌంట్ సౌకర్యాన్ని కల్పించాలి. 2025 ఫిబ్రవరి 1 నుంచి ఈ కొత్త నిబంధన అమల్లోకి రానుంది.

డెరివేటివ్స్ ఊసే లేదు..

ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) విభాగంలో రిటైల్ మదుపరుల పాత్రను తగ్గించేలా ఈసారి బోర్డు సమావేశంలో సెబీ పలు సంస్కరణలు చేపట్టవచ్చని విశ్లేషకులు భావించారు. కానీ, నియంత్రణ మండలి ఇందుకు సంబంధించి ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం. ఎఫ్ అండ్ ఓలో ట్రేడింగ్ నెరుపుతున్న ప్రతి పది మంది రిటైల్ మదుపరులలో 9 మంది నష్టపోతున్నారని ఈమధ్యనే సెబీ అధ్యయన నివేదికను విడుదల చేసింది. అంతేకాదు, ఎఫ్ అండ్ ఓల్లో రిటైల్ మదుపరుల పాత్ర పెరగడంపై సెబీ చీఫ్ బుచ్‌తోపాటు పలువురు గతంలో ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

మార్కెట్ మండేన్



స్టాక్ సూచీల భారీ పతనం

సెన్సెక్స్ 1,272 పాయింట్లు డౌన్

26,000 దిగువకి నిఫ్టీ

రూ.3.57 లక్షల కోట్లు ఆవిరి

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు సోమవారం భారీగా క్షీణించాయి. ఇజ్రాయెల్-హిజ్బుల్లా మధ్య యుద్ధం తీవ్రతరం కావడం, జపాన్ మార్కెట్ పతనం నేపథ్యంలో దేశీయంగా ఇన్వెస్టర్లు రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు బ్యాంకింగ్, ఫైనాన్స్, వాహన రంగ షేర్లలో పెద్దఎత్తున లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను చైనా ఈక్విటీల్లోకి మళ్లిస్తుండటం, చాలా షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతున్నాయన్న ఆందోళనలు మన మార్కెట్‌ను మరింత కుంగదీశాయని ఈక్విటీ విశ్లేషకులు పేర్కొన్నారు. దాంతో సెన్సెక్స్ 1,272.07 పాయింట్లు (1.49 శాతం) కోల్పోయి 84,299.78 వద్దకు జారుకుంది. నిఫ్టీ 368.10 పాయింట్ల(1.41 శాతం) నష్టంతో 25,810.85 వద్ద ముగిసింది. గడిచిన రెండు నెలల్లో సూచీకిదే అతిపెద్ద పతనం. అమ్మకాలు పోటెత్తడంతో ఈక్విటీ మార్కెట్ వర్గాల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.57 లక్షల కోట్లు తగ్గి రూ.474.35 లక్షల కోట్లకు (5.66 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 25 నష్టపోయాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 3.23 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది.

ఐపీఓకు డాక్టర్ అగర్వాల్స్ హెల్త్ కేర్

రూ.3,000-3,500 కోట్ల సమీకరణ లక్ష్యం

కంటి వైద్య సేవలందించే డాక్టర్ అగర్వాల్స్ హెల్త్ కేర్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు రాబోతోంది. ఇందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా సంస్థ రూ.300 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 6.95 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా సంస్థ మొత్తం రూ.3,000-3,500 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది.

కోరమాండల్ హై-టెక్ పాలీహౌస్

కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్.. సిద్దిపేట జిల్లా శామీర్‌పేట్‌లోని ఆర్ అండ్ డీ పార్క్‌లో హై-టెక్ పాలీహౌస్‌ను ప్రారంభించింది. ఈ పాలీ హౌస్ ప్రారంభంతో ప్రెసిషన్ అగ్రికల్చర్ రీసెర్చ్‌తో పాటు కొత్త ఉత్పత్తులను మరింతగా అభివృద్ధి చేసే అవకాశం లభిస్తుందని సంస్థ ఎండీ, సీఈఓ ఎస్ శంకరసుబ్రమణియన్ తెలిపారు. సరికొత్త టెక్నాలజీతో ఏర్పాటు చేసిన ఈ పాలీ హౌస్‌లో ఇన్నోవేటివ్ అగ్రి-ఇన్‌పుట్స్, సొల్యూషన్స్‌లో అడ్వాన్స్‌డ్ ఫీల్డ్ ట్రయల్స్‌ను నిర్వహించవచ్చని ఆయన చెప్పారు.

ఇక ఫ్లిప్‌కార్ట్‌లో జావా యజ్డీ బైక్‌లు

జావా యజ్డీ మోటారుసైకిళ్లు ఇప్పుడు ఈ-కామర్స్ పోర్టల్ ఫ్లిప్‌కార్ట్‌లో కూడా అందుబాటులో ఉంటాయి. ఉభయ సంస్థలు ఈ మేరకు ఒక అంగీకారం కుదుర్చుకున్నాయి. జావా డిజిటల్ వ్యూహంలో భాగంగా ఈ బైక్‌లను ఫ్లిప్‌కార్ట్‌లో ప్రవేశపెట్టింది. దీని ద్వారా ఫ్లిప్‌కార్ట్ కస్టమర్లకు నోకాస్ట్ ఈఎంఐతో పాటు ఆకర్షణీయమైన రుణ సహాయ సొల్యూషన్లు అందుబాటులోకి రానున్నాయి.

సోనీ బ్రావియా సరికొత్త టీవీలు



బ్రాండ్ అంబాసిడర్‌గా ఎస్ఎస్ రాజమౌళి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సోనీ ఇండియా మార్కెట్లోకి బ్రావియా శ్రేణిలో సరికొత్త స్మార్ట్ టీవీలను తీసుకువచ్చింది. సోమవారం నాడిక్కడ జరిగిన కార్యక్రమంలో సోనీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ నయ్యర్, టాలీవుడ్ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి ఈ టీవీలను లాంఛనంగా మార్కెట్లోకి విడుదల చేశారు. సినిమా ఈజ్ కమింగ్ హోమ్ కాన్సెప్ట్‌తో 2024 బ్రావియా 7,8,9 సిరీస్‌తో పాటు 3 సిరీస్ టీవీలను తీసుకువచ్చినట్లు కంపెనీ ఎండీ సునీల్ నయ్యర్ తెలిపారు. అంతేకాకుండా బ్రావియా స్మార్ట్ టీవీల కోసం ప్రత్యేకంగా టాలీవుడ్ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళిని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నట్లు ఆయన వెల్లడించారు. టీవీ, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో ప్రీమియమైజేషన్ ట్రెండ్ రోజురోజుకు పెరిగిపోతోందని, అందుకు తగ్గట్టుగానే తాము ఈ కొత్త శ్రేణి టీవీలను తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం 55 అంగుళాల విభాగంలో సోనీ వాటా 35 శాతంగా ఉండగా 65, 75, 85 అంగుళాల టీవీ విభాగంలో కంపెనీ వాటా వరుసగా 36 శాతం, 45 శాతం, 49 శాతం వాటా కలిగి ఉందని తెలిపారు.

డాక్టర్ రెడ్డీస్ చేతికి హేలియన్ బ్రాండ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హేలియాన్ పీఎల్‌సీకి చెందిన నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ (ఎన్ఆర్‌టీ) విభాగంలోని కన్స్యూమర్ హెల్త్‌కేర్ బ్రాండ్లన్నింటి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసినట్టు డాక్టర్ రెడ్డీస్ ప్రకటించింది. హేలియాన్ గ్రూప్ నుంచి స్విట్జర్లాండ్‌లోని తమ అనుబంధ సంస్థ డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ ఎస్ఏ ఈ షేర్లన్నింటినీ 45.8 కోట్ల పౌండ్లకు కొనుగోలు చేసిందని, ఆ సొమ్ము చెల్లించడం కూడా జరిగిపోయిందని తెలిపింది. దీంతో ఆ సంస్థ అనుబంధ విభాగాలైన నార్త్ స్టార్ ఆప్కో, నార్త్‌స్టార్ స్వీడన్ ఏబీ (స్వీడన్) తక్షణం తమ సంపూర్ణ యాజమాన్య విభాగాలుగా మారిపోయినట్టు పేర్కొంది.

పడకేసిన పారిశ్రామికం

ఆగస్టులో మైనస్ 1.8 శాతం వృద్ధి నమోదు

న్యూఢిల్లీ: పారిశ్రామికోత్పత్తికి కీలకమైన ఇన్‌ఫ్రా రంగం ఆగస్టు నెలలో పడకేసింది. ఎరువులు, ఉక్కు మినహా మిగతా ఆరు రంగాలు బొగ్గు, క్రూడాయిల్, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, సిమెంట్, విద్యుత్ ప్రతికూల వృద్ధిని నమోదు చేశాయి. దీంతో ఆగస్టులో ఇన్‌ఫ్రా రంగం వృద్ధి రేటు మైనస్ 1.8 శాతంగా నమోదైంది. ఇన్‌ఫ్రా రంగం ప్రతికూల వృద్ధిని నమోదు చేయడం మూడున్నరేళ్ల తర్వాత తొలిసారి. 2021 ఫిబ్రవరిలో ఈ రంగం వృద్ధి మైనస్ 3.3 శాతం ఉంది. ఈ రంగం వృద్ధి రేటు గత నెలలో 6.1 శాతం ఉండగా గత ఏడాది ఆగస్టులో 13.4 శాతం ఉంది. కాగా ఏప్రిల్-ఆగస్టు నెలల మధ్య కాలంలో ఇన్‌ఫ్రా వృద్ధి రేటు 4.6 శాతంగా నమోదైంది. పారిశ్రామికోత్పత్తి సూచీలో (ఐఐపీ) ఈ ఎనిమిది రంగాల వాటా 40.27 శాతం ఉంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,240 ▼	70,800 ▼	1,00,900 ▼
ముంబై	75,197 ▼	68,881 ▼	89,400 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

1వ అక్టోబరు			
హైదరాబాద్	510	విజయవాడ	535
వరంగల్	512	గోదావరి	535
చిత్తూరు	523	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ.	78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	116
వరంగల్	110	గుంటూరు	121
కరీంనగర్	110	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	115
కర్నూలు	110	నెల్లూరు	115
విశాఖపట్నం	102	అనంతపురం	115
గోదావరి	116		

చిన్న మొత్తాల పొదుపు రేట్లు యథాతథం

న్యూఢిల్లీ: ఈ అక్టోబరు 1 నుంచి ప్రారంభం కానున్న త్రైమాసికానికి చిన్న మొత్తాల పొదుపు పథకాల (స్మాల్ సేవింగ్ స్కీమ్స్) వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సోమవారం ప్రకటించింది. సెప్టెంబరు 30తో ముగిసే త్రైమాసికానికి ప్రకటించిన రేట్లే అక్టోబరు-డిసెంబరు కాలానికి వర్తిస్తాయని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం చిన్న మొత్తాల పొదుపు రేట్లను మార్చకపోవడం వరుసగా ఇది మూడోసారి. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కేంద్రం ఈ పథకాల వడ్డీ రేట్లను ప్రతి మూడు నెలలకోసారి సవరిస్తుంటుంది. స్మాల్ సేవింగ్ స్కీమ్స్ పరిధిలోకి వచ్చే సుకన్య సమృద్ధి పథకంపై చెల్లించే వడ్డీ రేటు 8.2 శాతంగా ఉండగా..పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) రేటు 7.1 శాతంగా, పోస్టాఫీస్ సేవింగ్ డిపాజిట్ రేటు 4 శాతంగా కొనసాగనుంది. కాగా, కిసాన్ వికాస్ పత్రాలపై 7.5 శాతం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ)పై 7.7 శాతం వడ్డీ లభించనుంది.

స్పోర్ట్స్

అటు పరుగులు.. ఇటు వికెట్లు


అశ్విన్ (15-1-45-2)

బంగ్లాదేశ్ మొదటి ఇన్నింగ్స్ 233

- మోమినుల్ అజేయ శతకం
- భారత్ తొలి ఇన్నింగ్స్ 285/9 డిక్లేర్
- జైస్వాల్, రాహుల్ అర్ధసెంచరీలు
- బంగ్లా రెండో ఇన్నింగ్స్ 26/2

మూడు రోజులపాటు ఎక్కడికక్కడే ఆగిపోయిన రెండో టెస్టు.. ఒక్క రోజే రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. సోమవారం నాలుగో రోజు వరుణుడు కరుణించడంతో గ్రీన్ పార్క్ మైదానంలో వికెట్లు నేల కూలడంతో పాటు.. పరుగుల మోత మోగింది. దీంతో ఒక్కరోజే ఇరుజట్లు 18 వికెట్లు కోల్పోగా, ఏకంగా 437 పరుగులు నమోదయ్యాయి.

కాన్పూర్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టు అంచనాలకు భిన్నంగా ఆసక్తికరంగా మారింది. రెండు రోజుల ఆట మాత్రమే మిగలడంతో నిస్సారమైన డ్రాగా ముగుస్తుందనుకున్న మ్యాచ్ రంజుగా మారింది. విజయంపై కన్నేసిన రోహిత్ సేన టీ20 తరహాలో ఆడి ఆఖరిరోజు ఆటకి అనూహ్యమైన ముగింపునిచ్చేందుకు రంగం సిద్ధం చేసింది. ముందుగా భారత బౌలర్ల ధాటికి బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 233 రన్స్‌కు ఆలౌటైంది. మోమినుల్ హక్ (107 నాటౌట్) అజేయ శతకంతో ఆకట్టుకున్నాడు. బుమ్రాకు 3.. ఆకాశ్‌దీప్, అశ్విన్, సిరాజ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. తర్వాత బరిలోకి దిగిన భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 34.4 ఓవర్లలోనే 285/9 వద్ద డిక్లేర్ చేసింది. జైస్వాల్ (51 బంతుల్లో 72), రాహుల్ (43 బంతుల్లో 68), విరాట్ (35 బంతుల్లో 47), గిల్ (39) వేగం కనబరిచారు. దీంతో జట్టుకు 52 పరుగుల ఆధిక్యం దక్కింది. ఆట ముగిసేసరికి బంగ్లా రెండో ఇన్నింగ్స్‌లో 26/2 స్కోరు చేసింది. క్రీజులో షాద్‌మన్(7), మోమినుల్ (0) ఉన్నారు. అశ్విన్‌కు 2 వికెట్లు లభించాయి. ఆఖరిరోజు 98 ఓవర్ల ఆట ఉండడంతో.. రెండు సెషన్లలోపే బంగ్లాను కట్టడి చేయాలని భారత్ భావిస్తోంది.

ఏమా దూకుడు: రెండో సెషన్ ఆరంభమైన కాసేపటికే తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన భారత్‌లో.. వీలైనంత త్వరగా బంగ్లా స్కోరును దాటేయాలన్న ఆత్రుత కనిపించింది. బంతి పడడమే ఆలస్యం బౌండరీ బాదేసేలా అందరి ఆట సాగింది. మొత్తంగా జట్టు 8.22 రన్‌రేట్‌తో దూసుకెళ్లింది. ఈ టీ20 తరహా ఆటను బంగ్లా బౌలర్లు ఏమాత్రం అంచనా వేయలేకపోయారు. ఓపెనర్లు జైస్వాల్, రోహిత్ (23) విరుచుకుపడిన తీరుకు వారు చేష్టలుడిగిపోయారు. రోహిత్ కొట్టిన ఓ సిక్సర్ అయితే స్టేడియంపైన పడింది. వీరి ధాటికి 18 బంతుల్లోనే 50 రన్స్ వచ్చాయి. అటు జైస్వాల్ 31 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అలాగే రెండో వికెట్‌కు గిల్‌తో కలిసి 10.1 ఓవర్లలోనే స్కోరును 100కు చేర్చాడు. అలాగే ఈ జోడీ మధ్య రెండో వికెట్‌కు 72 పరుగులు నమోదయ్యాయి. వీరి నిష్క్రమణ తర్వాత పంత్ (6) విఫలమైనా.. ఆఖరి సెషన్‌లో విరాట్, రాహుల్ అదరగొట్టారు. ఐదో వికెట్‌కు 87 రన్స్ జోడించి జట్టు ఆధిక్యానికి సహకరించారు. స్పిన్నర్లు మెహిదీ హసన్, షకీబ్‌ల ధాటికి చివర్లో వికెట్లు వేగంగా నేలకూలడంతో మరో 19 ఓవర్ల ఆట మిగిలి ఉండగానే భారత్ డిక్లేర్ చేసింది. **బంగ్లా ఇన్నింగ్స్‌లో సిరాజ్ పట్టిన క్యాచ్ సింప్లీ సూపర్బ్. షకీబ్‌ను అవుట్‌చేసే క్రమంలో మిడాఫ్‌లో వెనక్కి వంగి ఒక్క చేత్తో ఈ క్యాచ్ అందుకున్నాడు. అంతకుముందు రోహిత్ కూడా ఒంటిచేత్తో క్యాచ్ అందుకుని లిట్టన్‌దాస్‌ను పెవిలియన్ పంపాడు.**


సిరాజ్ అద్భుత క్యాచ్


జైస్వాల్ (72)

బజ్‌బాల్‌ను మించేలా..

బజ్‌బాల్ గేమ్ అంటే ఇంగ్లండ్ గుర్తుకురావడం పరిపాటి. కానీ నాలుగోరోజు ఆటలో టీమిండియా చెలరేగిన తీరు దాన్ని మించిపోయింది. బ్యాటర్లంతా కలిసికట్టుగా ఎదురుదాడికి దిగడంతో బంగ్లా బౌలర్లు ధారాళంగా పరుగులిచ్చుకున్నారు. ఈ క్రమంలో టెస్టు ఫార్మాట్‌లో రికార్డులు బద్దలయ్యాయి. అత్యంత వేగంగా 50 (18 బంతుల్లో), 100 (74), 200 (146), 250 (181) రన్స్ పూర్తి చేసిన జట్టుగా టీమిండియా అదుర్స్ అనిపించుకుంది.

స్కోరుబోర్డు

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: జకీర్ హసన్ (సి) జైస్వాల్ (బి) ఆకాశ్ దీప్ 0; షాద్‌మన్ (ఎల్బీ) ఆకాశ్ దీప్ 24; మోమినుల్ (నాటౌట్) 107; షంటో (ఎల్బీ) అశ్విన్ 31; ముష్ఫికర్ (బి) బుమ్రా 11; లిట్టన్ (సి) రోహిత్ (బి) సిరాజ్ 13; షకీబ్ (సి) సిరాజ్ (బి) అశ్విన్ 9; మెహిదీ హసన్ (సి) గిల్ (బి) బుమ్రా 20; తైజుల్ (బి) బుమ్రా 5; హసన్ (ఎల్బీ) సిరాజ్ 1; ఖాలెద్ (సి అండ్ బి) జడేజా 0; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 74.2 ఓవర్లలో 233 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-26, 2-29, 3-80, 4-112, 5-148, 6-170, 7-224, 8-230, 9-231, 10-233. **బౌలింగ్:** బుమ్రా 18-7-50-3; సిరాజ్ 17-2-57-2; అశ్విన్ 15-1-45-2; ఆకాశ్ దీప్ 15-6-43-2; జడేజా 9.2-0-28-1.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) హసన్ 72; రోహిత్ (బి) మిరాజ్ 23; గిల్ (సి) హసన్ (బి) షకీబ్ 39; పంత్ (సి) హసన్ (బి) షకీబ్ 9; విరాట్ (బి) షకీబ్ 47; రాహుల్ (స్టంప్) లిట్టన్ (బి) మిరాజ్ 68; జడేజా (సి) షంటో (బి) మిరాజ్ 8; అశ్విన్ (బి) షకీబ్ 1; ఆకాశ్ (సి) ఖాలెద్ (బి) మిరాజ్ 12; బుమ్రా (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 34.4 ఓవర్లలో 285/9 డిక్లేర్. వికెట్ల పతనం:** 1-55, 2-127, 3-141, 4-159, 5-246, 6-269, 7-272, 8-284, 9-285. **బౌలింగ్:** హసన్ 6-0-66-1; ఖాలెద్ 4-0-43-0; మిరాజ్ 6.4-0-41-4; తైజుల్ 7-0-54-0; షకీబ్ 11-0-78-4.

బంగ్లా రెండో ఇన్నింగ్స్: షాద్‌మన్ (నాటౌట్) 7; జకీర్ (ఎల్బీ) అశ్విన్ 10; హసన్ (బి) అశ్విన్ 4; మోమినుల్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 11 ఓవర్లలో 26/2. వికెట్ల పతనం:** 1-18, 2-26, **బౌలింగ్:** బుమ్రా 3-1-3-0, అశ్విన్ 5-2-14-2, ఆకాశ్ దీప్ 3-2-4-0.

1 ఒకే క్యాలెండర్ ఏడాదిలో ఎక్కువ సిక్సర్లు (90) బాదిన జట్టుగా టీమిండియా

ఓ టెస్టు ఇన్నింగ్స్ (200+రన్స్)లో అత్యధిక రన్‌రేట్ (8.22;భారత్) నమోదు కావడం ఇదే తొలిసారి.



తక్కువ టెస్టు (74)ల్లో 3000+ పరుగులు 300 వికెట్లు తీసిన రెండో ఆటగాడిగా జడేజా. ఇయాన్ బోథమ్ (72) ముందున్నాడు.

2 భారత్‌లో జరిగిన టెస్టుల్లో ఒకే రోజు ఎక్కువ పరుగులు (437) నమోదు కావడం ఇది రెండోసారి. 2009లో శ్రీలంకపై భారత్ 470 రన్స్ చేసింది.

తక్కువ ఇన్నింగ్స్‌ల్లో (594) 27 వేల పరుగుల మైలురాయిని చేరిన కోహ్లీ. ఈ క్రమంలో సచిన్ (623), సంగక్కర (648), పాంటింగ్ (650)ని దాటేశాడు. మొత్తంగా టెండూల్కర్ తన కెరీర్‌లో 782 ఇన్నింగ్స్‌లో 34,357 రన్స్ సాధించాడు.

చాంపియన్స్ ట్రోఫీపై నిర్ణయం కేంద్రానిదే..

కాన్పూర్: చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనేందుకు భారత జట్టు పాకిస్థాన్ వెళ్లే విషయమై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తెలిపాడు. పాకిస్థాన్ ఆతిథ్యమివ్వనున్న ఆ టోర్నీ వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చిల్లో జరగనుంది. 'చాంపియన్స్ ట్రోఫీపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. అయితే అంతర్జాతీయ పర్యటనలకు కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాలన్నది బోర్డు విధానం. మన జట్టు ఏ దేశం వెళ్లాలీ..వెళ్లొద్దు అనేది తేల్చాల్సింది కేంద్రమే' అని శుక్లా సోమవారమిక్కడ చెప్పాడు. 'చాంపియన్స్ ట్రోఫీ విషయంలో కేంద్రం తీసుకునే నిర్ణయానికి మేం కట్టుబడి ఉంటాం' అని చెప్పాడు.

వారి వల్లే..


ఐఓఏ చీఫ్ పీటీ ఉష

పారిస్ విజేతలను సన్మానించలేదు

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ పతక విజేతలను భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) తరఫున ఇప్పటి వరకు సన్మానించలేకపోయామని అధ్యక్షురాలు పీటీ ఉష ఆవేదన వ్యక్తంజేసింది. ఇందుకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు సహకరించకపోవడమే కారణమని ధ్వజమెత్తింది. అంతేకాదు పారిస్ క్రీడల్లో పాల్గొనే అథ్లెట్ల సన్నద్ధతకు ఉద్దేశించిన నిధులను విడుదల చేయకుండా ఫైనాన్స్ కమిటీ అడ్డుకుందని ఆరోపించింది. పారిస్ క్రీడల్లో భారత్ 6 పతకాలు సాధించిన సంగతి తెలిసిందే. 'పారిస్ వెళ్లే ఒక్కో అథ్లెట్‌కు రూ. రెండు లక్షలు, వారి కోచ్ ఒక్కొక్కరికీ రూ. లక్ష ఇవ్వాలన్న ప్రతిపాదనను ఆర్థిక కమిటీ అడ్డుకుంది' అని ఆమె వెల్లడించింది. ఇందుకు ఐఓఏ కోశాధికారి సహదేవ్ యాదవే కారణమని ఆరోపించింది.



ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్‌లో సచిన్

ముంబై: దిగ్గజం సచిన్ టెండూల్కర్ మైదానంలో మరోసారి తన బ్యాటింగ్ విన్యాసాలను ప్రదర్శించనున్నాడు. తొలి ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్ (ఐఎంఎల్)లో అతడు బరిలో దిగనున్నాడు. ఆరు జట్ల ఈ టీ20 టోర్నీ త్వరలో దేశంలోని మూడు వేదికల్లో జరగనుంది. భారత్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, ఇంగ్లండ్, శ్రీలంక క్రికెటర్లు పాల్గొనే ఐఎంఎల్ ముంబై, లఖ్‌నవూ, రాయ్‌పూర్‌లో నిర్వహించనున్నారు. టెండూల్కర్, మాజీ కెప్టెన్ గవాస్కర్ ఈ లీగ్‌కు రూపకల్పన చేశారు. గవాస్కర్ ఐఎంఎల్‌కు కమిషనర్‌గా వ్యవహరించనున్నాడు.

స్కేటర్ సుహాన్‌కు రెండు స్వర్ణాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆగ్నేయ ఆసియా ఐస్ స్కేటింగ్ టోర్నమెంట్‌లో ఎనిమిదేళ్ల హైదరాబాద్ చిన్నోడు రెండు రజత పతకాలు సాధించి.. సత్తా చాటాడు. ఫిలిప్పీన్స్‌లోని మనీలాలో ఈనెల 28 నుంచి రెండ్రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో భారత్, చైనా, ఆస్ట్రేలియా సహా మొత్తం తొమ్మిది దేశాలు పాల్గొన్నాయి. బాలుర జూనియర్ కేటగిరీలో సుహాన్ 300, 500 మీటర్ల రేసులో ద్వితీయ స్థానంలో నిలిచి పతకాలు కొల్లగొట్టారు.

షూటింగ్‌లో భారత్‌కు రెండు కాంస్యాలు

న్యూఢిల్లీ: షూటింగ్ జూనియర్ వరల్డ్‌కప్‌లో రెండోరోజు భారత్‌కు రెండు కాంస్యాలు లభించాయి. పెరూలోని లిమాలో సోమవారం జరిగిన మిక్స్‌డ్ రైఫిల్ కేటగిరిలో గౌతమి బానోత్-అజయ్ మాలిక్ జోడీ 628.9 స్కోరుతో తృతీయ స్థానంలో నిలిచి పతకం సొంతం చేసుకుంది. చైనా స్వర్ణం, ఫ్రాన్స్ రజతం గెలిచాయి. పిస్టల్ ఈవెంట్ కాంస్యపోరులో లక్షిత-ప్రమోద్ ద్వయం 16-8తో భారత్‌కే చెందిన కనిష్క-ముఖేష్ జోడీపై నెగ్గి పతకం సాధించింది. ఈ టోర్నీలో ప్రస్తుతం భారత్ 2 స్వర్ణాలు సహా 5 పతకాలు సాధించి టాప్‌లో ఉంది.

13 ఏళ్ల చిన్నోడు అదరగొట్టాడు

- వైభవ్ సూపర్ ఇన్నింగ్స్
- భారత్ 103/0
- ఆస్ట్రేలియా 293
- అండర్-19 అనధికార టెస్ట్



చెన్నై: పదమూడేళ్ల చిన్నోడు వైభవ్ సూర్యవంశీ (47 బంతుల్లో 81 బ్యాటింగ్) ధనాధన్ అర్ధ శతకంతో చెలరేగడంతో.. ఆస్ట్రేలియా అండర్-19తో సోమవారం ఆరంభమైన తొలి అనధికార టెస్ట్‌లో భారత్ అదిరే ఆరంభాన్ని అందుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 293 పరుగులకు ఆలౌటైంది. ఐడెన్ ఓకనార్ (61), రైలీ కింగ్‌సెల్ (53), క్రిస్టియన్ హో (48) రాణించారు. సమర్థ్ నాగరాజ్, మహ్మద్ ఎనాన్ చెరో 3 వికెట్లతో కంగారూల వెన్నువిరిచారు. అనంతరం భారత్ ఆట ముగిసేసరికి తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ కోల్పోకుండా 103 రన్స్ చేసింది. ఈ రన్స్ 7.36 రన్‌రేట్‌తో కేవలం 14 ఓవర్లలోనే సాధించడం విశేషం. వైభవ్‌తోపాటు విహాన్ మల్హోత్రా (21) క్రీజులో ఉన్నారు. బిహార్ తరఫున ఇప్పటికే రంజీలు ఆడేసిన 13 ఏళ్ల వైభవ్ తొలి రోజు ఆటలో హైలైట్‌గా నిలిచాడు. ఏ బౌలర్‌నూ వదలకుండా ఎడాపెడా షాట్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు.

సమిత్ అరంగేట్రం కష్టమే..

ఆసీస్‌తో మూడు వన్డేల సిరీస్‌తో అండర్-19 కెరీర్ ఆరంభిస్తాడని ఆశించిన రాహుల్ ద్రవిడ్ కుమారుడు సమిత్‌కు నిరాశే ఎదురైంది. మోకాలి గాయం కారణంగా ఎన్‌సీఏలో చికిత్స పొందుతున్న సమిత్ తొలి మ్యాచ్‌కు దూరమయ్యాడు. మిగతా రెండు అనధికార టెస్ట్‌లకు కూడా అతను అందుబాటులో ఉండకపోవచ్చు.

రక్ష ఖాతాలో క్రొయేషియా టైటిల్

ముంబై: యువ షట్లర్ రక్ష కందస్వామి వారం వ్యవధిలో రెండో టైటిల్‌ను అందుకుంది. ఇటీవల బెల్జియం టోర్నీలో విజేతగా నిలిచిన రక్ష తాజాగా సమోబోర్‌లో జరిగిన క్రొయేషియా టోర్నీలో టైటిల్ సాధించింది. ఫైనల్లో రక్ష 21-9, 21-5తో లియోనా లీ (ఇంగ్లండ్)పై నెగ్గింది.

హైడ్రాతో వసూళ్లపర్వం

మూసీ సుందరీకరణ పేరుతో లక్షన్నర కోట్ల అవినీతికి శ్రీకారం

పేదోళ్ల ఇళ్లను కూల్చితే ఊరుకోం: బండి సంజయ్



కరీంనగర్‌లో పారతో చెత్తను తొలగిస్తున్న బండి సంజయ్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 30: అయ్యప్ప సొసైటీలో అక్రమాల కూల్చివేత పేరుతో హడావుడి చేసిన బీఆర్ఎస్ నేతలు పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడితే.. హైడ్రా కూల్చివేతల పేరుతో కాంగ్రెస్ పాలకులు సంపన్నుల నుంచి వసూళ్లు చేసే తంతుకు తెరదీశారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో బీఆర్ఎస్ రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడితే.. మూసీ సుందరీకరణ పేరుతో రూ.లక్షన్నర కోట్ల అప్పు తెచ్చి కాంగ్రెస్ అవినీతికి తెరతీస్తోందని ధ్వజమెత్తారు. సోమవారం కరీంనగర్‌లో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో సంజయ్ పాల్గొన్నారు. పారను చేతబట్టి చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. హైడ్రా పేరుతో పేద, మధ్య తరగతి ప్రజల ఇళ్లను కూల్చివేస్తే ఊరుకోబోమని తేల్చి చెప్పారు. ప్రభుత్వమే అనుమతులిచ్చి.. ఇప్పుడు ఇళ్లను కూల్చివేస్తే ఎలా అని ప్రశ్నించారు. వారం రోజుల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో హైడ్రాపై పోరాట కార్యాచరణను రూపొందించి, అమలు చేయబోతున్నామని సంజయ్ తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయంలో సంజయ్ సోమవారం భవానీ దీక్ష స్వీకరించారు.

జపాన్ చేరుకున్న భట్టి విక్రమార్క



భట్టికి స్వాగతం పలుకుతున్న భారత రాయబార కార్యాలయ ప్రతినిధి

హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల అమెరికా పర్యటన అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని ప్రతినిధుల బృందం జపాన్‌కు చేరుకుంది. సోమవారం మధ్యాహ్నం హనెడా విమానాశ్రయంలో భారత రాయబార కార్యాలయ ప్రతినిధులు ఆయనకు స్వాగతం పలికారు. పర్యావరణహిత పరిశ్రమలు, అత్యాధునిక మైనింగ్ టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ల ఏర్పాటు తదితర అంశాలపై అధ్యయనం కోసం మూడు రోజులపాటు ఈ బృందం జపాన్‌లోని పలు పరిశ్రమలను సందర్శించి, కంపెనీల ప్రతినిధులతో సమావేశం కానుంది.

టెక్ కంపెనీలకు గమ్యస్థానంగా తెలంగాణ!

- ఆవిష్కరణలు, కొత్త సాంకేతికతల్లో ముందున్న రాష్ట్రం
- 'అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండియా'లో దుద్దిళ్ల



హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆవిష్కరణలతో పాటు వర్ధమాన సాంకేతికతల్లో తెలంగాణ ముందు వరుసలో ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. 'అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండియా' హైదరాబాద్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సర్కారు తీసుకున్న వ్యూహాత్మక చర్యలు, వ్యాపారాలకు అనుకూలమైన వాతావరణం, ఆవిష్కరణల వంటి అంశాలు పెట్టుబడులను ఆకర్షించాయని తెలిపారు. ఇది రాష్ట్రంలో స్టార్టప్‌లను పెంచి, ప్రపంచవ్యాప్తంగా టెక్ కంపెనీలకు తెలంగాణను గమ్యస్థానంగా నిలిపాయని చెప్పారు. 2024లో తెలంగాణ ఐటీ రంగం విస్తృతంగా అభివృద్ధి చెందిందన్నారు. కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), బ్లాక్‌చెయిన్ సాఫ్ట్‌వేర్‌లు రాష్ట్రంలో విస్తృతంగా ఉపయోగంలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ కీలక నిర్ణయాలతో రాష్ట్రంలో స్టార్టప్ రంగం కూడా వేగంగా అభివృద్ధి చెందిందన్నారు. ఇక్కడి స్టార్టప్‌లు అంతర్జాతీయ అవకాశాలను దక్కించుకుంటున్నాయని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. వ్యవసాయం, ఆరోగ్య రంగాల్లో టెక్నాలజీ వినియోగం పెరగడంతో ఉత్పాదకత పెరిగిందని, ప్రజా ఆరోగ్య సేవలు మెరుగుపడ్డాయని శ్రీధర్ బాబు చెప్పారు.

సవరించిన శాశ్వత స్థానికత విధానాన్ని వచ్చే ఏడాది నుంచి అమలు చేయొచ్చు కదా!

నీట్ కౌన్సెలింగ్ వ్యవహారంపై రాష్ట్ర సర్కారుకు సుప్రీం సూచన

కొందరికే మినహాయింపు సరికాదేమోనన్న సర్కారు

తదుపరి విచారణ అక్టోబరు 3వ తేదీకి వాయిదా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నీట్ కౌన్సెలింగ్‌కు సంబంధించి.. సవరించిన శాశ్వత స్థానికత విధానాన్ని వచ్చే ఏడాది నుంచి అమలు చేసే అంశాన్ని పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. దీనిపై తదుపరి విచారణను అక్టోబరు 3కు వాయిదా వేసింది. వైద్య విద్యలో ప్రవేశాలకు సంబంధించి తెలంగాణ సర్కారు జారీ చేసిన జీవో నం.33లోని 3(ఎ) నిబంధనను సవాల్ చేస్తూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి! సుదీర్ఘ వాదనల అనంతరం వాటిపై హైకోర్టు సెప్టెంబరు 5న తీర్పు చెప్పింది. స్థానికత నిర్ధారణకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం రూపొందించలేదని.. తొలుత వాటిని రూపొందించి, ఆ మార్గదర్శకాల మేరకు స్థానిక కోటా వర్తింపజేయాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పును సెప్టెంబరు 11న రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్ పై సెప్టెంబర్ 20న భారత ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనల సందర్భంగా.. ఒకసారి మినహాయింపు కింద హైకోర్టును ఆశ్రయించిన 135 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. దీంతో.. హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు అవకాశం కల్పించడంతోపాటు హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. ఆ పిటిషన్.. సెప్టెంబర్ 27న మరోసారి సుప్రీం ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. విద్యార్థుల తరఫున వాదనలు వినిపించిన న్యాయవాదులు.. కేవలం హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులను మాత్రమే కౌన్సెలింగ్‌కు అనుమతించడం సరికాదని, అర్హులందరినీ కౌన్సెలింగ్‌కు అనుమతించాలని కోరారు. దీనికి సీజేఐ డీవై చంద్రచూడ్ స్పందిస్తూ.. ఆ తీర్పును సవరించాలంటే గతంలో తీర్పు ఇచ్చినప్పటి ధర్మాసనం పూర్తిగా మళ్లీ విచారణ చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. ఆ ధర్మాసనంలోని జస్టిస్ పార్దీవాలా అందుబాటులో లేరు కనుక సోమవారం (సెప్టెంబరు 30న) విచారణ చేపడతామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో.. సోమవారం సీజేఐ నేతృత్వంలోని గత ధర్మాసనం ఆ పిటిషన్‌ను విచారించింది. విద్యార్థుల తరఫు న్యాయవాదులు తమ వాదనను మళ్లీ ధర్మాసనం ముందుంచారు. కేవలం ఒకటి లేదా రెండేళ్లు వేరే చోట చదివినంత మాత్రాన స్థానికులు కాదనడం సరికాదన్నారు. అయితే.. మొత్తం ఎంతమంది విద్యార్థులు ఇలా స్థానికత సమస్యను ఎదుర్కొంటున్నారని ధర్మాసనం ప్రశ్నించింది. స్థానికత అంశంపై స్పష్టమైన విధానం ఉండాలని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్.. హైకోర్టును ఆశ్రయించిన 135 మంది విద్యార్థులకే కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు గతంలో తాము తెలిపిన ఆమోదం సరికాదేమోనని అభిప్రాయపడ్డారు. దీనికి సీజేఐ.. 'మీరు అలా ఆమోదం తెలిపినప్పుడు నాకు ఇబ్బందిగా అనిపించింది. ఎందుకంటే కోర్టు ముందుకు వచ్చిన కొందరికి మాత్రమే మినహాయింపు ఇవ్వకూడదనిపించింది' అని పేర్కొన్నారు. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసి.. "ఇది ఆదేశం కాదుగానీ, మిస్టర్ గోపాల్.ఎస్.. సవరించిన నిబంధనను వచ్చే ఏడాది నుంచి వర్తింపజేయగలరేమో పరిశీలించండి" అని వ్యాఖ్యానించారు.

ఇవేం కూల్చివేతలు?

(మొదటిపేజీ తరువాయి)

వ్యవహరిస్తే జైలుకు వెళ్తారని హెచ్చరించింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేటలో ఓ ప్రైవేటు ఆస్పత్రి భవనాన్ని ఆదివారం (ఈ నెల 22న) కూల్చివేయడంపై దాఖలైన పిటిషన్‌పై హైడ్రా కమిషనర్, అమీన్‌పూర్ తహసీల్దార్ స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం అమీన్‌పూర్ తహసీల్దార్ రాధ ప్రత్యక్షంగా, హైడ్రా కమిషనర్ రంగనాథ్ వర్చువల్‌గా కోర్టు ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. వారిని దాదాపు గంటన్నరపాటు ప్రశ్నించిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం.. హైడ్రా తీరు పట్ల తాము సంతృప్తిగా లేమని, ప్రభుత్వ భూములను రక్షించే పద్ధతి ఇది కాదని వ్యాఖ్యానించింది. శని, ఆదివారాలు, సూర్యాస్తమయం తర్వాత కూల్చివేతలు చేపట్టరాదన్న ప్రాథమిక విషయం తెలియకపోవడమేంటని విస్మయం వ్యక్తం చేసింది. "పొలిటికల్, ఎగ్జిక్యూటివ్ బాస్‌లు చెప్పినట్లు చేస్తే చాలా ఇబ్బందుల్లో పడతారు. వారిని సంతృప్తి పరిచేందుకు చట్టాలను ఉల్లంఘించొద్దు. మీ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. మా తీర్పులను ఉల్లంఘిస్తూ ఇలాగే వ్యవహరిస్తే చంచల్‌గూడ, చర్లపల్లి జైళ్లకు వెళ్తారు. ప్రభుత్వ భూములను రక్షించే విధానం ఇది కాదు. చట్టాలను, తీర్పులను ఉల్లంఘిస్తూ ఏం సాధిద్దామనుకుంటున్నారు? రాత్రికి రాత్రే అంతా మారిపోతుందని భ్రమ పడుతున్నట్లున్నారు! ఈ దేశంలో సహజ న్యాయసూత్రాలు ఉన్నాయని తెలుసా? వ్యక్తి చనిపోయే ముందూ చివరి కోరిక ఏంటని అడుగుతారు. భవనం కూల్చేముందు యజమానికి చివరి అవకాశం ఇవ్వరా? ప్రస్తుత కేసులో విద్యుత్ కనెక్షన్ కట్ చేయడంపై స్టే ఉంది. భవన నిర్మాణ అనుమతుల రద్దుపై స్టే ఉంది. అవేవీ పట్టించుకోకుండా ఎలా కూలుస్తారు?"అని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఆ గడువు పూర్తికాకుండానే కూల్చేస్తారా?

48 గంటల్లో భవనాన్ని ఖాళీ చేయాలంటూ శనివారం సాయంత్రం నోటీసు ఇచ్చి.. గడువు పూర్తికాకముందే ఆదివారం ఉదయం 7.30 గంటలకు కూల్చివేశారని హైకోర్టు గుర్తు చేసింది. తహసీల్దార్ ఆదివారం విధుల్లో ఉండటమేంటని ప్రశ్నించింది. "ఉదయం 7.30 అల్పాహారం కూడా పూర్తి కాదు. ఇది కక్షతో, కుట్రపూరితంగా చేపట్టిన చర్య కాదా? నోటీసు ఇవ్వకుండా చర్యలు తీసుకుంటారా? ఇలాగే చేస్తే సూమోటోగా కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేసి విచారిస్తాం. అసలు తహసీల్దార్‌కు సర్వే, దాని విధానం ఏంటో తెలుసా? హైడ్రా ఏర్పాటు జీవో 99లో పేర్కొన్న నిబంధనలకు విరుద్ధంగా చర్యలు తీసుకున్నారు. హైడ్రాకు ట్రాఫిక్, విపత్తు నిర్వహణ వంటి అనేక విధులు ఉన్నాయి. కానీ, కేవలం కూల్చివేతలపైనే దృష్టి పెట్టారు. ట్రాఫిక్ సహా నిర్దేశించిన ఇతర విధుల విషయంలో ఏం చర్యలు తీసుకున్నారు? మాదాపూర్ వంటి ప్రాంతాల్లో గంటల కొద్దీ ట్రాఫిక్‌లో ఉండాల్సిన పరిస్థితి ఉంది. చెరువుల చుట్టుపక్కల భూములు కొనాలంటే భయపడాలని మీరు (రంగనాథ్) ఓ ఇంటర్వ్యూలో చెప్పినట్లు న్యాయవాదులు ఫిర్యాదు చేశారు. మీరు ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలనుకుంటున్నారా? మేం అమీన్‌పూర్ గురించి మాట్లాడుతున్నాం.. కావూరి హిల్స్ వరకు రాలేదు. అడిగిన దానికి సమాధానం చెప్పండి. పెద్దలను వదిలేసి పేదలను కొడుతున్నారు. వివక్ష చూపుతున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. హైడ్రా ఏర్పాటు అభినందనీయం. కానీ, వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరం. హైడ్రా జీవోను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇలాగే వ్యవహరిస్తే జీవోపై స్టే ఇస్తాం" ధర్మాసనం హెచ్చరించింది.



మూసీ రివర్‌బెడ్ ఖాళీ చేయిస్తామంటూ సర్వే చేపడుతుండటంపై హైకోర్టుకు పిటిషన్లు వెల్లువలా వస్తున్నాయని ధర్మాసనం తెలిపింది. కేవలం సోమవారం ఒక్కరోజే మూసీ కూల్చివేతలకు సంబంధించి దాదాపు 20 లంచ్‌మోషన్‌లు ఇచ్చినట్లు పేర్కొంది. రిజిస్టర్డ్ సేల్ డీడ్, భవన నిర్మాణ అనుమతులు, కోర్టు స్టే ఉత్తర్వులు పరిశీలించకుండా చర్యలు తీసుకోవడమేంటని తప్పుబట్టింది. "ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లోపించింది. అక్రమ నిర్మాణాలుగా తేల్చిన తర్వాత రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారు? పంచాయతీ, మునిసిపాలిటీ, జీహెచ్ఎంసీ ఎలా అనుమతులు ఇస్తాయి? ఒక శాఖ అనుమతులు ఇచ్చి.. మరో శాఖ కూల్చివేయడమేంటి? రిజిస్ట్రేషన్ జరగకుండా రిజిస్ట్రార్‌కు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత లేదా? ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు అంటున్నారు. ఓఆర్ఆర్ పరిధిలో ఒక్క చెరువుకు కూడా ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వకుండా, సర్వే చేయకుండా అక్రమ నిర్మాణాలుగా ఎలా తేలుస్తారు ? నల్లకుంట, బతుకమ్మ కుంట ఇప్పుడు ఉన్నాయా?" అని ప్రశ్నించింది. దీనికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమాధానమిస్తూ.. ఓఆర్ఆర్ పరిధిలో 2,500 చెరువులు ఉండగా 1,320 చెరువులకు ప్రిలిమినరీ నోటిఫికేషన్లు, 138 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్లు ఇచ్చినట్లు తెలిపారు. కోర్టు పట్ల అత్యంత గౌరవం ఉందని, తహసీల్దార్ అడిగినందునే మెన్ అండ్ మెషినరీ ఇచ్చామని, తమకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. అలాగే మూసీ సుందరీకరణ, కూల్చివేతలు, తరలింపుపై హైడ్రాకు సంబంధం లేదన్నారు. ప్రస్తుతం ఉన్న వాటిని రక్షించుకోవాలని తాము ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. అయితే అసాధారణ కేసుల్లో మాత్రమే తాము అధికారుల హాజరుకు ఆదేశిస్తామని, ఇది అసాధారణ కేసు అని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను అక్టోబరు 15కు వాయిదా వేసింది. అప్పటివరకు యథాతథ స్థితి (స్టేటస్‌కో) కొనసాగించాలని.. కౌంటర్లు దాఖలు చేయాలని పేర్కొంది.

మూసీపై 20 లంచ్‌మోషన్ పిటిషన్లు

మూసీ మార్కింగ్‌తో సంబంధం లేదు

నిర్వాసితుల తరలింపూ మా పరిధి కాదు

చెరువులు, నాలాల పునరుద్ధరణే లక్ష్యం

పేదలు, మధ్య తరగతి వారి ఇళ్ల జోలికెళ్లం

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడి



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మూసీకి ఇరువైపులా చేసిన సర్వే, మార్కింగ్‌తో హైడ్రాకు సంబంధం లేదని కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. ఆయా ప్రాంతాల్లోని నిర్వాసితులను తరలించడం లేదని, నది సుందరీకరణ ప్రాజెక్టును మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతున్నదని పేర్కొన్నారు. మూసీ తీర ప్రాంతంలో హైడ్రా కూల్చివేతలు జరుగుతాయని, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నిర్మాణాలను సంస్థ నేలమట్టం చేస్తోందన్న ప్రచారం నేపథ్యంలో సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. హైడ్రా ముఖ్య ఉద్దేశం కూల్చివేతలు కాదని.. చెరువులు, నాలాల పరిరక్షణ, పునరుద్ధరణ, పార్కులు, ప్రభుత్వ స్థలాలను రక్షించడమని తెలిపారు. చెరువుల నగరంగా ప్రసిద్ధిగాంచిన హైదరాబాద్‌లో జలాశయాలకు వీలైనంత మేర పూర్వ వైభవం తీసుకురావడం.. గొలుసు కట్టు చెరువుల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. నాలాలు, కాల్వల వెంట ఆక్రమణలను తొలగించి వరద నీరు సాఫీగా ప్రవహించేలా చూస్తామన్నారు. రెవెన్యూ, సాగునీటి, జాతీయ, రాష్ట్ర రిమోట్ సెన్సింగ్ విభాగాలతో అధ్యయనం చేయించి చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల నిర్ధారణకు హైడ్రా కృషి చేస్తుందని రంగనాథ్ తెలిపారు. వర్షపు నీటి నిల్వ, వరద ప్రవాహ వ్యవస్థ మెరుగుపర్చడం ద్వారా రహదారులు, నివాస ప్రాంతాలు మునిగిపోకుండా చర్యలు చేపట్టడం తమ లక్ష్యంగా వివరించారు. పేద, మధ్య తరగతి వర్గాల ఇళ్ల జోలికి హైడ్రా వెళ్లదని, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో, ఇతర రాష్ట్రాల్లోని కూల్చివేతలనూ హైడ్రాకు ఆపాదిస్తూ సామాజిక మాధ్యమాలలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఇలాంటి వదంతులను ప్రజలు నమ్మొద్దని కోరారు. హైడ్రా పరిధి ఔటర్ రింగ్ రోడ్డు వరకే అని తేల్చి చెప్పారు. ట్రాఫిక్ చిక్కులు లేకుండా.. విపత్తు నిర్వహణకు హైదరాబాద్‌లో ట్రాఫిక్ చిక్కులకు చెక్ పెట్టేందుకు ఏం చేయాలన్నదానిపై హైడ్రా అధ్యయనం చేసి కారణాలను గుర్తించి పరిష్కారాలనూ సూచిస్తుందని తెలిపారు. ట్రాఫిక్ రద్దీతో పర్యావరణంపై పడనున్న ప్రభావాన్ని గుర్తిస్తూ.. చేపట్టాల్సిన కాలుష్య రహిత చర్యలపై పలు సూచనలు చేస్తామన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల ఆధారంగా ముందుగానే అప్రమత్తమై విపత్తు నిర్వహణ చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. కూలిన చెట్లు, రోడ్లు, ఇళ్లలోకి వచ్చిన వరద నీటిని డీఆర్ఎఫ్ బృందాలు తొలగిస్తున్నాయన్నారు.

మూసీ ఆక్రమణల కూల్చివేతలు.. ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించాకే చర్యలు చేపట్టాలి

- ఎఫ్‌టీఎల్ బయట నిర్మాణాలకు.. నోటీసులు ఎలా ఇస్తారు: హైకోర్టు
- ప్రత్యామ్నాయం చూపాకే ముందుకెళ్తాం
- హైకోర్టుకు విన్నవించిన ప్రభుత్వం

హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మూసీ ఆక్రమణల కూల్చివేతల విషయంలో ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించిన తర్వాతే.. చర్యలు చేపట్టాలని సూచించింది. "ఎఫ్‌టీఎల్ బయట ఇళ్లు నిర్మించుకున్న వారికి నోటీసులు ఎలా జారీ చేస్తారు?" అని ప్రశ్నించింది. ఎలాంటి చర్యలు చేపట్టినా.. చట్టప్రకారం ముందుకెళ్లాలని హితవు పలికింది. మూసీ పరీవాహక ప్రాంతం వెంబడి ఉన్న ఇళ్లకు 'రివర్ బెడ్' అంటూ రెడ్ మార్కింగ్ చేశారని, తమ ఇళ్లను కూల్చివేస్తామని అధికారులు బెదిరిస్తున్నారని పేర్కొంటూ.. పలువురు బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. లంచ్‌మోషన్ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫు న్యాయవాది రెడ్ మార్కింగ్‌లపై ప్రభుత్వానికి వివరణ ఇచ్చారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఆక్రమణలను యుద్ధ ప్రాతిపదికన తొలగించడం లేదని పేర్కొన్నారు. "కూల్చివేతలపై కమిటీని ఏర్పాటు చేశాం. ఆ కమిటీ ఇళ్లను కోల్పోయే బాధితులతో చర్చలు జరుపుతోంది. ఇళ్లు కోల్పోయే పేదలకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసిన తర్వాతే.. చట్టపరంగా ముందుకు వెళ్తాం" అని సూచించింది. ఈ క్రమంలో కల్పించుకున్న ధర్మాసనం మూసీ పరీవాహకంలో ఆక్రమణల తొలగింపునకు ఏదైనా పాలసీ ఉందా? అని ప్రశ్నించింది. ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించాకే చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేస్తూ.. తదుపరి విచారణను ఈనెల 16కు వాయిదా వేసింది.

పెండింగ్‌లో 262 ఇళ్ల మార్కింగ్

- నాంపల్లి, బహదూర్‌పురాలో బాధితుల నుంచి నిరసనలు
- జియాగూడ, పిల్లిగుడిసెల్లోని ఇళ్లకు ఇప్పటిదాకా 129 కుటుంబాలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మూసీ నదీగర్భం (రివర్‌బెడ్)లో ఉన్న ఇళ్ల గుర్తింపునకు సంబంధించిన మార్కింగ్ ప్రక్రియ మూడో రోజు కూడా నిలిచిపోయింది. మూసీ రివర్‌బెడ్‌లో నివసిస్తున్న కుటుంబాల నుంచి పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమవుతుండటంతో రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లడం లేదు. ఇప్పటివరకు మార్కింగ్ పూర్తిచేసిన చోట కొంతమంది డబుల్ బెడ్‌రూమ్‌లకు వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. వారిని నెమ్మదిగా అక్కడి నుంచి తరలిస్తున్నారు. మూసీ సుందరీకరణలో భాగంగా హైదరాబాద్ జిల్లా పరిధిలో నదీ పరీవాహకంలో మొత్తం 1,595 నిర్మాణాలను గతంలో డ్రోన్ సర్వే ద్వారా గుర్తించారు. ఇప్పటివరకు 1,333 ఇళ్లకు మార్కింగ్ చేశారు. నాంపల్లి, బహదూర్‌పురా మండలాల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు రావడంతో అధికారులు వెనక్కి తగ్గారు. ప్రస్తుతం ఆయా చోట్ల 262 ఇళ్లకు మార్కింగ్ చేయాల్సి ఉందని హైదరాబాద్ ఆర్డీవో మహిపాల్ తెలిపారు. ఇక డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి తరలేందుకు మొగ్గుచూపుతున్న వారికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపిస్తున్నారు. ఆదివారం వరకు 85 మందిని జియాగూడ, మలక్‌పేట్ నియోజకవర్గం పిల్లిగుడిసెలలోని రెండు పడకల గృహ సముదాయానికి తరలించారు. సోమవారం మరో 54 మందిని తరలించారు. ఇందులో నాలుగు కుటుంబాలు జియాగూడకు వెళ్లగా.. 50 కుటుంబాలు పిల్లిగుడిసెల ప్రాంతానికి వెళ్లాయి. కాగా డబుల్ బెడ్‌రూం ఇళ్లలో తాగునీరు, విద్యుత్తు పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక సిబ్బందిని నియమించారు. మూసీ నిర్వాసితులను డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు తరలించడంలో భాగంగా నిర్వాసితులతో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ స్వయంగా కలుసుకొని మాట్లాడుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు మూసీ ప్రాంతంలో ఉంటే ఇబ్బందులు వస్తాయని, పిల్లలు అనారోగ్యం బారిన పడుతారని అవగాహన కల్పిస్తున్నారు. మూసీ సుందరీకరణపై ప్రభుత్వ లక్ష్యాన్ని తెలియజేస్తుండటంతో చాలామంది ఆకర్షితులవుతున్నట్లు తెలుస్తోంది.

అమాయకులను ఆత్మహత్యలకు పురిగొల్పేందుకు హరీశ్ యత్నం

- మేధావుల సంఘం చైర్మన్ కేశవులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హైడ్రా బూచిగా చూపి మాజీ మంత్రి హరీశ్ రావు అమాయక ప్రజలను ఆత్మహత్యలకు పురిగొల్పుతున్నారని మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ కేశవులు ఆరోపించారు. భావితరాల కోసం పనిచేస్తున్న సీఎం పనితీరును తప్పుబడుతున్న హరీశ్.. మల్లన్న సాగర్, సుందిళ్ల ప్రాజెక్టు రైతులకు బేడీలు వేసినప్పుడు ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు. హైడ్రాను అభాసుపాలు చేయడానికి హరీశ్ పలు విధాలుగా ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

హైడ్రా కోసం 374-బీ

మునిసిపల్ చట్టంలో ఈ సెక్షన్ చేరుస్తూ ఆర్డినెన్స్

- క్యాబినెట్ ఆమోదంతో రాజ్‌భవన్‌కు ఫైల్
- పది రోజులుగా ఆమోదం కోసం ఎదురుచూపులు

హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల పరిరక్షణ, విపత్తుల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రాకు ప్రభుత్వం విస్తృత అధికారాలు కల్పిస్తూ జీహెచ్ఎంసీ చట్టంలో ప్రత్యేక సెక్షన్‌ను చేరుస్తున్నారు. 374-బీ పేరిట ఉన్న సెక్షన్‌లోని అంశాలను ఆర్డినెన్స్‌లో పొందుపరిచి ప్రభుత్వం దాని ఆమోదం కోసం గవర్నర్‌కు పంపింది. గత పది రోజులుగా గవర్నర్ ఆమోదం కోసం సర్కారు ఎదురు చూస్తోంది. ఈ నెల 20న జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ప్రవేశపెట్టిన ముసాయిదా ఆర్డినెన్స్‌కు ఆమోద ముద్ర లభించిన మరుసటి రోజే అది రాజ్‌భవన్‌కు చేరింది. హైడ్రాకు ఔటర్ రింగ్ వరకు ఉన్న పరిధిలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, విపత్తుల నిర్వహణ కోసం అవసరమయ్యే పలు రకాల అధికారాలను బదలాయిస్తూ ఆయా అంశాలను ఆర్డినెన్స్‌లో పొందుపర్చారు. మంత్రివర్గ సమావేశంలోని నిర్ణయాల మేరకు ఈ అధికారాలకు సంబంధించిన పలు జీవోలను కూడా ప్రభుత్వం విడుదల చేసింది.

ఆర్డినెన్స్‌లో ఏముంది?

తెలంగాణ కోర్ అర్బన్ రీజన్ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులను రక్షించేందుకు హైడ్రాకు ఎదురవుతున్న కొన్ని ఆటంకాలను తొలగిస్తూ, దానికి విశేష అధికారాలు కల్పిస్తూ ఆర్డినెన్స్ రూపొందించింది. హైడ్రాకు బదలాయించిన అధికారాలను వివరిస్తూ జీహెచ్ఎంసీ చట్టం 1955లో ప్రత్యేకంగా 374-బీ సెక్షన్‌ను చేరుస్తున్నారు. ఈ సెక్షన్‌లో రాష్ట్రంలోని ఒక కార్పొరేషన్, లేదా ప్రభుత్వ ఆధ్వర్యంలోని రోడ్లు, డ్రెయిన్లు, వీధులు, నీటి వనరులు, ఖాళీ స్థలాలు, పార్కులు, ఇతర ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణలకు గురికాకుండా వాటిని పరిరక్షించడానికి అవసరమైన అన్ని అధికారాలను హైడ్రాకు బదిలీ చేస్తూ ఆయా అంశాలను పొందుపరిచారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం ఎలాంటి అధికారాలనైనా అమలు చేయడానికి, బదలాయించడానికి ప్రభుత్వానికి అధికారం ఉంటుందని సెక్షన్‌లో పేర్కొన్నారు. కాలానుగుణంగా ప్రభుత్వం సూచించిన ఈ అధికారాలు మారుతూ ఉంటాయని సెక్షన్ 374-బీలో పొందుపర్చారు. అంటే ప్రభుత్వం ఓఆర్ఆర్ పరిధిలోని అన్ని రకాల ప్రభుత్వ శాఖల (జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్, రెవెన్యూ, మునిసిపాలిటీలు) అధికారాలను హైడ్రాకు బదిలీచేస్తూ ఆర్డినెన్స్‌ను రూపొందించినట్లు తెలిసింది.

ఎందుకు చేయాల్సి వచ్చింది?

హైదరాబాద్, శివారు ప్రాంతాల్లోని చెరువుల్లో ఉన్న ఆక్రమణలను తొలగించాలని హైడ్రా నోటీసులు జారీ, కూల్చివేతల సందర్భంలో వివిధ ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకోవాల్సి వస్తోంది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, రెవెన్యూ, నీటిపారుదల శాఖలపై ఆధారపడాల్సి వస్తోంది. ఆయా శాఖలకు సంబంధించిన పలు చట్టాల పరిధిలో పని చేయాల్సి వస్తోంది. ఈ సెక్షన్‌ను చేరిస్తే సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయవచ్చునని లేదా అవసరాన్ని బట్టి వారి అధికారాలు హైడ్రాకు అప్పగించాలని ఆయా శాఖలను ఆదేశించవచ్చు.


అధికారాలు బదలాయిస్తూ జీవోలు

హైడ్రాకు అధికారాలు బదలాయించే క్రమంలో ప్రభుత్వం పలు జీవోలు జారీ చేసింది. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు తెలంగాణ మునిసిపల్ చట్టం 2019, హైదరాబాద్ వాటర్ వర్క్స్ చట్టం 1989, హెచ్ఎండీఏ చట్టం 2008లోని కొన్ని అధికారాలను హైడ్రాకు ఇస్తూ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ కోర్ అర్బన్ రీజన్‌లోని చెరువుల పరిరక్షణ కమిటీ చైర్మన్‌గా, హెచ్ఎండీఏ ఎగ్జిక్యూటివ్ కమిటీలో సభ్యునిగా, ఉమ్టాలో సభ్యునిగా చేరుస్తూ వివిధ జీవోలు జారీ చేసింది. దీంతో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని అన్ని ప్రభుత్వ ఆస్తులు, చెరువుల రక్షణకు అవసరమైన అధికారాలు హైడ్రాకు దఖలు పరిచినట్లయింది.

- తెలంగాణ మునిసిపాలిటీల చట్టం 2019లోని సెక్షన్ 72 ప్రకారం మునిసిపాలిటీలను పర్యవేక్షించడానికి అధికారులను నియమిస్తూ ప్రభుత్వానికి ఉన్న అధికారం, సెక్షన్ 99ప్రకారం కమిషనర్ లేదా ఎవరైనా అధీకృత అధికారి నుంచి సమాచారాన్ని కోరడానికీ, ఆ ప్రాంతంలో ప్రవేశించే అధికారం, సెక్షన్186 ప్రకారం నీటి వనరులు, పార్కులు, వారసత్వ కట్టడాలను రక్షించే అధికారం హైడ్రాకు బదలాయించింది.
- హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ చట్టం 1989 లోని సెక్షన్-81 ప్రకారం ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రక్షణ, ఇతర విధులను నిర్వర్తించే అధికారం హైడ్రాకు ఇవ్వనున్నారు.
- హెచ్ఎండీఏ చట్టం 2008లోని సెక్షన్ 5 ప్రకారం హైడ్రా కమిషనర్‌ను హెచ్ఎండీఏ ఎగ్జిక్యూటివ్ కమిటీలో సభ్యునిగా నియమిస్తూ జీవో
- ఉమ్టాలో సెక్షన్ 16 (1) ప్రకారం హైడ్రా కమిషనర్‌ను కూడా సభ్యునిగా చేరుస్తూ జీవో జారీ.
- ఓఆర్ఆర్ పరిధిలోని మొత్తం ప్రాంతం, జంట జలాశయాలు, జంట నగరాల్లోని అన్ని చెరువుల పరిరక్షణకు సంబంధించి హైడ్రా కమిషనర్ చైర్మన్‌గా, హెచ్ఎండీఏ కమిషనర్ కో చైర్మన్‌గా చెరువుల రక్షణ కమిటీని ఏర్పాటు చేస్తూ సెప్టెంబరు 18న జీవో 129 జారీ.

తెలంగాణ బుల్డోజర్ రాజ్‌పై స్పందించండి

- రేవంత్ ఆధ్వర్యంలో నిరంకుశ పాలన
- చట్టాలను గౌరవించేలా సూచనలు చేయండి
- రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ



అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి విస్మరించారని, అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ దుర్మార్గ, దుష్ట పాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణ బుల్డోజర్ రాజ్‌పై లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ స్పందించాలని కోరుతూ సోమవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. "మీ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న నిరంకుశ పాలనకు బుల్డోజర్ ప్రతీకగా మారింది. అది తెలంగాణలో పౌరహక్కులను నిరంతరం ధిక్కరిస్తోంది. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మానవత్వాన్ని, న్యాయాన్ని బుల్డోజర్ కింద తొక్కి అణచివేస్తూ, రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడుతోంది" అని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, అస్సాం రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాల మాదిరిగానే.. తెలంగాణలోనూ కాంగ్రెస్ సర్కార్ బుల్డోజర్లను ప్రయోగిస్తోందని దుయ్యబట్టారు. మూసీ రివర్ ఫ్రంట్, హైడ్రా ప్రాజెక్టుల విషయంలో హైకోర్టు చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమన్నారు. భారతరాజ్యాంగంలో పొందుపరచిన సహజ న్యాయసూత్రాలు, చట్టాలను గౌరవించేలా ముఖ్యమంత్రి రేవంత్‌కు సలహా ఇవ్వాలని, తద్వారా రాష్ట్రంలో ఖూనీ అవుతున్న ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆ లేఖలో రాహుల్‌ను కోరారు. కాగా, కాంగ్రెస్ తనపై బురదజల్లేందుకు గోబెల్స్ ప్రచారాన్ని ఆశ్రయిస్తోందని 'ఎక్స్' వేదికగా హరీశ్ ధ్వజమెత్తారు. హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ భూముల్లో అక్రమంగా నిర్మించిన ఆనంద కన్వెన్షన్‌లో తనకు వాటాలున్నాయంటూ తనపై అబద్ధపు ప్రచారం చేస్తున్న ఎంపీ అనిల్‌కుమార్‌కు లీగల్ నోటీసులు పంపినట్లు తెలిపారు. వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పి, ఆ పోస్టు తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ స్పందిస్తూ.. ఇంతకీ ఆనంద కన్వెన్షన్ సెంటర్‌లో హరీశ్‌కు వాటా ఉందో? లేదో చెప్పలేదని వ్యాఖ్యానించారు.హరీశ్ ఈ విషయాన్ని దాస్తున్నారంటే.. నిప్పు లేనిదే పొగ రాదు అనుకోవాలా? అని నిలదీశారు.

సుందరీకరణ ముఖ్యమా?

ప్రభుత్వానికి పేద ప్రజల బతుకు ముఖ్యమా? మూసీ సుందరీకరణ ముఖ్యమా? హరీశ్ ప్రశ్నించారు. సిద్దిపేటలో ఆటో కార్మికులకు యూనిఫాంలను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రూ.లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ చేస్తే పేద ప్రజల జీవితాలు బాగుపడుతాయా? అని ప్రశ్నించారు. ఎన్నో ఏళ్లుగా ఇళ్లు కట్టుకొని నివసిస్తున్న పేదలు కన్నీరు మున్నీరవుతున్నా.. రేవంత్ గుండె కరగడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో లక్ష మంది రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా హైడ్రా డ్రామాలను ఆపాలని డిమాండ్ చేశారు.

ఢిల్లీ మద్యం కేసు విచారణ 8వ తేదీకి వాయిదా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు విచారణను రౌస్ అవెన్యూ కోర్టు మరోసారి వాయిదా వేసింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మనీలాండరింగ్ వ్యవహారానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ నమోదు చేసిన కేసుపై సోమవారం సీబీఐ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి భవేజా విచారణ చేపట్టారు. ఈ విచారణకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వర్చువల్‌గా ఈ హాజరయ్యారు. ఢిల్లీ మద్యం పాలసీలో మనీలాండరింగ్ జరిగిందంటూ కవితతోపాటు మరికొందరిపై ఈడీ అభియోగాలు మోపిన విషయం తెలిసిందే. తాజా విచారణ సందర్భంగా కవిత తరఫున న్యాయవాది మోహిత్ రావు వర్చువల్‌గా హాజరై వాదనలు వినిపించారు. అయితే, తదుపరి విచారణను అక్టోబరు 8వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు న్యాయమూర్తి కావేరి భవేజా వెల్లడించారు.

ఎమ్మెస్సీ నర్సింగ్‌కు ప్రవేశ పరీక్ష నిర్వహించాలి

- సర్కారుకు నర్సింగ్ ఆఫీసర్ల మొర

హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెస్సీ నర్సింగ్ సీట్లను ప్రవేశపరీక్ష ద్వారా కాకుండా కామన్ మెరిట్ ప్రకారం భర్తీ చేస్తుండటంతో తాము నష్టపోతున్నామని ప్రభుత్వ నర్సింగ్ ఆఫీసర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం హెల్త్ యూనివర్సిటీ ఎమ్మెస్సీ నర్సింగ్ అడ్మిషన్లను మెరిట్ ప్రతిపాదికన నిర్వహిస్తోంది. సోమాజిగూడలోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో 12 సీట్లను ఇన్‌సర్వీస్ కోటా కింద కేటాయించింది. ఇందులో ఒక ప్రైవేటు స్పాన్సర్డ్ సీటు ఉండగా.. 11 సీట్లే అందుబాటులో ఉంటున్నాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 11 వేల మందికిపైగా ప్రభుత్వ నర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో ఆరేడు వేల మంది బీఎస్సీ నర్సింగ్ వాళ్లు ఉంటారని సమాచారం. అందరికీ కలిపి 11 సీట్లే ఉండటంతో నష్టపోతున్నామని సీనియర్ నర్స్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సీట్లకు అర్హత పరీక్ష నిర్వహించి అడ్మిషన్స్ చేపట్టాలని సర్కారును కోరుతున్నారు. ఈమేరకు కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించాలని కోరుతూ హెల్త్ సెక్రటరీ, కాళోజీ హెల్త్‌వర్సిటీ వీసీ, డీఎంఈకి వినతిపత్రాలు ఇచ్చినట్టు తెలిపారు.



ఆర్మీ ప్రతినిధులకు మెషిన్ గన్స్ గురించి వివరిస్తున్న పరిశ్రమ ఎండీ శ్రీకృష్ణ

కాళ్లకల్‌లో అధునాతన మెషిన్ గన్స్ తయారీ

- డీఆర్డీఏ సహకారంతో 'లోకేశ్' పరిశ్రమలో ఉత్పత్తి
- 550 గన్స్ ఆర్మీ అధికారులకు అందజేత

మనోహరాబాద్, సెప్టెంబరు 30: డీఆర్డీఏ సహకారంతో ఆధునిక పరిజ్ఞానంతో మేడిన్ ఇండియా ఉత్పత్తిగా మెషిన్ గన్స్‌ను తయారు చేసి ఆర్మీకి అందిస్తున్నామని లోకేశ్ మిషనరీ పరిశ్రమ ప్రతినిధి లోకేశ్వరరావు తెలిపారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ గ్రామ శివారులోని టీజీఐసీసీ పారిశ్రామికవాడలో నెలకొల్పిన లోకేశ్ మిషనరీ పరిశ్రమలో ఉత్పత్తి అయిన 550 మెషిన్ గన్స్‌ను సోమవారం ఆర్మీ అధికారులకు అందజేశారు. ఆయుధ పూజ అనంతరం వాహనాన్ని ఆర్మీ ప్రతినిధుల సమక్షంలో పరిశ్రమ ఎండీ శ్రీకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఆర్మీ, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ తదితర సిబ్బంది కోసం ఆర్డర్‌పై గన్స్ తయారు చేస్తున్నట్లు ఎండీ తెలిపారు. ఈ దఫా 550 రూపొందించామని పేర్కొన్నారు. మేజర్ జనరల్ రాకేశ్ మనోచా ఆధ్వర్యంలో వాటిని అందజేసినట్లు తెలిపారు. అంతకుముందు పరిశ్రమలో మెషిన్ గన్స్‌ను ప్రదర్శించారు. ఎండీ శ్రీకృష్ణ వాటి పనితీరును ఆర్మీ ప్రతినిధులకు వివరించారు.

మాజీ ఐఏఎస్ చందనా ఖన్ కన్నుమూత



హైదరాబాద్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మాజీ ఐఏఎస్ అధికారిణి చందనా ఖన్ కన్నుమూశారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన ఆమె తన సర్వీసంతా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గడిపారు. రాజమండ్రి, శ్రీకాకుళం జిల్లాల్లో సబ్ కలెక్టర్‌గా, జాయింట్ కలెక్టర్‌గా, కడప కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రాథమిక విద్య, సర్వశిక్ష అభియాన్‌లో అనేక సంస్కరణలు అమలు చేశారు. పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో ఆమె అనేక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేశారు. ఆమె మృతిపై ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సంతాపం వ్యక్తం చేశారు. ప్రశాసన్‌నగర్‌లోని ఆమె నివాసానికి వెళ్లి చందనా ఖన్ భౌతికకాయానికి నివాళులు అర్పించారు.

సాయంత్రం బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల గడువు పొడిగింపు

- అక్టోబరు 23 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ


హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సాయంకాలం(ఈవెనింగ్) బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం సెప్టెంబరు 15తో ముగిసిన గడువును అక్టోబరు 23 వరకు పొడిగిస్తూ అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. కోర్సుల నిర్వహణకు గాను దానికి అనుబంధంగా ఉన్న రాష్ట్రంలోని 12 సాంకేతిక విద్యా సంస్థలకు అనుమతులు మంజూరు చేసింది. వాటిలో ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో 6 కాలేజీలుండగా, జేఎన్టీయూ అఫిలియేటెడ్ కళాశాలలు 5, కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఒకటి ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ప్రస్తుతం నిర్వహిస్తున్న రెగ్యులర్ బీటెక్ కోర్సుల్లో మూడు కోర్సులను సాయంత్రం వేళల్లో పార్ట్‌టైమ్‌గా కూడా నిర్వహించుకోవచ్చని మార్గదర్శకాల్లో ఏఐసీటీఈ స్పష్టం చేసింది. ఒక్కొక్క కోర్సుకు గరిష్ఠంగా 30 సీట్లకు అనుమతిస్తూనే, కనిష్ఠంగా 10 సీట్లు భర్తీ అయితేనే నిర్వహించాలని సూచించింది. అలాగే నేషనల్ బ్యూరో ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) తప్పనిసరిగా ఉండాలని పేర్కొంది. మరోవైపు అక్టోబరు 23లోగా సాయంత్రం బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేయాలని జేఎన్టీయూ భావిస్తోంది. కోర్సుల నిర్వహణ నిమిత్తం విధి విధానాలను ఖరారు చేసేందుకు కమిటీ ఏర్పాటు చేస్తూ జేఎన్టీయూ రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వరరావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

- ఖర్గేను పరామర్శించేందుకే

హైదరాబాద్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. కశ్మీరు ఎన్నికల ప్రచారం సందర్భంగా అస్వస్థతకు గురైన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను పరామర్శించేందుకే ఆయన వెళ్లినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఖర్గేను పలకరించిన తర్వాత.. అధిష్ఠానం పెద్దలనూ మర్యాదపూర్వకంగా కలిసే అవకాశం ఉందని సమాచారం. మంగళవారం సాయంత్రాని కల్లా సీఎం రేవంత్‌రెడ్డి.. తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



గోవిందరావుపేట, సెప్టెంబరు 30: వ్యవసాయం వచ్చిరాలేదు.. రెక్కల కష్టానికి ప్రతిఫలం దక్క లేదు. పెట్టుబడి కోసం తెచ్చిన అప్పు వడ్డీతో కలిపి లక్షలకు చేరింది. దీంతో ఆ రైతుల మానసికంగా కుంగిపోయాడు. చివరకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ హృదయవిదారక సంఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం లక్ష్మీపురంలో చోటుచేసుకుంది. జనగాం రమేష్(36) తనకున్న ఎకరం పొలానికి తోడు మరో మూడెకరాల భూమిని రమేష్ కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. వరి పంట సాగుచేస్తుండగా కుటుంబ పోషణ, పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వచ్చింది. ఏటా సాగులో నష్టాలు రావడం, పెట్టుబడి కూడా దక్కకపోవడంతో తెచ్చిన అప్పులు రూ.3లక్షల 50వేలకు పెరిగిపోయాయి. దీంతో రమేష్ మానసికంగా కుంగిపోయాడు. ఈక్రమంలో కుటుంబ సభ్యులు ఆయనను హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ఓ దర్గాకు శనివారం తీసుకువెళ్లారు. ఆ రాత్రి అక్కడే బస చేశారు. భార్యాపిల్లలు నిద్రపోతున్న క్రమంలో రమేష్ దర్గాలోని ఓ చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన వారు ఆయనను ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. పేదరికంలో మగ్గుతున్న రమేష్ కుటుంబ సభ్యుల వద్ద డబ్బులు లేకపోవడంతో గ్రామస్థులు చందాలు వేసుకొని అంతిమ సంస్కారాలు జరిపించారు.

రుణమాఫీ పూర్తయ్యేదాకా వదలం

(మొదటి పేజీ తరువాయి)



హైదరాబాద్ ధర్నా చౌక్‌లో రైతు హామీల దీక్షలో పాల్గొన్న ఎంపీలు కొండా విశ్వేశ్వరరెడ్డి, ఈటల రాజేందర్, డీకే అరుణ, అర్వింద్, రఘునందన్ రావు, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డి

సాధన దీక్ష చేపట్టారు. ఈ ఆందోళన మంగళవారం ఉదయం 11 గంటల వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. "రేవంత్‌రెడ్డి.. గజినీ అయ్యావా..? రైతులకు ఇచ్చిన హామీలు మరచిపోయావా..? మరచిపోయినట్లు నటిస్తున్నావా..? రైతుల కోసం ఏటా రూ.80 వేల కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటించింది వాస్తవం కాదా..? 70 లక్షల మంది రైతులకు రుణమాఫీ కోసం రూ.40వేల కోట్లు అవసరమని మీరే ప్రకటించి.. తీరా రూ.17వేల కోట్లు మాత్రమే విడుదల చేసింది నిజం కాదా..?" అని నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు వెయ్యి మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామంటేనే రేవంత్‌కు రైతులు ఓట్లేశారని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గతంలో కేసీఆర్ కూడా అలవికాని హామీలివ్వడం ద్వారా అడ్రస్ లేకుండా పోయారని తెలిపారు. కేసీఆర్‌కు అధికారం నెత్తికెక్కడానికి ఆరేడేళ్లు పడితే.. రేవంత్‌కు మూడు నెలలు కూడా పట్టలేదని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే హామీల అమలుకు రోడ్‌మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలాగే కాంగ్రెస్ కూడా రైతులను నిండా ముంచుతోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా రైతుల బతుకులు మారలేదన్నారు. రైతులకు పూర్తిస్థాయి రుణమాఫీ ఎప్పుడు చేస్తారని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. ఎవరి కోసం హైడ్రాతో హడలెత్తిస్తున్నారని రేవంత్‌ను ప్రశ్నించారు.

80% మందికి రుణమాఫీ ఎగ్గొట్టారు: అర్వింద్

రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం 80 శాతం మంది రైతులకు పంగనామాలు పెట్టిందని ఎంపీ అర్వింద్ విమర్శించారు. కేసీఆర్‌ది రాచరిక పాలన అయితే కాంగ్రెస్‌ది అరాచక పాలన అని మండిపడ్డారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం రైతులను ఎంత మోసం చేసిందో.. పది నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం అంత మోసం చేసిందని ఎంపీ రఘునందన్‌ విమర్శించారు. అధికారంలోకి వస్తే కేసీఆర్ అవినీతిపై హైకోర్టు సిటింగ్ జడ్జి చేత విచారణ జరిపిస్తామని నాడు ప్రకటించిన మీకు.. ఇప్పుడు సిటింగ్ జడ్జి దొరకడం లేదా? అని సీఎం రేవంత్‌ను నిలదీశారు.

ఢిల్లీకి రూ.25 వేల కోట్లు పంపేందుకే..!

- పార్టీ కోసం పేదలను బలి చేస్తున్న రేవంత్
- మూసీని సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్లు స్కామ్: కేటీఆర్



మూసీ బాధితులతో మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్/సిటీ/రాజేంద్రనగర్/మదీన, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఇళ్లు కూల్చే అధికారం రేవంత్‌రెడ్డికి ఎవరిచ్చారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. పేదల ఇళ్లు కూల్చి పెద్దలకు లాభం చేయమని ఇందిరమ్మ, సోనియమ్మ చెప్పిందా? అని నిలదీశారు. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు రూ.25 వేల కోట్లు పంపేందుకే రూ.1.50 లక్షల కోట్లతో మూసీ ప్రాజెక్టును ప్రభుత్వం చేపడుతోందని ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో పేదల ఇళ్లు కూలుస్తున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌తో పాటు సూర్యాపేట, ఆదిలాబాద్, సంగారెడ్డి ప్రాంతాల్లో ప్రభుత్వం దుందుడుకు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఎవరికోసం హైడ్రా తీసుకొచ్చారని సర్కారును నిలదీశారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడమే లక్ష్యమంటున్న రేవంత్‌రెడ్డి ఎఫ్‌టీఎల్‌లో ఉందని చెబుతూ.. సెక్రటేరియట్‌ను కూడా కూలుస్తారేమోనన్న అనుమానం కలుగుతోందన్నారు. చట్టప్రకారం నడుచుకోవాలని హైడ్రా కమిషనర్‌కు చెప్పిన హైకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఆయన సోదరుడి ఇల్లు కూలగొట్టాలని డిమాండ్ చేశారు. గతంలో 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ.. చెరువులకు హద్దులు ఎందుకు గుర్తించలేదు? ఎఫ్‌టీఎల్ నిర్మాణాలకు అనుమతి ఇచ్చినవారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అని నిలదీశారు. మూసీ సుందరీకరణతో రాష్ట్రానికి ఎంత ఆదాయం వస్తుంది? ఎవరి కమీషన్ల కోసం దీన్ని చేపట్టారు? అని కేటీఆర్ ప్రశ్నించారు. 1920 నుంచి 2020 వరకు మూసీలో ఎలాంటి సమస్య రాలేదని, 2020లో అతి భారీ వర్షాలతో ఇబ్బందులు తలెత్తాయని చెప్పారు. 2400 కిలోమీటర్ల పొడవైన గంగా నది ప్రక్షాళనకు రూ.40 వేల కోట్లు, సబర్మతి రివర్ ప్రాజెక్టుకు రూ.7 వేల కోట్లు ఖర్చయితే.. 55 కి.మీ. మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చుపెట్టడం కుంభకోణం కాక మరేంటని కేటీఆర్ నిలదీశారు. పేదల ఇళ్లను కూల్చేస్తుంటే తాము చూస్తూ ఊరుకోబోమన్నారు. బుల్డోజర్లకు బీఆర్‌ఎస్ నేతలు అడ్డంగా ఉంటారని హెచ్చరించారు.

ఢిల్లీ నుంచి వచ్చి క్షమాపణ చెబుతారా?

అధికారం చేపట్టిన వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్నారని, స్టాంపు పేపర్ల మీద అఫిడవిట్లు సమర్పించారని.. 300 రోజులు దాటినా ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయనేలేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో హామీలిచ్చిన రాహుల్, ప్రియాంక ఢిల్లీ నుంచి వచ్చి ప్రజలకు క్షమాపణ చెబుతారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. సోమవారం హైదర్‌గూడ, కిషన్‌బాగ్‌లో వివిధ కాలనీలకు చెందిన మూసీ బాధితుల వెతలను కేటీఆర్ తెలుసుకున్నారు. 30, 40 ఏళ్ల క్రితం ఇళ్లు నిర్మించుకొని ఉంటున్నామని, ఉన్నపళంగా వెళ్లిపోవాలంటే ఎలా? అని విలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్తాపూర్ పరిసర ప్రాంతాల్లో మార్క్ చేసిన ఇళ్ల విలువ రూ.1000 కోట్లు ఉంటుందని, మీ అక్రమార్జన కోసం పేదల ఆస్తులు పణంగా పెడ్తావా? అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. 18 వేల ఇళ్లలో ఒక్క ఇంటినీ కూల్చనీయమని, రూ.10 కోట్లు ఖర్చయినా సరే.. సుప్రీంకోర్టులో బాధితుల తరఫున బీఆర్‌ఎస్ పోరాడుతుందని చెప్పారు. 'కాంగ్రెస్ అదినేత రాహుల్ గాంధీ ఉత్తర్‌ప్రదేశ్‌లో బుల్డోజర్ వ్యవస్థ నయీ చలేగా అంటు నిరసనలు చేస్తున్నాడు. హైదరాబాద్ మీ అయ్య జాగీరా ఇక్కడ బుల్డోజర్లు పెట్టి కూల్చేస్తామంటే చూస్తూ ఊరుకోవడానికి?' అని కేటీఆర్ అన్నారు. రేవంత్ గూండాల నుంచి మిమ్మల్ని కాపాడుకుంటామని బాధితులకు భరోసా ఇచ్చారు.

రైతుల సమస్యలను బీజేపీ ఎన్నడైనా పట్టించుకుందా?

- ఆ పార్టీ నేతల మాటలు చూస్తుంటే.. వెయ్యి ఎలుకలు తిన్న పిల్లి కాశీకి వెళ్లినట్లుంది
- మాఫీపై సందేహాలుంటే నివృత్తి చేసుకోండి
- రైతును గందరగోళం చెయ్యొద్దు: తుమ్మల



హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీపై కొందరు బీజేపీ నాయకుల మాటలు చూస్తుంటే.. 'వెయ్యి ఎలుకలను తిన్న పిల్లి కాశీకి వెళ్లిన' చందంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. 2022కల్లా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. ఆదాయాన్ని రెట్టింపు చేయకపోగా గత పదేళ్లలో పెరిగిన ఖర్చులతో పోల్చుకుంటే నికర ఆదాయం కూడా పెరగలేదని చెప్పారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేసి, ఆదుకోవాలంటూ రాజధానిలో రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపిన రైతుల సమస్యలను ఎప్పుడైనా పట్టించుకున్నారా? అని బీజేపీ నేతలను నిలదీశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఒక్క చోటైనా రుణమాఫీ చేసి చూపించగలరా? కొన్ని లక్షల కోట్లు ఎగ్గొట్టిన పారిశ్రామిక వేత్తల నుంచి నిధులు రికవరీ చేసి దేశవ్యాప్తంగా రైతులకు రుణమాఫీ చేయగల నిబద్ధత బీజేపీకి ఉందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రాష్ట్ర రైతాంగానికి భరోసా కల్పించే బాధ్యత తమదేనన్నారు. ఇప్పటికే సన్న వడ్లకు రూ.500 బోనస్ ప్రకటించామని.. పంటలన్నింటినీ మద్దతు ధరతోనే కొనుగోలు చేసే విధంగా కృషి చేస్తున్నామని తుమ్మల తెలిపారు. రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రుణమాఫీలో అక్కడక్కడా ఏర్పడుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించుకుంటూ అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి వర్తింపచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిపై సందేహాలుంటే బీజేపీ పెద్దలు స్వయంగా వచ్చి నివృత్తి చేసుకోవాలని, రైతాంగాన్ని గందరగోళంలోకి నెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు మాఫీ అందనివారి వివరాలన్నీ వచ్చిన తర్వాత మొదట రూ.2 లక్షలలోపు రుణం ఉన్న కుటుంబాలకు, తర్వాత 2 లక్షలకు పైన మిగిలి ఉన్న కుటుంబాలకు షెడ్యూలు ప్రకటించి మాఫీ చేస్తామని చెప్పారు. కాగా, కేంద్రం అందిస్తున్న పీఎం-కిసాన్ పథకంలో ఆర్థిక సాయాన్ని పెంచాలని, ఏడాదికి రూ.6 వేలు కాకుండా ఎకరానికి రూ.7,500 అందిస్తే రైతులు రుణపడి ఉంటారని పేర్కొన్నారు.

రాష్ట్ర రైతులకు రూ.2 లక్షల కోట్ల నష్టం..

రైతులకు కనీస మద్దతు ధర హామీని కేంద్రం అమలు చేయకపోవడంతో తెలంగాణ రైతులు గత తొమ్మిదేళ్లలో రూ.2 లక్షల కోట్లు నష్టపోయారని తుమ్మల ఆరోపించారు. కేంద్రం నాఫెడ్ ద్వారా పప్పుధాన్యాలు, నూనె గింజలను తక్కువగా సేకరిస్తోందని, పైగా వాటిని ఏటా సేకరించడం లేదని చెప్పారు. రైతు ఉద్యమం సందర్భంగా అమరులైన 708 మందికి పైగా రైతు కుటుంబాలకు తక్షణ పరిహారం చెల్లించి, రైతుల డిమాండ్లు పరిష్కరించే విధంగా ప్రయత్నాలు చేయాలని బీజేపీ పెద్దలకు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

పండుగకు 6వేల ప్రత్యేక బస్సులు

- ఎంజీబీఎస్, జేబీఎస్‌తో పాటు హైదరాబాద్ శివార్ల నుంచి కూడా నడపాలని ఆర్టీసీ నిర్ణయం
- ప్రత్యేక బస్సుల్లోనూ రిజర్వేషన్ సదుపాయం
- నేటి నుంచే ప్రత్యేక బస్సు సర్వీసులు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగలకు ప్రత్యేక బస్సులను ఎంజీబీఎస్, జేబీఎస్‌తో పాటు హైదరాబాద్ శివారు ప్రాంతాల నుంచి కూడా నడపాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. గ్రేటర్ నుంచి సొంతూళ్లకు వెళ్లే వారికోసం ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్, సంతోష్‌నగర్, కేపీహెచ్‌బీ, ఇతర ప్రాంతాల నుంచి స్పెషల్ సర్వీసులను అందుబాటులో ఉంచనుంది. ఐటీ కారిడార్ ఉద్యోగుల సౌకర్యార్థం గచ్చిబౌలి ఓఆర్ఆర్ మీదుగా విజయవాడ, బెంగళూరు, ఇతర ప్రాంతాలకు బస్సులు నడపనున్నారు. పండుగల వేళ నగరంలో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు. దసరాకు ప్రత్యేక బస్సులు, రద్దీ ప్రాంతాల్లో ప్రయాణికులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సోమవారం క్షేత్రస్థాయి అధికారులతో టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ వర్చ్‌వల్‌గా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దసరా పండుగ నేపథ్యంలో 6 వేల ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్టోబర్ 1 నుంచి 15 వరకు ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రత్యేక బస్సుల్లో రిజర్వేషన్ సౌకర్యాన్ని కూడా కల్పించినట్లు చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రం నలుమూలలతో పాటు ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రలకు కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. 9,10,11 తేదిల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముందని, ఆయా రోజుల్లో అవసరాలకు అనుగుణంగా ఎక్కువ సంఖ్యలో ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు.

కరీంనగర్, నిజామాబాద్‌కు ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సులు

కరీంనగర్, నిజామాబాద్ మార్గాల్లో కొత్త ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సులను నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. గత దసరాతో పోల్చితే ఈసారి మహాలక్ష్మి పథకం అమలుతో పాటు అక్టోబర్ నెలలో 11 శుభ ముహూర్తాలు కూడా ఉన్నాయని, ఆ రద్దీకి తగ్గట్లు బస్సులు నడపాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. రద్దీని బట్టి ప్రత్యేకబస్సులు అందుబాటులో ఉంచాలన్నారు. సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు ఆర్టీసీ వెబ్‌సైట్‌లో రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. దసరా స్పెషల్ బస్సులకు సంబంధించి ఇతర సమాచారం కోసం 040-69440000, 040-23450033 నంబర్లను సంప్రదించాలన్నారు.


బాలిక మృతికి కారణమైన భార్యాభర్తలకు జీవిత ఖైదు

- ఇంటి పనులకు పెట్టుకుని చిత్రహింసలు

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 30: ఇంట్లో పనికి పెట్టుకున్న బాలికను చిత్రహింసలకు గురిచేసి ఆమె మరణానికి కారణమైన భార్యాభర్తలకు జీవిత ఖైదు పడింది. ఈ శిక్ష విధిస్తూ సంగారెడ్డిలోని ఫ్యామిలీ కోర్టు న్యాయాధికారి కె.లావణ్య బాల్‌రెడ్డి సోమవారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్‌కు చెందిన జాకీర్ అహ్మద్ (54) అతని భార్య రజియా సుల్తానా (51)లు ఐదు సంవత్సరాల బాలికను ఇంట్లో పనికి పెట్టుకున్నారు. పనులు సరిగ్గా చేయకపోవడంతో ఆ బాలికను తీవ్రంగా హింసించేవారు. శరీర భాగాలపై కాల్చడం, వాతలు పెట్టడం వంటివి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడి 2015 జనవరిలో మరణించింది. శిశు సంక్షేమ శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు కొండాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● మంగళవారం 1 అక్టోబరు 2024



ఎన్టీఆర్ వర్సిటీ మెడికల్ పీజీ నోటిఫికేషన్

విజయవాడలోని డా.ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (ఎన్‌టీఆర్‌యూహెచ్ఎస్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ డిగ్రీ/డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. మేనేజ్‌మెంట్ కోటా కింద ప్రైవేట్ నాన్ మైనారిటీ, మైనారిటీ మెడికల్ కాలేజీల్లో; స్టేట్ కోటా/కాంపిటెంట్ అథారిటీ కోటా కింద డా.ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(ఎన్‌టీఆర్‌యూహెచ్ఎస్), శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(స్విమ్స్) అనుబంధ కళాశాలల్లో సీట్ల భర్తీకి విడివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో 50 శాతం సీట్లను స్టేట్ కోటా/కాంపిటెంట్ అథారిటీ కోటా కింద, మిగిలిన 50 శాతం సీట్లను ఆలిండియా కోటా కింద భర్తీ చేస్తారు. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ నాన్ మైనారిటీ, మైనారిటీ మెడికల్ కాలేజీల్లో 50 శాతం సీట్లను కాంపిటెంట్ అథారిటీ కోటా కింద, మిగిలిన 50 శాతం సీట్లను మేనేజ్‌మెంట్ కోటా కింద భర్తీ చేస్తారు. పీజీ డిగ్రీ వ్యవధి మూడేళ్లు. పీజీ డిప్లొమా వ్యవధి రెండేళ్లు.

అర్హత: పీజీ మెడికల్ డిగ్రీ/డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. ఆగస్టు 15 నాటికి ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి. నీట్ పీజీ 2024 ఎగ్జామ్‌లో జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 50 పర్సంటైల్; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 40 పర్సంటైల్; జనరల్ కేటగిరీ దివ్యాంగులకు 45 పర్సంటైల్ మార్కులు ఉండాలి. మెడికల్ కౌన్సిల్ గుర్తింపు తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** తెలుగు రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన అభ్యర్థులకు రూ.7080; ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన వారికి రూ.10,620; విదేశాల్లో చదివినవారికి రూ.15,340
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 4
- **వెబ్‌సైట్:** https://drntr.uhsap.in



యూక్యూ-ఐఐటీడీ రీసెర్చ్ అకాడమీలో

పీహెచ్‌డీ

ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీడీ), ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ క్వీన్స్‌లాండ్(యూక్యూ) ఉమ్మడిగా నిర్వహిస్తున్న యూక్యూ-ఐఐటీడీ రీసెర్చ్ అకాడమీ- జాయింట్ పీహెచ్‌డీ ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. భారతదేశ అభ్యర్థులు ఇండియాలో మూడేళ్లు; ఆస్ట్రేలియా-బ్రిస్బేన్‌లో ఏడాది చదవాల్సి ఉంటుంది. అలాగే ఆస్ట్రేలియా అభ్యర్థులు బ్రిస్బేన్‌లో మూడేళ్లు; ఇండియాలో ఏడాది చదవాలి. అకడమిక్ మెరిట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులకు రెండు యూనివర్సిటీలు ఉమ్మడిగా డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీని అందిస్తాయి.

విభాగాలు: ఆర్కిటెక్చర్ అండ్ ఎన్విరాన్‌మెంట్, ఆర్కిటెక్చర్, ఆర్కిటెక్చర్-ప్లానింగ్-డిజైన్, బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్, ఎకనామిక్స్ అండ్ లా, ఇంజనీరింగ్, హెల్త్ అండ్ బిహేవియరల్ సైన్సెస్, హ్యూమానిటీస్, హ్యూమానిటీస్-సోషల్ సైన్సెస్-ఎడ్యుకేషన్, ఐటీ అండ్ కంప్యూటర్ సైన్స్, మెడిసిన్, ప్లానింగ్ అండ్ డిజైన్, సైన్స్ అండ్ మేథమెటిక్స్, సోషల్ సైన్సెస్ అండ్ ఎడ్యుకేషన్.

అర్హత: ఇంజనీరింగ్/టెక్నాలజీ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ/బ్యాచులర్స్ డిగ్రీ లేదా మాస్టర్స్ డిగ్రీ(సైన్సెస్/ఆర్ట్స్/హ్యూమానిటీస్) లేదా ఎంబీబీఎస్/బీడీఎస్/ఎండీఎస్/బీహెచ్ఎంఎస్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. పీజీ స్థాయిలో 65 శాతం మార్కులు, డిగ్రీ స్థాయిలో 80 శాతం మార్కులు ఉండాలి. గేట్/యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్/ఐకార్/ఐసీఎంఆర్/డీఎస్‌టీ-ఇన్‌స్పైయిర్ స్కోర్ తప్పనిసరి. కనీసం రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉన్న వారికి జాతీయ పరీక్ష స్కోర్ అవసరం లేదు. ఆస్ట్రేలియా అభ్యర్థులకు జీఆర్ఈ/ఐఈఎల్‌టీఎస్/టోఫెల్ స్కోర్ ఉండాలి.

స్కాలర్‌షిప్: భారతదేశ అభ్యర్థులకు మొదటి ఏడాది నెలకు రూ.47,000; రెండో ఏడాది సంవత్సరానికి 35,000 ఆస్ట్రేలియన్ డాలర్లు; చివరి రెండేళ్లు నెలకు రూ.52,000ల స్టయిపెండ్ ఇస్తారు. ట్రావెలింగ్ ఖర్చుల నిమిత్తం రీలొకేషన్ గ్రాంట్ కింద 5,200ల ఆస్ట్రేలియన్ డాలర్లు; రెండేళ్లకు హెల్త్ కవరేజ్ సింగిల్ పాలసీ ఇస్తారు.

- ఆస్ట్రేలియా అభ్యర్థులకు స్టయిపెండ్ కింద ఏడాదికి 35,000 ఆస్ట్రేలియన్ డాలర్లు; రీలొకేషన్ గ్రాంట్ కింద 2,500 ఆస్ట్రేలియన్ డాలర్లు; ఐఐటీడీ నుంచి ట్రావెల్ ఇన్సూరెన్స్ అందిస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 3
- **అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** అక్టోబరు 30
- **ఇంటర్వ్యూలు:** నవంబరు 3 నుంచి 21 వరకు
- **వెబ్‌సైట్:** https://home.iitd.ac.in

లాల్ బహదూర్ శాస్త్రి ఇన్‌స్టిట్యూట్‌లో

పీజీడీఎం

ఢిల్లీలోని లాల్ బహదూర్ శాస్త్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఎల్‌బీఎస్ఐఎం)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి మూడు చొప్పున మొత్తం ఆరు ట్రైమెస్టర్‌లు ఉంటాయి. ఇందులో కంపల్సరీ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, సమ్మర్ ఇంటర్న్‌షిప్, రీసెర్చ్ ప్రాజెక్ట్ ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌నకు ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. జాతీయ స్థాయి పరీక్ష స్కోర్, అనుభవం, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 15 మందికి మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్ అందిస్తారు. అకడమిక్ ప్రతిభ, కుటుంబ ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటూ ఎంపిక చేసినవారికి ఒక్కొక్కరికి రూ.లక్ష చెల్లిస్తారు.



స్పెషలైజేషన్‌లు: జనరల్, రీసెర్చ్ అండ్ బిజినెస్ అనలిటిక్స్, ఈ బిజినెస్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2024/జీమ్యాట్(2021 జనవరి 1 నుంచి 2025 జనవరి 31 మధ్య)/ఎక్స్‌ఏటీ 2025 స్కోర్ ఉండాలి. రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. స్పాన్సర్డ్ అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది.

ఎంపిక: క్యాట్/ఎక్స్‌ఏటీ/జీమ్యాట్ స్కోర్, అకడమిక్ ప్రతిభ, అనుభవం ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ ఎబిలిటీ టెస్ట్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. జాతీయ పరీక్ష స్కోర్‌కు 60 శాతం; అకడమిక్ మెరిట్, అనుభవం, గ్రూప్ డిస్కషన్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, ఇంటర్వ్యూ స్కోర్‌కు 40 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేసి అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,200
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** డిసెంబరు 15
- **రిటెన్ ఎబిలిటీ టెస్ట్, జీడీ, ఇంటర్వ్యూ కేంద్రాలు:** హైదరాబాద్, చెన్నై, బెంగళూరు తదితర నగరాలు
- **వెబ్‌సైట్:** www.lbsim.ac.in

జాబ్ కార్నర్



కేజీబీవీల్లో ఉద్యోగాలు

ఖాళీలు: 604

ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా సొసైటీ(పాఠశాల విద్యాశాఖ) ఆధ్వర్యంలో నిర్వహించే కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను(ఏడాది) కింద పేర్కొన్న ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. బోధన సిబ్బందిని ఒప్పంద ప్రాతిపదికన బోధనేతర సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియామక ప్రక్రియ చేపడతారు.

1. ప్రిన్సిపాల్: **10 పోస్టులు**
2. పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ): **165 పోస్టులు**
   సబ్జెక్టులు: ఇంగ్లీష్/సివిక్స్/కామర్స్/మేథ్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీ/బోటనీ/జువాలజీ/ఒకేషనల్.
3. కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్(సీఆర్‌టీ): **163 పోస్టులు**
   సబ్జెక్టులు: తెలుగు, హిందీ, ఇంగ్లిష్, మేథ్స్, ఫిజికల్ సైన్స్, బయాలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్.
4. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(పీఈటీ): **4 పోస్టులు**
5. పార్ట్‌టైం టీచర్(పీటీటీ): **165 పోస్టులు**
6. వార్డెన్: **53 పోస్టులు**
7. అకౌంటెంట్: **44 పోస్టులు**

వయోపరిమితి: ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు 18-42 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, మాజీ సైనికులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

గౌరవ వేతనం: నెలకు ప్రిన్సిపాల్‌కు రూ.34,139, పీజీటీకి రూ.26,759, సీఆర్టీకి రూ.26,759, పీఈటీకి రూ.26,759, అకౌంటెంట్‌కు రూ.18,500, వార్డెన్‌కు రూ.18,500, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్‌కు రూ.18,500.

ఎంపిక ప్రక్రియ: అకడమిక్ మార్కులు, సర్వీస్ వెయిటేజీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు రుసుము: రూ.250

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 18

వెబ్‌సైట్: https://apkgbv.apcfss.in/

బామర్ లారీ లిమిటెడ్‌లో జూనియర్ ఆఫీసర్లు

కోల్‌కతాలోని ప్రభుత్వ రంగ సంస్థ- బామర్ లారీ అండ్ కంపెనీ లిమిటెడ్...ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 4

1. జూనియర్ ఆఫీసర్(సేల్స్ అండ్ మార్కెటింగ్): **2 పోస్టులు**
2. జూనియర్ ఆఫీసర్(ఆపరేషన్స్): **2 పోస్టులు**

అర్హత: ఏదైనా డిగ్రీ

వయోపరిమితి: 30 ఏళ్లు మించకూడదు

ఎంపిక ప్రక్రియ: దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

పని ప్రదేశాలు: బెంగళూరు, కోల్‌కతా

దరఖాస్తులకు చివరి తేదీ: అక్టోబరు 4

వెబ్‌సైట్: https://www.balmer-lawrie.com/



ఎడ్‌సిల్ లిమిటెడ్‌లో ఐటీ స్టాఫ్

ఖాళీలు: 20

ఢిల్లీలోని ఎడ్‌సిల్ లిమిటెడ్... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. సీనియర్ కన్సల్టెంట్: **1 పోస్టు**
2. కన్సల్టెంట్ - మేనేజ్‌మెంట్: **3 పోస్టులు**
3. సివిల్ ఇంజనీరింగ్: **2 పోస్టులు**
4. సాఫ్ట్‌వేర్ డెవలపర్: **4 పోస్టులు**
5. పబ్లికేషన్ అండ్ బ్రాండింగ్ ఎక్స్‌పర్ట్: **1 పోస్టు**
6. అకౌంటెంట్: **3 పోస్టులు**
7. ఐటీ స్టాఫ్: **6 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీకాం, బీఎస్సీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంకాం, బీటెక్/ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.

వయోపరిమితి: సీనియర్ కన్సల్టెంట్ పోస్టుకు 50 ఏళ్లు; ఇతర పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు

ఎంపిక విధానం: విద్యార్హతలు, పని అనుభవం, రాత పరీక్ష, ఇంటర్వ్యూ, పీపీటీ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 14

వెబ్‌సైట్: https://www.edcilindia.co.in/

ఎన్ఐటీఎంలో టెక్నికల్ అసిస్టెంట్స్

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్)కు చెందిన కర్ణాటక, బెళగావిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రెడిషనల్ మెడిసిన్(ఎన్ఐటీఎం)... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 4

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు ఫీజు: రూ.300

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'ద డైరెక్టర్, ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రెడిషనల్ మెడిసిన్, నెహ్రూనగర్, బెళగావి చిరునామాకు పంపించాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 18

వెబ్‌సైట్: https://icmrnitm.res.in/

చిట్టీస్


అహంకారంతో ఆనందం దూరం

ఒక తోటలో చాలా రకాల పూలు ఉండేవి. వాటిలో ఒక గడ్డి పువ్వు కూడా ఉంది. ఒక ఉదయం పూట ఇద్దరు మనుషులు ఆ పూలతోటకు వచ్చి అన్ని మొక్కలను చూస్తూ, దాన్ని చూసి గడ్డిపువ్వు అయినా ఎంత అందంగా ఉందో అన్నారు. ఆ మాటలు విన్న గడ్డి పువ్వు చాలా ఆనందించింది.ఆ తోటలో ఉన్న అన్ని పూలకంటే తానే అందమైన దాన్ని అనుకున్నది. దాని మనసులో తాను మిగతా పూలకన్నా ప్రత్యేకం అనే భావన ప్రవేశించింది. అదే ఆలోచనతో తన పక్కనున్న మొక్కలకు పూచిన పూలు తనను స్నేహంగా పలకరించినా మొహం తిప్పుకుని వాటితో మాట్లాడకుండా ఉండటం తన గొప్పతనం అనుకున్నది.




ఇదేమిటి అని అడిగిన మిగతా పూలతో ఉదయం కొందరు ఈ తోటకు వచ్చి, అన్ని పూలనుచూసి అన్నిటి కంటేనేనే అందంగా ఉన్నానుఅని చెప్పి, వెళ్లారు, రేపో మాపో నేను చాలా మంచి స్థానంలో ఉంటాను అని వాటితో చెప్పింది. ఆ మర్నాడు ఉదయం గుడిలో దేవుడికి పూల మాలలు సమర్పించడానికి గుడి పూజారి పూలు కోసుకెళ్లడానికి వచ్చాడు మందారాలు, నంది వర్ధనాలు,పారిజాతాలు వంటి అన్నిపూలను కోసాడు కానీ ఈ గడ్డి పువ్వు వంక తిరిగి కూడా చూడలేదు గడ్డి పువ్వుకు బాధ కలిగినా ఈయన కాకపోతే మరొకరు వచ్చి,నన్ను మంచి చోటుకు తీసుకుపోతారు అని తనను తాను ఓదార్చుకుంది. ఆ రోజు సాయంత్రం అత్తర్లు తయారు చేసే వ్యాపారి పూల సేకరణ కోసం వచ్చాడు అతను మల్లెలు గులాబీలనే తప్ప మిగతా పూలను పట్టించుకోలేదు,ఈ గడ్డిపువ్వు వంక తిరిగి చూడనైనా చూడలేదు. ఈసారి గడ్డిపువ్వు ఇంకా ఎక్కువ బాధ పడింది. ఆ మర్నాడు పెద్ద గాలివాన వచ్చి, గడ్డిపువ్వు ఎగిరిపోయి దూరంగా ఉన్న చెత్తకుప్ప మీద పడిపోయింది. అహంకారంతో మిగతా ఏ పూలతో మాట్లాడకుండా ఉన్నగడ్డిపువ్వుకు ఆ చెత్తకుప్ప మీద అసలు మాట్లాడటానికి వేరే పువ్వులే కనిపించలేదు. అనవసరంగా తోటలో మంచి మిత్రులను దూరం చేసుకున్నాను కదా అని బాధ పడింది గడ్డిపువ్వు.

10 తేడాలను కనిపెట్టండి





సరైన నీడ ఏది?





డైలీ సుడోకు - 423

					2	3	9	
8			3	6			1	7
				7	1			8
	4				8			3
		7				4		
2			4				7	
5			2	4				
1	2			3	7			9
	6	9	1					

సుడోకు - 422 సమాధానం

7	8	3	1	9	6	5	4	2
1	5	6	4	2	7	3	8	9
4	2	9	5	3	8	7	1	6
5	3	1	8	4	9	6	2	7
8	6	2	7	5	1	4	9	3
9	7	4	2	6	3	1	5	8
6	4	5	9	7	2	8	3	1
3	9	8	6	1	5	2	7	4
2	1	7	3	8	4	9	6	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.